
# నిన్ను నీవు తెలుసుకో



కె. ఉషారంగరాజు

# నిన్ను నీవు తెలుసుకో

సత్యాన్వేషకుడే సాధకుడు

శ్రీరమణ మహర్షి ఇన్‌స్టిట్యూట్ ఫర్
లెర్నింగ్ - పాలకొల్లు

SRINIVASA VARMA. M.

కె. ఉషారంగరాజు

ప్రథమ ముద్రణ : ఆగష్టు 1990

ద్వితీయ ముద్రణ : ఫిబ్రవరి 1991

తృతీయ ముద్రణ : నవంబరు 1993

చతుర్ధ ముద్రణ : మార్చి 1997

ప్రతులకు :

శ్రీరమణాశ్రమము

శ్రీరమణాశ్రమము ***(P. O)***

తిరువణ్ణామలై - 606 603

శ్రీరమణ మహర్షి ఇనిస్టిట్యూట్ ఫర్ లెర్నింగ్

53-8-4 శ్రీరమణ హృదయం భవన్, శ్రీరమణ నగర్

పాలకొల్లు - 534 261 ప॥ గో॥ జిల్లా.

ముద్రణ :

శ్రీ వరలక్ష్మి పవర్ ప్రెస్

లాకువద్ద - పాలకొల్లు 534 260

**వెల : రూ. 15-00**

# ప్రముఖుల అభిప్రాయాలు

శ్లో॥ క్రిమికీట పతంగేభ్యః పశవః ప్రజ్ఞయాధికాః
పశ్వాదిభ్యోనరాః ప్రజ్ఞాః

క్రిమికీటకాదులకన్న పశువులు ఆ పశువులకంటే నరులు శ్రేష్ఠులని ఆర్యవచనాలు. జంతువులకులేని జిజ్ఞాస మానవునిలోని ఉత్తమ గుణం, ప్రత్యేక లక్షణం. ఈసృష్టి అంతా ఇలా క్రమంగా యెందువలన జరుగుతుంది? దీన్ని నడిపించేశక్తి ఏదైనా ఉందా? ఉండి తీరాలి! ఆదిమానవుని నాటినుండి నేటి ఆధునికుని వరకు అంతుచిక్కని అపరిష్కృత సమస్య ఇది. రూపనామ క్రియా రహితమై అగోచరమైన యీ అనంతశక్తి యున్నదని విశ్వసించే వర్గాన్నే ఆస్తికులు అనే పేరుతో పిలుస్తూ వుంటారు. ఆస్తికులంటే కొందఱు విద్యావంతుల దృష్టిలో కూడా అనామకులుగా అజ్ఞానులుగా పరిగణింపబడే యీ కాలంలో ఆస్తికత్వమును గూర్చి బోధించడానికి ప్రయత్నం చేయడమంటే "తివిరియిసుమున తైలంబు తీయవచ్చు" అనే భర్తృహరి మహాకవి భావాన్ని స్మరణ చేసుకోక తప్పదు.

ఈత చేతగానివాడు గోదావరి ఈదటం గొప్ప కాదనటం, రామాయణాధి పురాణాదుల్ని చదవకుండానే విమర్శించడం ఈ రోజుల్లో ఒక పరిపాటి అయిన పొరపాటు.

ధర్మవ్యతిరేక శక్తుల ప్రాబల్యంచేత ఈనాడు సంఘంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. అటువంటి యీ తరుణంలో

ఆశాజ్యోతిలా ఆవిర్భవించినవారు "శ్రీనాన్నగారు" (శ్రీభూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజుగారు) వీరి సబ్బోధనల వలన ప్రభావితులైనవారే శ్రీయుతులు ఉషా రంగరాజు దంపతులు. శ్రీనాన్నగారి సత్సంగమే వీరినిట్లొనర్చినది.

శ్లో॥ కందలయత్యానందం నందత్యనిలేందు చందనానిభృశమ్
మందయతిమందహాసం సంధత్తే సంపదోఽపి సత్సంగః

అనికదా విబుధ వాక్యం.

తమ జ్ఞానదీపికతో మరొక దివ్వెను ప్రకాశింపచేసే ఉద్యమమే అ,ఆ,లు మొదలుకొని అద్భుతపద్యరత్నాల వఱుకు అందించే పెద్దబాలశిక్షలా నడిచిన "నిన్ను నీవు తెలుసుకో" అనే గ్రంథం. కృషీవల ధర్మంలో వీరు వెదజల్లిన బీజాలు రాళ్ళ రప్పలపైన అంకురించక పోయినా, మంచిమాగాణాలో పడినవైనా ఫలిస్తాయని ఆశిద్దాము.

శశిశ్రీ, జె. సోమేశ్వరరావు
శ్రీశ్రీనివాస కవితా ప్రపంతి
గుమ్మలూరు

ఉషా రంగరాజు అధ్యాత్మిక రచనలలో మొదటిది "పసిడి పలుకులు" రెండవది "నిన్ను నీవు తెలుసుకో"

ఒకవిధముగా ఈ పుస్తకము సంకలనము. దీనికి మూలము శ్రీనాన్న (శ్రీభూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజు) గారిచ్చిన ప్రసంగాలు. వారు శ్రీభగవాన్ రమణుల విచార మార్గోపదేశాన్ని జీర్ణించుకుని అనుభవపూర్వకముగా తెలిసినవారు వారి ప్రవచన ముల స్పష్టత సారళ్యములు ఉషా రంగరాజు గ్రంథములో ఎల్లెదల కానవచ్చునవి.

ఇందు మోక్షసాధనసామాగ్రి సవిశేషముగా వివరింపబడింది. ఆ సాధనా సాఫల్యానికి శ్రద్ధ మూలకందము అది పూర్ణముగా నున్న ఉషా రంగరాజు తన అధ్యయనము నుండి అభ్యాస అను భవముల దారిని సుదూరము పయనింప గలరని నాఆశ,ఆశీస్సులు.

తిరువణ్ణామలై
3-10-90

డా॥ ఓరుగంటి రామచంద్రయ్య
యం. ఏ. పి. హెచ్. డి.
(రిటైర్డు) ప్రొఫెసర్ హిస్టరీ & అర్కియాలజీ
ఆంధ్రా యూనివర్సిటి మరియు
"శ్రీరమణ భాషణములు" అనువాదకులు

నేడు భారతదేశములో మత, జాత్యహంకారములు అధికమై దేశఐక్యతకు ముప్పువాటిల్లుచున్నది. ఇట్టితరుణములో ఉషా రంగ రాజు వ్రాసిన "నిన్ను నీవు తెలుసుకో" అను గ్రంథము ప్రజావళి సహజీవనమునకు ఎంతయో ఉపయోగించును. సులభశైలిలో, తేలిక భాషలో వ్రాయబడి అతి సామాన్య ప్రజలకు కూడా మిక్కలి ఉపయోగపడును.

ఇందు "నేను", భక్తి హింస, అహింస, ఆత్మజ్ఞానము, ప్రేమ తత్వము మొదలగు వివిధ అంశములు విడివిడిగా విభజింపబడి స్పష్టముగా వివరింపబడినవి. సద్గ్రంథములు, సత్పురుషుల ప్రబోధములు అందుబాటులో లేనివారికి కూడా నిత్య జీవితములో వేదాంత, వైరాగ్యములు ఆచరణ సాధ్యమగురీతి ఇందు తెలుపబడినది. నిత్యజీవితములో సులభ పద్ధతిని దైవచింతన చేయుటకు ఈ గ్రంథము ఎంతయో ఉపయోగ పడగలదు.

కేశవరం
12-2-91

దండు గోపాలరాజు
బి. యస్. సి. బి. ఇ. డి.
(రిటైర్డు) హెడ్ మాష్టారు
మరియు సోషల్ వర్కర్
కేశవరం - ప॥ గో॥ జిల్లా.

"నిన్ను నీవు తెలుసుకో" అనే గ్రంథరాజము శ్రీనాన్న (భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజు) గారి నోటి ద్వారా వెలువడిన ఆకాశగంగ, ఆత్మాన్వేషణకు సహకరించే ఉపాసనా మార్గాలన్ని సవివరంగా తేలిక భాషలో ప్రవచనముల ద్వారా అందించిన శ్రీనాన్నగారి కృషి, శ్రీనాన్నగారి అమృతవాక్కులు గాలిలో కలిసి పోకుండా ఒక క్రమపద్ధతిలో సంకలనము చేసిన శ్రీ ఉషా రంగరాజు శ్రద్ధ యీ గ్రంథరూపకల్పనకు కారణ మయ్యాయి.

పుణ్యం పండినవాళ్ళు తప్ప ఇతరులు ఈ గ్రంథము యొక్క అంతస్తును గుర్తించలేరు. ఆధ్యాత్మికముగా పయనించ్తే వారికి ఈ గ్రంథము వరప్రసాదం, కల్పవృక్షం. నమ్మినవారికి కొంగు బంగారం. భావితరాల వాళ్లకు సంపదల గనిలా అవిర్భవించినది.

సాగిరాజు రామకృష్ణంరాజు
అర్ధవరం, గణపవరం మండలం
ప॥ గో॥ జిల్లా.

అర్ధవరం
21-8-90

★

శ్రీరమణ మహర్షి భక్తులు "శ్రీనాన్నగారు"గా పేరు పొందిన శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగముల సంకలనమే - "నిన్ను నీవు తెలుసుకో" శ్రీ రమణ మహర్షుల భోధనలకు ఇది శ్రీనాన్నగారి వివరణ.

"ఆంధ్రజ్యోతి"
దినపత్రిక

భగవాన్ శ్రీరమణ మహర్షి స్వయంకృతమైన "నేనెవడను" అను సద్గ్రంథమునకు విస్తృత వినూత్న రూపకల్పనే "నిన్ను నీవు తెలుసుకో".

"దేవుడు లేడు" అనేమానవుడు ఉండవచ్చునేమోగాని "నేను-లేను" అనే మానవుడు లేడుకదా! ప్రతిమానవునిలోను "నేను-నేను" అంటున్నవాడు ఒకడు వుండడం అందరికీ అనుభవములో నున్న విషయమే! నిన్ను నీవు తెలుసుకుంటే సర్వ అనర్థములనుండి సృష్టి చక్రము నుండి బయటపడి అమృత స్థితిని పొందుతావు. నిన్ను నీవు తెలుసుకొనుట ఏవేవి సహకరిస్తాయో? ఎవరెవరు ఏవిధముగా సహకరిస్తారో? ఏమార్గము ఎలా సహకరిస్తుందో? ఈపుస్తకమునందు విపులముగా పొందుపరచబడినది.

డిశంబరు - 1990 **శ్రీ రామకృష్ణ ప్రభ మాసపత్రిక**

మైలాపూర్, మద్రాసు.

★

శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజుగారు (శ్రీనాన్నగారు) నాకు చిరకాల మిత్రులు వారి ప్రవచనములు కలిగిన "నిన్ను నీవు తెలుసుకో" అను గ్రంథమును చదివించుకొని విన్నాను. నాన్నగారి వాక్కులో శక్తి ఉన్నది. వారి ఊహలు పవిత్రమైనవి. భగవాన్ శ్రీరమణ మహర్షి యొక్క బోధలు హృదయమునకు గట్టిగాపట్టిన మహవ్యక్తి. భగవాన్‌వారి ద్వారా పలుకుచున్నారు. ఇది మహోత్తమగ్రంథము చదివి ప్రశాంతినిపొందండి.

**అత్యం నరసింహమూర్తి**

పాలకొల్లు యం. ఏ. (న్యూయార్క్)

11-2-91 పాలకొల్లు - ప॥ గో॥ జిల్లా.

# అంకితం



"రూపము" తో ఆకర్షించి
"చూపుల" తో తన్మయ పరచి
"మాటల" తో ముగ్ధులనుచేసి
"పనుల" తో పాఠాలునేర్పి
"20నెలల" కర్మ శేషాన్ని
ఈ భూమి మీద అనుభవించి
"ఈశ్వరుని" సన్నిధికి చేరిన
మా ముద్దుల మేనకోడలైన
బేబి "దేవీ అరుణ దివ్య"కు
ఈ పుస్తకము అంకితము.

— కె. ఉషా రంగరాజు

# కృతజ్ఞతలు

శ్రీ నాన్నగారి ప్రవచనాల నుండి వెలువడిన ఆణి ముత్యాలను, శాశ్వత సత్యాలను సంగ్రహించి వాటిని క్రోడీకరించి ఈ పుస్తకము ద్వారా మీ అందరికి అందించే అవకాశము కలిగినందులకు మాకు ముదావహము.

శ్రీ నాన్నగారి ప్రవచనాల సారాన్ని పుస్తక రూపము లోనికి తెమ్మని మమ్ములను ప్రోత్సాహించిన శ్రీమతి కలిదిం బంగారమ్మ గారికి, శ్రీమతి కోసూరి సూర్యకాంతమ్మ గారికి, ఈ పుస్తకము వ్రాయుటకు సహకరించిన శ్రీ సత్తిరాజు సత్యనారాయణమూర్తి గారికి, సహాయ సహకారములను అందించిన శ్రీ సాగిరాజు రామ కృష్ణంరాజుగారికి, శ్రీ ఇందుకూరి వెంకట్రామరాజుగారికి మరియు ఈ కృషిలో సహకరించిన వారందరికీ మా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము.

ఈ కృషిలో మాకు ప్రత్యక్షముగాను, పరోక్షముగాను సహకరించి మాలో హృదయ స్పందన కల్గించి తద్వారా ఈ పుస్తకము మీకు అందించే మహాభాగ్యమును కల్గించిన తండ్రికి మా హృదయ కుసుమాన్ని అర్పించు కొంటున్నాము.

ప్రేరణ వారిది - శక్తి ఈశ్వరునిది - ఫలితమే

"నిన్ను నీవు తెలుసుకో"

— కె. ఉషా రంగరాజు

# కుసుమాంజలి

★

1. ఆర్తులై మీ చెంత కరుదెంచిన జనులను
తల్లిదండ్రుల కంటే ఎక్కువ ఆప్యాయతతో
ఆదరించి, కరుణా పూరితముగా పలుకరించి,
పలుకు, పలుకున తత్వమును చిలుకరించి,
చల్లని చూపులతో జ్ఞాన జిజ్ఞాసను కలుగచేసే
తండ్రికి మాహృదయ కుసుమాన్ని అర్పిస్తున్నాం.

2. ఏది కర్మమో। ఏది ధర్మమో। ఏది జ్ఞానమో।
ఎరుగని అజ్ఞానంలో ఉన్న మానవాళికి
శ్రీరమణ మహర్షియొక్క జ్ఞానమార్గమును చూపి
ఉపన్యాసాల ద్వారా మానవాళిని ఉత్తేజ పరచి
జనులను చైతన్యవంతులుగా తీర్చి దిద్దుతున్న
తండ్రికి మా హృదయ కుసుమాన్ని అర్పిస్తున్నాం.

3. గృహస్థాశ్రమము విడనాడమని చెప్పుటలేదు
అన్న పానాదులు మానుకోమని చెప్పుటలేదు
వృత్తులను వదలి పెట్టమని చెప్పుటలేదు
ఎవరి వృత్తులువారు చేసుకుంటూనే మీలోవున్న
అహంవృత్తిని విడనాడమని చెప్పుచున్న
తండ్రికి మా హృదయ కుసుమాన్ని అర్పిస్తున్నాం.

4. ఫలపుష్పాలతో కాదు దైవాన్ని పూజించేది
మీ సద్గుణాలతో భగవంతుణ్ణి పూజించాలని
భగవంతుడిని మీరు స్మరించడంకాదు
ఆ భగవంతుడే మిమ్ములను స్మరించేలా
దైవసంపదను అభివృద్ధి చేసుకోమనే
తండ్రికి మా హృదయ కుసుమాన్ని అర్పిస్తున్నాం.

5. ఉన్నది ఒకటే "ఆత్మ" అది మీరై ఉన్నారని
మీకంటే భిన్నముగా భగవంతుడు లేడని
సరళముగా, సుస్పష్టముగా, సూటిగా సాటిచెప్పి
ఆత్మను తెలుసు కొనుటయే మీ గమ్యమని
ఆత్మజ్ఞానము వైపునకు మానవాళిని నడిపిస్తున్న
తండ్రికి మా హృదయ కుసుమాన్ని అర్పిస్తున్నాం.

6. మీరు ఎవరో మీకు తెలియక పోవటమే బంధం
మిమ్ములను మీరు తెలుసుకోవవమే మోక్షం
ఏ మతములోనున్న, ఏ దైవాన్ని ఆరాధించినా
పూజ చేసినా, ప్రార్థన చేసినా, నమాజ్ చేసినా
మిమ్ములను మీరు తెలుసు కొనుటయే గమ్యమనే
తండ్రికి మా హృదయ కుసుమాన్ని అర్పిస్తున్నాం.

— కె. ఉషా రంగరాజు

# మా మాట...

నేను 1981 సం॥రం సెప్టెంబరు నెల 23వ తేదీన అరట్లకట్ట గ్రామములో "శ్రీనాన్నగారి" ఉపన్యాసమును మొట్టమొదటిసారిగా విన్నాను. శ్రీనాన్నగారి నిరాడంబరత, ముఖవర్చస్సు, చిరునవ్వు, శ్రావ్యమైన కంఠధ్వని, ఉపన్యసించుతీరు నన్ను ఎంతగానో ముగ్ధుణ్ణి చేశాయి. ఒక విషయాన్ని అన్ని కోణముల నుండి చెప్పి ఆ విషయము మన బుద్ధికి అందేటట్లు చెప్పగల విశిష్టత శ్రీనాన్నగారిలో వున్నదని, ఆ ఉపన్యాసమును విన్న తరువాత నాకు అనిపించింది.

వృత్తి రీత్యా శ్రీనాన్నగారి అమూల్యమైన ఉపన్యాసములు ప్రత్యక్షముగా వినలేకపోయినా, పరోక్షముగా శ్రీనాన్నగారి ఉపన్యాసములను చదువుతూ, ఉపన్యాసములను క్యాసెట్లద్వారా వింటూ వుండేవాడిని. "భగవాన్ శ్రీ రమణ మహర్షి" విశిష్టత శ్రీనాన్నగారి ఉపన్యాసములు విన్న తరువాత మాకు తెలిసినది. స్వప్నములో చూసిన తరువాత తెలిసినది. శ్రీరమణ మహర్షి మౌన భోద. భగవాన్ శ్రీరమణ మహర్షి ఉపదేశము చాల స్వచ్ఛమైనదిగా మాకు స్ఫురించినది. అస్వచ్ఛమైన ఉపదేశము "శ్రీనాన్నగారి" ద్వారా మేము పొందటం జన్మాంతర అనుబంధముగా భావించితిమి.

శ్రీ నాన్నగారి ప్రోత్సాహముతో మేము 1984 సం॥రం అక్టోబరు నెల 2వ తేదీన తిరువణ్ణామలైలో గల "శ్రీరమణాశ్రమము"ను మొట్ట మొదటిసారిగా దర్శించినాము. క్షేత్రప్రభావము

ఎలా ఉంటుందో శ్రీరమణాశ్రమము దర్శించిన తరువాతే మాకు తెలిసినది. గిరిప్రదక్షిణ చేస్తూ వుంటే ఆ ప్రదేశము ఎంతో చిరపరిచితము అయినట్లుగా మాకు అనిపించినది. విరూపాక్షగుహ, స్కందాశ్రమము మామనస్సులను చల్లపరిచాయి. మేముశ్రీరమణా శ్రమములోవున్న అయిదురోజులు మా జీవితములో మరుపురాని, మరువలేని మధుర స్మృతులుగా మిగిలి పోయాయి.

అరుణాచలము నుండి తిరిగి వచ్చిన తరువాత కొన్ని నెలల వరకు, అరుణాచలములో దర్శించిన ప్రదేశములే మాకు గుర్తుకు వచ్చేవి. తీరిక సమయములలో శ్రీనాన్నగారి ఉపన్యాసములను మననము చేస్తూ వుండేవారము. ఆ ఉపన్యాసములను మననము చేస్తూ వుంటే పోయిన ఆణిముత్యాలు దొరికితే ఎంత ఆనందముగా వుంటుందో అంత ఆనందముగా వుండేది.

ఒకరోజు శ్రీనాన్నగారి ప్రవచనము మననముచేస్తూ వుండగా ఒక మహత్తర సందేశము నాకంట పడినది. "శాస్త్రములు చదువ టానికి, సత్పురుషులను దర్శించటానికి, దైవాన్ని స్మరించుటకు సమయములేదు మాకు తొందర పనులు వున్నాయి అంటారు. కాని ప్రాణము పోయే సమయములో నాకు తొందర పనివుంది అంటే మృత్యువు ఆగుతుందా?" ఆ తేనేపలుకు నాలో ఎంతో పరివర్తనము కలిగించినది. ఆ రోజునుండి శ్రీనాన్నగారి సమక్ష ములో వుండటం, ఉపన్యాసములను ప్రత్యక్షముగా వినటం, శాస్త్రములు చదవటం, మొదలు పెట్టాను.

శ్రీనాన్నగారి రూపము చూడగానే మనస్సులో ఏకాగ్రత ఏర్పడేది. ఆయన సన్నిధిలో మాకు తల్లిదండ్రుల ఆప్యాయతను మించిన ఆప్యాయత. ఆదరణ లభ్యమయ్యాయి. కరుణాపూరిత

మైన ఆయన చూపులు మా మనస్సులను చల్లపరిచేవి. అజ్ఞాన మనే సముద్రంలో కొట్టుకుపోయే మాకు శ్రీనాన్నగారు "పడవ" లాగ భగవాన్ శ్రీరమణ మహర్షి "చుక్కాని"లాగ దొరికి మమ్ము లను జ్ఞాన మార్గమువైపునకు మరల్చారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి "సత్యాత్మ ప్రతినిధి" అయితే, శ్రీనాన్నగారు "రమణ ప్రతినిధి". అజ్ఞానమనే వృక్షమును నరకు టకు "నేనెవడను" అనే గొడ్డలిని, దేహాభిమానము నుండి బయట పడుటకు "అక్షర మణమాల" అనే మాలను, ఉపదేశమునకు "ఉపదేశసారము" అనే మంత్రదండమును మాచేతిలో వుంచారు ఈసద్గ్రంథాన్ని, భగవాన్ శ్రీరమణ మహర్షి స్వయం కృతములే. మొదట ఆ గ్రంథములు అంతంత మాత్రముగానే అర్ధమయ్యేవి. "శ్రీరమణాశ్రమ లేఖలు" "భగవాన్ స్మృతులు" మమ్ములను శ్రీభగవాన్‌కు సన్నిహితులుగా చేసినవి. "శ్రీరమణ భాషణములు" మాకు కలిగిన సందేహములను నివృత్తి చేసినవి.

శాంతితోను, పవిత్రతతోను నిండిన శ్రీనాన్నగారి పలుకులు మమ్ములను పులకరించి ప్రభావితులుగా చేసినవి. శ్రీనాన్నగారు చెప్పిన మాటలు హృదయములో మెదులుతూ వుంటే మనస్సు సూక్ష్మమై, ఆ గ్రంథములలోని పరమార్ధమును అర్ధము చేసుకొనే స్థితికి మా బుద్ధి ఎదిగినది. ఇది అంతయు ఆ తండ్రి కరుణా కటాక్షమే.

శ్రీనాన్నగారి దృష్టి పథములో అడుగిడితే జ్ఞాన పథము లోనికి అడుగిడినట్లే. ఆయన సాంగత్యము వలన మనలో మంచి సంస్కారములు ఏర్పడి, మన మనస్సు సంస్కరింప బడుతుంది. శ్రీనాన్నగారు మనలను సంస్కరించాలి అనే తపనతోనే ఉపన్యాస

ములు యిచ్చు చున్నారు. మనము కూడా తపనతో ఆ ఉపన్యాస ములను వింటే ఆ ప్రవచనములలోని పవిత్రతత మనకు తప్పక అందుతుంది.

ఏపలుకులైతే మాకు హృదయ స్పందన కలిగించినవో, ఆ పలుకులను అందరికీ పంచి యివ్వాలనే తపనతో శ్రీనాన్నగారు నోటి నుండి వెలువడిన పలుకులను సంగ్రహించి, "పసిడిపలు కులు"గా లోగడ మీకు పుస్తక రూపములో అందించి వున్నాము. శ్రీనాన్నగారి ప్రవచనముల సారమునంతా ఒక పుస్తకములో క్రోడీకరించాలని మాకు సదుద్దేశము కలిగినది. దాని ఫలితమే.

## "నిన్ను నీవు తెలుసుకో"

పంచదార నోట్లో పోసుకుంటే తియ్యగా వుంటుంది. కాని ఆ తీయదనము ఎలా వుంటుంది అంటే చెప్పలేము. దానియొక్క మాధుర్యము అనుభవించిన వారికే తెలుస్తుంది. అదే విధముగా శ్రీనాన్నగారి తేనేపలుకులలోని తియ్యదనము మాత్రమే మాకు అందినది. ఆయన అనుభవించుచున్న మాధుర్యమును ఏమని వ్రాయగలము? ఏమని వర్ణించ గలము? మాటలకు, ఊహలకు రచనలకు అందేదికాదు "సత్యాత్మ"

శ్రీనాన్నగారి చెప్పిన మాటలను శ్రద్ధగా శ్రవణముచేసి, శ్రవణము చేసిన మాటలను మననము చేసి, అర్థము చేసుకొని, ఆచరణలోనికి తెచ్చుకుంటే మన స్వరూపమును మనము తెలుసు కోవటానికి సహకరిస్తాయి. తండ్రి అనుగ్రహము బిడ్డలమీద ఎప్పుడూ వుంటుంది. బిడ్డల అభివృద్ధికి సహాయము అందులూనే వుంటుంది.

— కె. ఉషా రంగరాజు



# భగవాన్ శ్రీరమణమహర్షి జీవిత సంగ్రహము

★

మద్రాసు రాష్ట్రంలోని మధుర సమీపంలోని "తిరుచ్చిళి" అనే పుణ్యక్షేత్రంలో 1879వ సంవత్సరం డిశంబరు 29వ తేదీ రాత్రి ఒంటిగంటకు అళగమ్మ, సుందరమయ్యార్ అను పుణ్య దంపతులకు ద్వితియ సంతానంగా ఒక మగబిడ్డ పుట్టాడు.

పునర్వసు ఘడియలో జన్మించిన బిడ్డకు తమ ఇలవేలుపు అయిన తిరుపతి వేంకటేశ్వరస్వామి పేరు కలిసే విధముగా "వేంకటేశ్వరన్" అని పేరు పెట్టారు. కుటుంబ సభ్యులు "వేంకట్రామన్" అని పిలిచేవారు.

విధివశాత్తు వేంకట్రామన్ బాల్యంలోనే అయన తండ్రి సుందరమయ్యార్ కాలధర్మం చెందారు.

వేంకట్రామన్ చదువు సంధ్యలు మధురలో ఆయన పిన తండ్రి ఇంటివద్ద సాగినవి. వేంకట్రామన్ చదువు సంధ్యలు కంటే ఆటపాటలు మీద ఎక్కువ ఆసక్తిచూపించేవాడు.

1895 ప్రాంతంలో ఒకనాడు వేంకట్రామన్‌కు ఒక బంధువు ఎదురయ్యాడు.

"ఎక్కడ నుండి మీరాక?" అని ప్రశ్నించాడు వేంకట్రామన్.

"అరుణాచలం" నుండి వస్తున్నాను అన్నాడు ఆ బంధువు.

అరుణాచలం అన్నపేరు వినగానే వేంకట్రామన్‌కు భగవంతుడు గుర్తుకు వచ్చాడు. భగవంతుని దగ్గరనుండి రాకపోకలు సాధ్యమా! అని ఆశ్చర్యపడినాడు. కాని అరుణాచలం ఒక ఊరు అని అనుకోలేదు. అది వేంకట్రామన్ జన్మాంతర సంస్కారము.

అరుణాచలం పేరు విని పరవశించిన కొన్ని దినములకే "పెరియపురాణం" వేంకట్రామన్ కంట పడింది.

పెరియపురాణంలోని అరవై ముగ్గురు శివభక్తుల జీవితగాథలు వేంకట్రామన్ శ్రద్ధగా చదివినాడు. వారిలో ఒకరిగా నేను కాగలనా అనుకున్నాడు.

1896 సం॥రం జూలై 16వ తేదీన మధురలో వేంకట్రామన్ మేడ మీద గదిలో ఒంటరిగా కూర్చున్నాడు. మంచి ఆరోగ్యంగా ఉన్నాడు.

హఠాత్తుగా మృత్యువు వేంకట్రామన్ మీద పడింది. శ్వాస ఆగిపోయినది. చేతులు కాళ్ళు అచేతనాలు అయిపోయాయి.

వేంకట్రామన్ ఆత్మస్ఫురణ అనుభవిస్తూనే ఉన్నాడు. ఈదేహం శవమైనది. దీనిని నలుగురు శ్మశానానికి తీసుకొని వెళ్ళి బూడిద చేస్తారు. మరణించేది దేహమే! "ఆత్మ"కు మృత్యువులేదు అని అనుభవపూర్వకంగా గ్రహించాడు. ఈ విధముగా వేంకట్రామన్ మృత్యుంజయుడైనాడు.

మృత్యానుభవంతో వేంకట్రామన్ జీవితం పూర్తిగా మారిపోయినది, వైరాగ్యం ఆయన్ని వరించినది.

1896వ సం॥రం ఆగష్టు 20వ తేదీన వేంకట్రామన్ తనకు ఇచ్చిన హోమ్ వర్కు చేస్తూ ఉండగ కళ్ళు మూతలు పడినవి.

అంత పరధ్యానంగా ఉండే వానికి చదువు ఏమి వంటబడు తుంది ! అడవుల్లోకోపోయి తపస్సు చేసుకోరాదా ! అన్నాడు అన్న నాగస్వామి.

వేంకట్రామన్‌కు అన్న మందలింపులో పరమేశ్వరుని పిలుపు వినపడినది. ఎక్కడకి వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళాలి? అనుకోగా హృదయంలో అరుణాచలం, అరుణాచలం అని మారు మ్రోగింది.

వేంకట్రామన్ తనకి ప్రవేటు క్లాసు ఉందని అన్నగారితో మొదటి సారిగా అబద్ధం చెప్పాడు. పెట్టెలోంచి ఐదు రూపాయలు తీసి తన కాలేజీ ఫీజు కట్టమన్నాడు వేంకట్రామన్ అన్నగారు. వేంకట్రామన్ మూడు రూపాయలు మాత్రమే తీసుకొని పెట్టెలో ఒక చీటీ వ్రాసి పెట్టి ఫలాయనం చిత్తగించాడు.

ఆ చీటీలో "నాతండ్రి ఆజ్ఞను అనుసరించి వెళ్ళుచున్నాను" ఈ శరీరము కొరకు పరితపించ వలదు నన్నువెదకుటకు ధనమును వ్యయము చేయవద్దు. నీ కాలేజీ ఫీజు కట్టలేదు. ఇట్లు అని సంతకం చేయలేదు.

ఇంటి నుండి బయలుదేరిన వేంకట్రామన్ రైలులో విల్లు పురం చేరి విల్లుపురం నుంచి మాంబళం అక్కడ నుండి కాలి నడక సాగించాడు.

1896వ సం॥రం సెప్టెంబరు 1వ తేదీ సూర్యోదయ సమ యంలో వేంకట్రామన్ తిరువణ్ణామలై చేరాడు.

వేంకట్రామన్ వడివడిగా అరుణాచలేశ్వరుని ఆలయానికి పరుగెత్తాడు. ఎందుకో ఆరోజు గర్భగుడితోసహా దేవాలయ ద్వార ములు అన్ని తెరువబడి యున్నవి.అప్పా ! నీ ఆజ్ఞ మేరకు వచ్చానని ఈశ్వరునకు విన్నవించు కున్నాడు. అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకొని వెలుపలికి వచ్చి దుస్తులను, జందెమును తీసివేసి కౌపీనం ధరించాడు వేంకట్రామన్. వేంకట్రామన్ మొదట

అరుణాచలేశ్వరుని ఆలయ ప్రాంగణములోని ఉన్న వేయిగాళ్ళ మండపములో దీక్ష ప్రారంభించాడు.

తరువాత వేంకట్రామన్ గుళ్ళో, గుహల్లో, చెట్లక్రింద ఎండలో, వానలో సంవత్సరాలకు సంవత్సరాలు సమాధి స్థితిలో ఉండి పోయాడు. అక్కడి ప్రజలు వేంకటామన్‌ను బ్రాహ్మణస్వామి అని పిలిచేవారు.

అళగమ్మ మూడు సంవత్సరాల తరువాత కుమారుని జాడ తెలుసుకొని అరుణాచలం వచ్చి రాళ్లు కరిగేటట్లు ఏడ్చింది. కాని వేంకట్రామన్ మనస్సు కరుగలేదు.

1899వ సం॥రం ఆరంభంలో స్వామి విరూపాక్షగుహ చేరు కున్నాడు 17 సంవత్సరాలు అక్కడే గడిపాడు.

1907 సం॥రంలో మహాకవి శ్రీకావ్యకంఠ గణపతిముని స్వామిని దర్శించి నేను సమస్త శాస్త్రాలను చదివినాను, సంతృప్తిగా తపస్సు చేశాను, కాని నాకు శాంతి లభించలేదు. తపస్సు అంటే ఏమిటో వివరించండి అని వేడు కొన్నాడు.

"నేను" ఎక్కడ పుడుతుందో చూడు మనస్సు అక్కడే లయిస్తుంది.

మనస్సు మంత్రాన్ని జపిస్తున్నప్పుడు మంత్రనాదం ఎక్కడ పుడుతుందో చూడు మనస్సు అక్కడే లయిస్తుంది. ఇదే తపస్సు అన్నారు స్వామి.

ఈ ఉపదేశము విన్న శ్రీకవ్యకంఠ గణపతిముని ఉప్పొంగి పోయి తన గురుదేవునికి "భగవాన్ శ్రీరమణ మహర్షి" అని పేరు పెట్టారు.

1916 సం॥రంలో అళగమ్మ తన కుమారునితో ఉండాలని తిరువణ్ణామలై చేరింది. 1917 సం॥రంలో భగవాన్ కందస్వామి నిర్మించిన స్కందాశ్రమము చేరినారు.

1922వ సం॥రం మే నెల 19వ తేదీన అళగమ్మకు అవసాన సమయము సమీపించినది. భగవాన్ ఒకచేయి ఆమె శిరస్సుపైన, ఒకచేతిని హృదయంపైన ఉంచి కర్మపాశం నుండి విముక్తురాలిని గావించినారు.

అళగమ్మను కొండపాదంలో సమాధి చేశారు. తరువాత ఆ సమాధిపై మాతృ భూతేశ్వరాలయము వెలిసినది.

1922 సం॥రం డిశంబరు నెలలో ఒకరోజున స్వామి కొండపై గల ఆశ్రమమునకు తిరిగి రాకుండ తల్లి సమాధి దగ్గర ఉండి పోయారు. నాటి నుండి రమణాశ్రమము ప్రారంభము అయినది.

ముందు ఒక పూరిపాకతో ఆరంభము అయిన ఆశ్రమము భగవాన్ జీవిత కాలంలో వంటశాల, భోజనశాల, దర్శనము ఇచ్చు హాలు, గోశాల మున్నగు భవనాలు ఏర్పడినవి.

భగవాన్ ఆశ్రమంలో ఎక్కువ భాగం మౌనంగానే ఉండే వారు. ఆర్తితో ప్రశ్నించినవారికి తృప్తికరమైన జవాబు లభించెడిది. సరసమైనవాటికి సూటిగాను, వింత ప్రశ్నలకు ఛలోక్తిగాను జవాబులు ఇచ్చెడివారు.

1948వ సం॥రంలో భగవాన్ ఎడమచేతి మీద చిన్నగడ్డ ప్రారంభమైనది. రెండుసార్లు ఆపరేషన్ చేసినారు ప్రయోజనంలేదు.

1950వ సం॥రం ఏప్రిల్ 14వ తేదీ రాత్రి 8 గంటల 47 నిమిషములకు భగవాన్ భౌతిక శరీరాన్ని పరిత్యజించారు. ఆ శరీరంలోంచి కాంతివంతమైన తేజస్సు ఒకటి వెలువడి ఆకాశములో పయనించి అరుణాచలం శిఖరంలో కలిసి పోయెను.

భగవాన్ భౌతికకాయం భూస్థాపితం చేయబడినది. దానిపై శివలింగమును ప్రతిష్ఠ చేసినారు. అదే నేడు రమణేశ్వరాలయంగా విలసిల్లు చున్నది.

నేడు భగవాన్ శరీరము లేకపోయినను మన హృదయంలో "ఆత్మ" రూపములో సజీవముగా ఉన్నారు.



# శ్రీ నాన్నగారి
# జీవిత సంగ్రహము

★

శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజుగారు 1934 సం॥రం సెప్టెంబరు 23వ తేదీ పౌర్ణమి ఆదివారం ఉదయం 9 గంటల 15 నిమిషములకు పశ్చిమ గోదావరి జిల్లా కొమ్మర గ్రామములో వారి తాతగారి ఇంటివద్ద జన్మించారు.

ఆయన తల్లిపేరు రాజయమ్మ, తండ్రిపేరు సూర్యనారాయణ రాజు, వీరి తాతగారి పేరు రంగరాజుగారు, వీరి నాయనమ్మగారి పేరు పాపాయమ్మగారు, వీరి స్వగ్రామము జిన్నూరు.

ఆయన పూర్వీకులు ఆస్తిక చింతన కలవారు. ఆయనకు ఉన్న తాత్విక చింత వంశ పారంపర్యముగా వచ్చినది.

ఆయనకు సాంఘిక సేవపట్ల ఆసక్తి ఎక్కువగా ఉండెడిది కష్టాలను సుఖాలుగా మార్చుకోవటం అలవాటు చేసుకున్నారు. ఆయనకు జీవితము పట్ల విరుద్ధమైన వైఖరి లేదు.

1954 సం॥రం మార్చి నెలలో వారి అమ్మమ్మగారైన సీతమ్మగారితో కలిసి ఉత్తరాది పుణ్యక్షేత్రాలు అన్ని దర్శించినారు. హృషీకేష్‌లో శ్రీస్వామి శివానంద ఆశీర్వాదమును పొందినారు.

1957 సం॥రంలో ఆయనకు స్వప్నంలో ఒక ముసలివ్యక్తి దర్శనమిచ్చి ఆయన ఉడిబుగ్గమీద ముద్దుపెట్టుకొని ఆశీర్వదించి నారు. తరువాత ఆ స్వప్నంలో కనిపించిన ముసలి వ్యక్తియే

"భగవాన్ శ్రీరమణ మహర్షి" అని తెలుసుకొని భగవాన్ తనను పక్వము చేయుటకు వచ్చినట్లుగా స్ఫురించినది.

1959 సం॥రం జనవరి నెలలో వారి స్నేహితులు సుబ్బరాజు గార్లతో తిరువణ్ణామలైలోవున్న శ్రీరమణాశ్రమమును మొదటిసారిగా సందర్శించినారు. నాటి నుండి "రమణ" సందేశము ఇచ్చుచూ అయన జీవితమును "భగవాన్ శ్రీరమణ మహర్షికి" అంకితము చేసినారు.

అయన ద్వారా రమణ సందేశమును విన్నభక్తులు అయనను ప్రేమతో "శ్రీనాన్నగారు" అని పిలుస్తూ వుంటారు. ఆ పేరే సార్థక నామధేయమై విలసిల్లు చున్నది.

శ్రీ నాన్నగారు భక్తుల అహ్వానమును పురస్కరించుకొని అప్పుడప్పుడు ఇతర గ్రామములలో ఉపన్యసించెడివారు. 1982 సం॥రం నుండి జిన్నూరు గ్రామములో ప్రతి అదివారం ఉపన్యాసములు జరిగెడివి. ఇప్పుడు ఇతర గ్రామభక్తుల అహ్వానమును పురస్కరించుకొని తరచుగా అయా గ్రామములలో ఉపన్యసించు చున్నారు.

శ్రీ నాన్నగారిని ఇంటివద్ద కూడ దర్శించి భక్తులు వారికిగల సందేహములను నివృత్తి చేసుకొను చున్నారు.

శ్రీనాన్నగారు జీవించుతీరు అత్యంత సామాన్యము. అయనను దర్శింప వచ్చిన వారందరిని తల్లితండ్రుల కంటే ఎక్కువ అప్యాయతగా పలుకరించి, యోగక్షేమములను అడిగి తెలుసు కుంటూ ఉంటారు.

శ్రీనాన్నగారుసామాన్యమానవులందరికి అందుబాటులోఉండి, అందరితో కలసిమెలసి వుంటూ, అడిగే ప్రశ్నలకు చక్కటి సమాధానములు యిచ్చి మనకు జ్ఞాన జిజ్ఞాసను కలుగచేయుచున్నారు.

శ్రీనాన్నగారు నేటి మానవుడు అర్థము చేసుకోగల భాషలోను పామరులు కూడ తెలుసుకోగల రీతిలోను "సనాతన సత్యము"ను గూర్చి బోధించు చున్నారు.

శ్రీనాన్నగారి తాత్వికచింతన సమగ్రమైనది. ఆయన సన్నిధి మనకు శాంతి యిస్తుంది. ఆయనతో సహవాసము మన సాధనకు ఉపయోగపడుతుంది.

శ్రీనాన్నగారి ఉపన్యాసములలో "ఆత్మ" తత్వమే ఎక్కువగా వినిపిస్తుంది.

నిద్రలేచినది మొదలు, మరల నిద్రపోయే వరకు మనకు ఎన్నోభావాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాని "నేను" అనే భావన మాత్రము పోదు అది కామన్‌గా ఉంటుంది. ఈకామన్‌గా ఉండే "నేను" అను తలంపుయొక్క మూలాన్ని పట్టుకుంటే మనమెవరమో మనకు తెలుస్తుంది అంటున్నారు శ్రీనాన్నగారు.

ఎవరు ఏ మతములో నున్న మానవుడు తన హృదయంలో ప్రశికాస్తున్న "ఆత్మ" స్వరూపమును తెలుసుకొనేవరకు "మోక్షం" పొందలేడు అంటారు శ్రీనాన్నగారు.

పొట్టకోసం ఎవరు ఏ వృత్తి చేస్తున్న మనిషి బంధిస్తున్న అహం వృత్తిని విడిచి పెట్టాలి అంటారు శ్రీనాన్నగారు.

త్యాగికి లోకం అంతా ఆనంద మయముగ ఉంటుంది అంటారు శ్రీనాన్నగారు.

శ్రీనాన్నగారి పలుకులు మృధుమధురము, సుస్పష్టముగా సరళముగా ఉంటాయి. ఆయన ప్రతీ పలుకు పసిడి పలుకే! ఆయన పలుకులు "పసిడి పలుకులుగా" భావించినవి. ఆయన చేసిన భోధలు "అమృత వాక్కులు"గా విలసిల్లినవి.

# నివేదన

"అహం బ్రహ్మాస్మి" [నేను బ్రహ్మ (ఆత్మ) స్వరూపుడను] అంటుంది వేదమాత. "అయామ్ దట్ అయామ్" [నేను నేనై (ఆత్మనై) ఉన్నాను] అంటుంది బైబిల్. "అనల్ హక్" [నేను సత్యాన్నై (ఆత్మ) ఉన్నాను.] అంటుంది ఖురాన్. ఈ మూడు మత గ్రంథములు ఉన్నది ఒక్కటే "ఆత్మ" అని చాటి చెప్పు చున్నవి.

మతాలు పుట్టక ముందు కూడా ఆత్మ ఉంది. ఆత్మను తెలుసుకొనుట కోసమే మతాలు పుట్టినవి. "మతి" నుండి పుట్టినదే 'మతము.' మతము అంటే మాటకు సంబంధించినది కాదు అది అనుభవమునకు సంబంధించినది. మతము మానవులను వివేక వంతులుగా చేయాలి కాని, బానిసలుగా తయారు చేయకూడదు. మతము అంటే ఉన్మాదము కాదు-మనస్సును సంస్కరించేదే మతము.

మత గ్రంథము లన్నింటిలో ఉన్నది ఒక్కటే ఆత్మ అని చాటి చెప్పుచున్నను మత సమన్వయమును ఎందుకు పెంచుకొన లేకపోతున్నాము? మతము పేరుమీద మూఢ విశ్వాసములను పెంచుకోవటం వలన మత సమన్వయమును పెంచుకోలేక పోతు న్నాము. అజ్ఞానమునకు మతపిచ్చి తోడైతే, మానవజాతి అభ్యు దయము కుంటు పడుతుంది. మనిషిని, మనిషిని వేరుచేస్తున్న ఈ మతాల అడ్డు గోడలను అతిక్రమించి, అమృత వస్తువును (ఆత్మ) అందు కొన్నవాడే మహనీయుడు.

మతములు వేరువేరు మార్గములను చూపినప్పటికిని, గమ్యము మాత్రము మోక్షమే. మనము మతములు చెప్పినట్లు జీవిస్తే గమ్యము చేరవచ్చును. ఆత్మ ఏదో ఒక మతమునకు సంబంధించినది కాదు. విశ్వవ్యాప్త మైనది. సత్యానికి మించిన మతముకాని, దేవుడుకాని, జాతికాని, కులముకాని, ఈ సృష్టిలో లేనేలేదు. ఏ మతములో ఉన్నా ఆత్మను దర్శించిన వాడే జ్ఞాని అవుతాడు, దేవుని బిడ్డ అవుతాడు, ప్రవక్త అవుతాడు.

మానవాళిని అజ్ఞానమనే చీకటి నుండి దాటించుటకు అవతార పురుషులు, ఆచార్యులు, జ్ఞానులు ఈ భూమిమీద అవతరించారు వీరు లోకములోనున్న దుఃఖమును ఆర్పుటకు ప్రయత్నము చేసారు. మానవాళికి ఆత్మ జ్ఞానమును బోధించారు. ఆత్మాన్వేషణలో జీవితము గడిపితేగాని అజ్ఞానము విడిచి పెట్టదు.

తాను పొందిన ఆత్మ వైభవమును రాత్రియనక, పగలనక బోధించుచూ సామాన్య మానవులతో కలసి మెలిసి జీవించినవాడు "బుద్ధుడు." కాలినడకను దేశమంతా తిరిగి, ఆత్మతత్వమును చాటిచెప్పినవాడు "శ్రీశంకరాచార్యులు." భక్తిపారవశ్యముతో తాను ఆత్మానందమును అనుభవించుచూ, భక్తి జ్ఞానమునకు మాత అని చాటి చెప్పినవాడు "శ్రీరామకృష్ణ పరమహంస." ఆధ్యాత్మిక వైభవమును దేశ విదేశాలలో మార్మ్రోగించినవాడు "వివేకానందుడు." ఆశ్రమవాసియై నిరంతరము జనులకు దర్శనమిచ్చి ఆత్మ మార్గమును సూటిగా చాటి చెప్పినవాడు "భగవాన్ శ్రీరమణ మహర్షి."

"నేను" అనే ప్రథమ తలంపు ఉంటే అంతా ఉంది. అది లేకపోతే ఏదిలేదు-అని తెలియ జేయుటకు భగవాన్ శ్రీరమణ

మహర్షి ఈలోకమునకు దిగి వచ్చారు. అన్ని తలంపులకు మూలము "నేను" అనే ప్రథమ తలంపే అని, ఈ నేను పుట్టిన తరువాతనే ఇతర తలంపులు పుట్టుకు వస్తాయని, ఈనేను యొక్క మూలము తెలుసుకుంటే నిన్ను నీవు తెలుసు కుంటావని భగవాన్ శ్రీరమణ మహర్షి బోధించారు.

భగవాన్ శ్రీరమణ మహర్షి మానవాళికి ప్రసాదించిన అమర సందేశము నిన్ను నీవు తెలుసుకో "నిన్ను నీవు-నీ స్వరూపమైన ఆత్మను,దేహానికి పరిమితమైన నీవు-తెలుసుకో" నిన్ను నీవు తెలుసుకోకుండా దైవాన్ని తెలుసు కున్నాను అనుకోవటం మానసిక దృశ్యమే అన్నారు శ్రీభగవాన్. నిన్ను నీవు తెలుసుకుంటే, గాఢ నిద్రలో అనుభవించు చున్న సుఖాన్ని, శాంతిని జాగ్రదవస్థలో ఎఱుకతో అనుభవించ వచ్చును. సృష్టి చక్రము నుండి బయట పడవచ్చును అనేవారు భగవాన్ శ్రీరమణ మహర్షి.

పూజ్యులైన శ్రీనాన్నగారు భగవాన్ శ్రీరమణ మహర్షి మార్గములో పయనించుచూ ఆయన బోధనలను సరళముగా విపులముగా సుస్పష్టముగా, సామాన్య మానవులకు అర్థమయ్యే తీరులో ప్రవచనముల ద్వారా జ్ఞానామృతమును పంచిపెట్టు చున్నారు. శ్రీనాన్న గారు వివిధ గ్రామములలో చేసిన ప్రసంగములు ఎంతో మందికి జిజ్ఞాసను కలుగ చేసినవి.

నీవు ఏ మతములోవున్నా, ఏదైవాన్ని ఆరాధించినా, ఏ మంత్రాన్ని జపించినా, ఏగురువును ఆశ్రయించినా, ఎన్ని క్షేత్రములు తిరిగినా, నీవు ఎవ్వరవో నీకు తెలియు నపుడు ఒకటిలేని సున్నలతో సమానము అంటారు శ్రీనాన్నగారు. ఉన్నది ఒక్కటే- "ఆత్మ"

ఆ సద్వస్తువు నీ హృదయములో ప్రకాశించుచున్నది. నీకు దేహాత్మ బుద్ధి వుండుట వలన ఆ సత్పదార్థము వ్యక్తము అగుటలేదు.

నిన్ను నీవు తెలుసుకొనుటకు బాహ్యముగా నీకు ఎవ్వరు అడ్డురావటంలేదు. నీ హృదయములో దాగియున్న దుష్ట సంస్కారములే నీకు అడ్డు వస్తున్నాయి. అందుచేతనే నీ హృదయములో నున్న పరమాత్మను దర్శించలేక పోతున్నావు. నీ హృదయములో నున్న శాంతి సముద్రమును అనుభవములోనికి రాకుంటే నీ మనస్సే అడ్డుపడుతున్నది. మాయ ఎక్కడోలేదు మనస్సే మాయ. ఏ విషయములనైనా తెలుసు కొనుటకు మనస్సు యిష్ట పడు చున్నది. కాని, తన్ను తాను తెలుసుకొనుటకు యిష్టపడదు. మనసులో మంచితనము పెంచుకోవాలి. మనోజయము మోక్ష సిద్ధిని కలిగిస్తుంది.

నిన్ను నీవు తెలుసుకొనుటకు ఏవేవి సహకరిస్తాయో, ఎవరెవరు ఏవిధముగా సహకరిస్తారో, నీలోనున్న దుర్గుణములను ఎలా తొలగించుకోవాలో, సద్గుణములను ఎలా సంపాదించు కోవాలో ద్వంద్వముల నుండి ఎలాబయట పడాలో. ఏ మార్గము ఎలా సహకరిస్తుందో, శ్రీనాన్నగారు వివిధ గ్రామాల్లో ప్రవచించిన ప్రసంగముల నుండి, భక్తులకు చేసిన బోధనల నుండి సంగ్ర హించి, వాటిని క్రోడీకరించి ఈ పుస్తకము ద్వారా మీ అందరికి అందించే అవకాశము కలిగినందులకు మాకు ముదావహము. ఈ పుస్తకము చదివి, ఏ ఒక్కరు సంస్కరింప బడినా, మా ప్రయ త్నము ఫలించినట్లే !

—కె. ఉషా రంగరాజు

# నిన్ను నీవు తెలుసుకో

[ఈ సృష్టిలో ప్రతి వ్యక్తి దుఃఖ స్పర్శలేని సుఖమయ జీవితాన్ని కోరుకుంటాడు. సుఖము కోసమే మానవుడు "తన్ను" "తాను" అమితముగా ప్రేమించు కుంటాడు. ప్రతివ్యక్తి గాఢనిద్రలో తాను సుఖముగా వున్నానని భావించు చున్నాడు. కాని మెలకువ వచ్చిన తరువాత ఆ సుఖమును అనుభవములోనికి తెచ్చుకొనుటకు ప్రయత్నించుటలేదు. ఇహ, పర భోగములే సుఖాన్ని యిస్తాయని భ్రమించి, సంసార సాగరములో కొట్టు మిట్టాడు చున్నాడు.

ప్రతివ్యక్తి నిద్రను కోరుకుంటాడు. ఎందుచేతనంటే నిద్రలో సుఖము వుంది కనుక. కాని ఆ సుఖము ఎక్కడ నుండి వస్తున్న దని ఎప్పుడైనా ఆలోచించాడా? ? తెలుసు కొనుటకు ప్రయత్నము చేసాడా? గాఢనిద్రలో మనసు తన స్వస్థానమైన ఆత్మలో అణిగి యుంటుంది కాబట్టి ఆత్మ సుఖమును నీవు అనుభవించుచున్నావు. గాఢనిద్రలో నీప్రయత్నము లేకుండానే ఆత్మ సుఖము సహజ ముగా వ్యక్తమగు చున్నది. మెలకువ రాగానే మనస్సు దేహముతో తాదాత్మ్యము పొంది, అహంవృత్తిలో వుండుట వలన జాగ్రద వస్థలో ఆత్మ సుఖము నీకు తెలియుటలేదు.

గాఢనిద్రలో అనుభవించుచున్న సుఖాన్ని నీవు జాగ్రద వస్థలో ఎఱుకతో అనుభవిస్తే నిన్ను నీవు తెలుసు కుంటావు. నిన్ను నీవు తెలుసుకుంటే సర్వ అనర్థముల నుండి, సృష్టి చక్రమునుండి బయట పడగలవు. సృష్టిరహస్యము, జన్మ రహస్యము, దైవ రహ స్యము తెలుస్తుంది.

ఈ సృష్టి చక్రములో ఎప్పుడు? ఎలా? ఎందుకు? చిక్కు-కున్నావో? నీకు తెలియదు. ఈసృష్టి చక్రములో నీవు ఎలా చిక్కు కున్నావో ఆలోచించుట వలన ప్రయోజనములేదు. ఈ సృష్టి చక్రము నుండి విడుదల పొందకపోతే మోక్షములేదు. నీవు ఎవ్వారవో నీవు తెలుసు కొనేవరకు జన్మలు వస్తూ వుంటాయి. దుఃఖము వెంటాడుతూ వుంటుంది. ఈ ఉదాత్తమైన, ఉత్కృష్ట మైన మానవజన్మ రాకముందు నీవు ఎక్కడ నుండి వచ్చావో నీకు తెలియదు. మరణించిన తరువాత ఎక్కడకు వెళతావో నీకు తెలియదు. దాహములో శ్వాస ఆడుతూ వున్నప్పుడే తన్ను తాను తెలుసుకున్నవాడిని మృత్యువు ముట్టుకోదు, నిన్ను నీవు తెలుసు కోకుండా మృత్యుంజయుడవు కాలేవు ]

# 1

నిద్ర అంటే ఇష్టము లేనివారు ఎవరైనా ఉన్నారా? గాఢ నిద్రలో సుఖము వున్నది. అందువలన నిద్ర అంటే అందరూ ఇష్టపడతారు. నిద్రలో మనకు దేహధ్యాస ఉండదు కనుక నిద్ర కూడా చిన్నమరణముతో సమానము. మనము అనుదినము నిద్రించే

నిద్ర పొట్టిమరణము. ఈ దేహమును వదలి వేరొక దేహములో ప్రవేశించే లోపల మధ్యనున్న సమయము పొడుగునిద్ర.

నీకు నిద్ర అంటే భయములేదు, కాని మరణము అంటే ఎందుకు భయము? నిద్రలేచిన తరువాత నీదేహము నీకు కనిపిస్తుందన్న నమ్మకము వుంది కనుక నిద్ర అంటే భయములేదు. మరణిస్తే ఈదేహముతో ఉన్న సంబంధము పూర్తిగా తెగిపోతుంది కాబట్టి మరణము అంటే నీవు భయపడతావు.

నీ దేహము ఎప్పుడో ఒకప్పుడు మరణిస్తుందని నీకు తెలుసు అయినా మరణము వస్తుందంటే నీకు భయము, దుఃఖము కలుగుతాయి నీవుకాని నీదేహన్ని నీవు అనుకొనుటవలన మరణభయము వెంటాడుతుంది. ఇంద్రియములు దేహమును ఆశ్రయించుకొని వున్నవి దేహముపోతే ఇంద్రియగతమైన భోగములు అనుభవించుటకు వీలుపడదు కనుక నీకు మృత్యువు అంటే భీతి కలుగుతుంది.

నీవు స్వప్నములో వేరొక దేహముతో ఎక్కడెక్కడో విహరిస్తావు. కాని మెలకువ వచ్చిన తరువాత ఆ దేహము కోసం నీవు వెదకవు. స్వప్నం, స్వప్నములోని దేహము అసత్యమని నీకుతెలిసినందువలన దానికోసం వెదుకుటకు ప్రయత్నించవు, చింతించవు, దుఃఖపడవు. స్వప్నములో చరించే దేహము ఎటువంటిదో, మెలుకువలో సంచారము చేస్తూవున్న ఈ దేహము కూడా అటువంటిదే ఆత్మ లాభము కలిగిన తరువాత ఈ సత్యము తెలియబడుతుంది. ఈదేహము శవము. అది మాత్రమే నీవు అనుకొనే బుద్ధి నీలో

గాఢముగా నాటుకొని పోయినది. అందువలన ఈ దేహము మరణించే సమయములో నీకు బాధ, దుఃఖము కలుగు చున్నవి.

ఈరోజు పగలుకు, రేపటిపగలుకు మధ్య వచ్చే రాత్రి ఎటువంటిదో ఈజన్మకు మరుజన్మకు మధ్య వచ్చే చావు అటువంటిదే. ఈజన్మ ఎలా స్వప్నమో, రాబోయేజన్మ ఎలా స్వప్నమో అలాగే చావు కూడా స్వప్నమే. మరణం నీకు అపకారము చేయదు. మరొక దేహాన్ని తీసుకొని వస్తుంది. మరణించి నప్పుడు నీ దేహములో నుండి ఏదో ఒకటి బయటకు పోతుంది. మరణించేది నీవు కానప్పుడు మరణమంటే నీకు ఎందుకు భయం?

మరణించేది నేను కానప్పుడు మరణించేది ఏది?

దేహము పుట్టినపుడు ఆత్మ పుట్టిందని దేహము మరణిస్తే ఆత్మ మరణిస్తుందని నీవు భ్రమ పడుచున్నావు. ఆత్మను దేహమునకు పరిమితము చేస్తున్నావు దేహములోనే ఆత్మ వుంటుంది కాని దేహము ఆత్మకాదు, ఆత్మ దేహము కాదు. దేహానికి, ఆత్మకు అణుమాత్రము కూడా సంబంధములేదు. ఆత్మకు పుట్టుకలేదు, మరణము లేదు.

ఆత్మకు మరణము లేకపోతే మరణించేది ఏది?

దేహము లావుగా వుంటే నేను లావుగా వున్నాను, దేహము సన్నముగా వుంటే నేను సన్నముగా ఉన్నాను, దేహము మరణిస్తే నేను మరణిస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు, ఇది కల్పితము.

నేను లావుగా వున్నాను, సన్నముగా వున్నాను, మరణిస్తున్నాను అని నీ దేహము చెప్పుటలేదు. నీ దేహములోనున్న మనస్సు చెప్పు చున్నది. ఈ దేహము ఎంత అసత్యమో, ఈ దేహములో నున్న మనస్సుకూడా అంతే అసత్యము. అందుచేతనే దేహముతో మనస్సు తాదాత్మ్యము పొందు చున్నది. ప్రాణప్రయాణ సమయములో మనస్సు దేహమును వదిలి తన సంస్కారములకు అనుగుణముగా ప్రయాణము చేస్తుంది మానవుడు తన స్వరూపమైన అరూపము (ఆత్మ)ను తెలుసుకొనే వరకు మనస్సు ఏదోరూపములో వెంటాడు తూనే వుంటుంది. మనస్సునకు కూడా మరణము లేదు.

అయితే మరణము ఎవరికి ?

ఈ సృష్టిలో జన్మించినది ఏదో ఒకరోజున మరణించక తప్పదు. నీ దేహము పుట్టినది కనుక పెరుగుతుంది. చివరకు మరణిస్తుంది, మరణించేది నీ దేహమే.

శవము, శవము అంటే అది ఎక్కడ నుండోరాదు. దేహానికి గాలి పీల్చుకొనే శక్తిపోతే ఈ దేహమే ఒక శవము. ప్రాణమున్నంత సేపు ఎవడి శవమును వాడె మోసుకుంటాడు. ప్రాణము పోయిన తరువాత నలుగురు మోస్తారు. మనోనాశము అయ్యే వరకు ఈశవ మును మోస్తూనే వుండాలి. దేహములో గాలి ఆడినంత వరకు మన మధ్య తేడాలు కనిపిస్తాయి. దేహములో గాలి తప్పుకుంటే ఏ దేహమైనా చేరవలసింది శ్మశానమునకే. ఒక తల్లి గర్భమునుండి వచ్చిన దేహము శవము అయిన తరువాత శ్మశానము తన గర్భంలో దాచుకొంటుంది. అందువలన శ్మశానము కూడా తల్లితో సమానము.

నీ కళ్ళముందు ఎన్నో శవాలు శ్మశానానికి పోతూవున్న నీవు మాత్రము శాశ్వతముగా వుండాలి అనుకొంటావు, ఎందుచేతనంటే ఆత్మకు చావులేదు. అది (ఆత్మ) నీవు కాబట్టి, నీవు శాశ్వతముగా వుండాలి అనుకొంటున్నావు.దేహమును ఆత్మఅనుకున్నంతకాలము నీకు దుఃఖము తప్పదు, మరణము తప్పదు.

మొదటిసారి మన గుండె ఎప్పుడు, ఎలా కొట్టుకుందో మనకు తెలియదు. అదే విధముగా మన గుండె ఆగిపోయే క్షణము కూడా మనకు తెలియదు. ఇది అంతా ఆత్మశక్తి వలన జరుగు చున్నది. మనస్సు ప్రాణము ఇవి రెండూ పుట్టుచోటు ఒక్కటే. అది ఆత్మ. అందువలన మన మనస్సు మెదిలితే శ్వాసయొక్క వేగము పెరుగుతుంది. శ్వాసయొక్క వేగము పెరిగి నప్పుడు మనస్సులోని నిర్మలత్వము తగ్గుతుంది. మనస్సు ప్రాణము పైకి వేరుగా కనిపించినా, మనస్సుకు ప్రాణమునకు మధ్య ఎంతో అవినాభావ సంబంధము వుంది. మనస్సు అణగినప్పుడు ప్రాణము అణుగుతుంది, ప్రాణము అణగినప్పుడు మనస్సు అణుగుతుంది. మరణ సమయములో మనస్సు అన్ని సంస్కారములను సర్దుకొనే వరకు ప్రాణము శరీరమును వదలి పెట్టదు.

నీ దేహము ఈభూమి మీదకు ఏపని నిమిత్తము వచ్చినదో ఆ పని పూర్తి అయ్యే వరకు నిన్ను ఎన్ని దురదుష్టములు వెంటా డినా ప్రాణము శరీరమును వదలి పెట్టదు. నీవు మరణించే సమ యములో ఒకప్రక్క వ్యాధితో బాధ పడుతూ వుంటావు, వేరొక ప్రక్క నీహృదయములో దాగియున్న వాసనలు మెదడులో విజృం భించి నిన్ను ఈదిపి వేస్తూ వుంటాయి. నీవు జీవితము పొడుగునా,

ఏ విషయములను ఎక్కువగా అభిమానించావో, అవిషయమే జ్ఞప్తికి వస్తుంది. కాని భగవంతుడు మాత్రము జ్ఞప్తికిరాడు. ఏ నిమిష ములో ఏ తలంపు వస్తుందో నీకు తెలియనప్పుడు, ప్రాణము పోయే టప్పుడు ఏతలంపు వస్తుందో నీకు ఎలా తెలుస్తుంది? మరణ సమ యము మానవునికి పరీక్ష వంటిది. మరణ సమయములో వచ్చే తుది తలంపును బట్టి, భవిష్యత్ జన్మ ఆధారపడి వుంటుంది.

ప్రాణ ప్రయాణ సమయములో ఒక బలీయమైన వాసనతో మనస్సు ప్రాణమును గుంజుకొని, దేహమును వదిలి బయటకు ప్రయాణము చేస్తుంది. వెంటనే శ్వాస ఆగిపోతుంది. దేహము శవ ముగా మారుతుంది. మరణముతో దేహగతమైన చరిత్ర ముగు స్తుంది. కాని, జీవుని చరిత్ర మాత్రము ముగియదు. జీవుడు తన స్వభావమును అనుసరించి మరీ జన్మలో ప్రవేశిస్తాడు.

## 2

మరణముతో జీవునకు, దేహమునకు మధ్యవున్న సంబంధం పూర్తిగా తెగి పోతుంది. కాని ఆత్మకు జీవునకుగల సంబంధము మాత్రము తెగిపోదు. జీవునకు వెంటనే జన్మ రావచ్చు, కొంత కాలము పట్టవచ్చును. మానవజన్మ రావచ్చు లేదా ఇతరజన్మలు ఏవైనా రావచ్చు. జీవుడు ప్రోగు చేసుకొన్న సంస్కారములకు అను గుణముగానే జన్మ వస్తుంది.

జీవునకు స్త్రీ దేహము రావచ్చు, పురుష దేహము రావచ్చు కాని జీవుడు పురుషుడుకాదు, స్త్రీ కాదు. జీవుడు ఏ దేహములో వుంటే దానితే తాదాత్మ్యము పొందుతాడు. జీవునికి తన స్వస్థాన మైన ఆత్మను చేరే వరకు స్వస్థత చేకూరదు.

జీవుడు స్త్రీ గర్భములో శరీరమును ధరించి బయటకు వస్తాడు. జీవునకు నూతన దేహము రాగానే ఆ దేహానికి ఒక పేరు పెడతాము. ఆపేరుతో జీవుడు తాదాత్మ్యము పొందుట ప్రారం భిస్తాడు. రూపము ఒకఅబద్దం; ఆ అబద్ధమునకు "పేరు" అనే మరో అబద్దాన్ని తగిలిస్తాము. తానుకాని శరీరము కోసము, తాను కాని పేరు కోసం జీవుడు జీవితాంతము ప్రాకులాడుతూనే వుంటాడు. జీవునిలో దాగియున్న సంస్కారములు బాల్యములో అణిగియుండి వయస్సు పెరిగే కొలది విజృంభిస్తాయి. జీవుడు తన కూడా తెచ్చు కొన్న సంస్కారములకు అనుగుణముగానే జీవిస్తాడు.

ఈశ్వరుడు జీవునియొక్క ప్రారబ్ధమును ఒక క్రమపద్ధతిలో నియమిస్తాడు. ఆ ప్రారబ్ధమునకు అనుగుణముగానే జీవుని ప్రవర్తన వుంటుంది. తల్లిదండ్రులు దేహమనే బండిని తయారుచేసి యిస్తే జీవుడు ప్రారబ్ధమనే భారమును ఎద్దులాగ లాగుతూ ఈభుమిమీద జీవనయాత్ర సాగిస్తాడు.

దేహము పుట్టినప్పుడు నేను పుట్టాను, దేహము మరణిస్తున్న ప్పుడు నేను మరణిస్తున్నాను అని నీవు అనుకుంటావు. అది అజ్ఞానము. దేహము పుట్టినప్పుడు నీవు పుట్టలేదు. దేహము మరణించినపుడు నీవు మరణించవు. ఇది నిజము. "నేను" అనే

ప్రథమ తలంపు పుట్టినప్పుడే నీవు పుట్టావు. "నేను" అనే భావన మరణించి నప్పుడే నీవు మరణిస్తావు. ఈ నేను యొక్క మూలము తెలిసే వరకు బంధము తప్పదు.

నీ దేహము పుట్టినది మొదలు ఆ దేహమునకు పరిమితమైన నేను యొక్క పరిధిలోనే తిరుగుతూ వుంటావు. ఈ దేహగతమైన నేనే సర్వస్వము అని భావించి అన్ని అనర్థములకు గురి అవుతు న్నావు. ఈ నేనుకు కారణమ్ము అజ్ఞానము. ఈ నేనునే కర్తృత్వము అంటారు. ఈ కర్తృత్వమే దుఃఖమునకు కారణము. పని మాత్రము దుఃఖమునకు కారణముకాదు. ఈ జడమైన దేహము పడిపోక ముందే, వివేకము యొక్క సహాయముతో కర్తృత్వము తొలగించు తుంటే జన్మరాహిత్యమును పొంద వచ్చును. ఈ "నేను" ఎవ్వరో యిప్పుడు విచారించి తెలుసు కుందాం!

## 3

నీవు దేహమనే దుంగకు కట్టబడి వున్నావు. నీ ఆశయాలు అభిరుచులు, ఆకాంక్షలు ఎల్లప్పుడు ఆదేహముచుట్టూనే తిరుగుతూ వుంటాయి. అటువంటప్పుడు నీ దేహాన్ని మరచి ఎవ్వరినైనా ఎలా ప్రేమించగలవు? దేహాన్ని దాటి ఎలా ఆలోచించగలవు? నీవు దేహాన్ని కేంద్రముగా పెట్టుకొని పని చేస్తున్నావు. ఆ పని వలన మంచిఫలితమువస్తే అదృష్టమని, చెడ్డ ఫలితమువస్తే దురదృష్ట మని అనుకొంటూ నీ జీవనయాత్ర సాగిస్తున్నావు.

ఈ సృష్టిలో అన్నింటికంటే నీదేహమంటేనే నీకు మిక్కిలి యిష్టము. దేహమే భోగాన్ని, సుఖాన్ని యిస్తుందని భ్రమించి నీ దేహాన్ని ఎంతో ప్రేమిస్తున్నావు, నీ దేహానికి ఎంతో విలువ యిస్తున్నావు. నీ కాలమంతా దేహానికి చాకిరి చేయడంతోనే గడిచిపోతుంది. మరి ఆధ్యాత్మిక సంపదను ఎప్పుడు అర్జించేది? నీవు యింతగా ప్రేమిస్తున్నా, యింతగా విలువ యిస్తున్నా, యింతగా ఆరాధిస్తున్నా, నీ దేహము నీదికాదని నీకు తెలిస్తేనే కాని నీకు జ్ఞానోదయం కాదు.

బాహ్యంగా కనిపించే దేహాన్ని స్థూలదేహమని, మనస్సును సూక్ష్మదేహమని, అజ్ఞానాన్ని కారణ దేహమని అంటారు. స్థూల దేహము నీకంటికి కన్పిస్తుంది, కాని సూక్ష్మ, కారణ దేహములు నీ కంటికి కనిపించవు. స్థూలదేహాన్ని భౌతికమైన అగ్ని కాలిస్తే, సూక్ష్మ, కారణ దేహములను జ్ఞానమనే అగ్ని కాలుస్తుంది. కారణ దేహమున్నంత కాలము స్థూల, సూక్ష్మ దేహములు వుండనే వుంటాయి.

దేహము ఆరోగ్యముగా వుండుటకు, పనిచేసే శక్తి కలిగి యుండుటకు పరిశుద్ధమైన గాలి, నీరు, ఆహారము అవసరము ఆహార నియమము నియమములకు "రాజు" లాంటిది. మనము తినే ఆహారము యొక్క సారమే సూక్ష్మ దేహముగా రూపొందుతుంది, కనుక ఆహార నియమము అవసరము. సాత్విక ఆహారము సత్వగుణమును పెంచుతుంది. సత్వగుణము సత్యాన్ని తెలుసుకొనుటకు సహకరిస్తుంది. నీకు హితమైనది మితముగా తీసుకోవాలి. ఆహార విహారాలలో జాగ్రత్త వహిస్తే నీ బుద్ధి వికసిస్తుంది.

దేహ పోషణకు ధనము అవసరమే. ధనము వలన ఏప్రయో జనము వస్తుందో దానిని మాత్రమే అది సాధించ గలదు. ధనమును పెట్టి భోగమును కొనుక్కో వచ్చునేమోకాని, శాంతిని మాత్రము సంపాదించలేవు. ధనము వలన వచ్చే భోగము తాత్కాలికము మాత్రమేకాదు. అది గతిని కూడా నిరోధిస్తుంది. ధనమును సద్విని యోగము చేస్తే పుణ్యము వస్తుంది. మనస్సు విశాల మౌతుంది. ధనమును దుర్వినియోగము చేస్తే పాపము వస్తుంది, మనస్సు సంకు చితము అవుతుంది. మంచికోసము దానముచేస్తే నీ మనస్సులోని దోషములు రాలిపోతాయి. తపోధనములేకపోతేధనాభిమానముగాని దేహాభిమానముగాని నశించవు.

నీ దేహమును ఎవరైనా దూషిస్తే, దేహముతో తాదాత్మ్యము పొంది వున్న నీకు కోపము వస్తుంది. అదే అహంకారము. అహం కారము దేహముతో తాదాత్మ్యము పొంది యుండుట వలన ఆ కోపము ముఖములో వ్యక్త మగుచున్నది. అహంకారమునకు రూపము లేదు. ఏదో ఒక రూపమును ఆధారముగా చేసుకొని పెరు గుతూనే వుంటుంది. రూపము లేకుండా అది యుండలేదు. నీకు ప్రాణము కంటే, అహంకారము అంటేనే ఎక్కువ తీపి. అందుకే నీ అహంకారమునకు ఎక్కడైనా గాయము తగిలితే హత్య చేసుకొ నుటకు కూడా నీవు వెనుతీయవు. హత్య చేసుకుంటే దేహముతో పాటు అహంకారము కూడా మరణిస్తుందని నీవు భావించుచున్నావు. హత్య వలన దేహము మారుతుంది కాని, అహంకారము మారదు.

దేహమున్నంతకాలము దుస్తులు ఎలావేసుకొంటామో అలాగే అహంకారము వున్నంతకాలము దేహములు వస్తూ వుంటాయి. ప్రారబ్ధము పూర్తి కాకుండ దేహమును హత మార్చుకుంటే మరొక దేహములోనైనా అప్రారబ్ధమును అనుభవించక తప్పదు. దేహమును శిక్షించి సాధనకు అనువుగా దేహమును, ఇంద్రియములను మలచుకొని ముక్తి స్థితిని పొందుటకు ప్రయత్నించవలెను. మరణించే దేహము వుండగానే, నీహృదయములోనున్న మరణము లేని సద్వస్తువును దర్శిస్తే స్వేచ్ఛ కలుగుతుంది. సుఖము తెలుస్తుంది. మృతుంజయుడవు అవుతావు.

దేహములో అనారోగ్యము ఎక్కడ వుంటే మనస్సు అక్కడే నిలుస్తుంది. అందువలన దేహము యొక్క ఆరోగ్యమును జాగ్రత్తగా కాపాడుకోవాలి. అజ్ఞానమనే ఇవతలి గట్టు నుండి జ్ఞానమనే అవతలి గట్టునకు చేర్చుటకు దేహము బల్లకట్టువలె ఉపయోగపడుతుంది. జ్ఞానమును పొందకుండా దేహమును త్యజిస్తే నీవు అపారమైన కష్టానికి, నష్టానికి గురి అవుతావు. నీ దేహము మరణించక ముందే నీ హృదయములోనున్న సద్వస్తువును దర్శిస్తే జ్ఞానోదయము అవుతుంది. మానవజన్మ సార్ధకము అవుతుంధి.

నీవు కాని దేహమును ఎన్నిసార్లు నీవు అని అనుకున్నా అది నీవు కాదు. దేహము జడము. తాను వున్నానన్న సంగతి తనకు తెలియదు. దానికి నేను అనే తలంపు లేదు. నివు దేనిని అయితే "నేను" అని అంటున్నావో, అది నీ శరీరములో ఒక భాగముకాదు. ఈ నేను ఎక్కడ నుండి పుట్టి లేచి వస్తుందో ఆ పుట్టుచోటును

నీవు చూడగలిగితే ఉరిడీ కొబ్బరికాయ లాగ నీ దేహము నుండి నీవు విడివడతావు, నిన్ను నీవు తెలుసుకొంటావు. దేహము నీవు కాదు.

దేహము నేను కాకపోతే మరి నేను ఎవ్వడను ?

## 4

శబ్ద, స్పర్శ, రూప రస గంధములను వేరువేరుగా తెలుసుకొను చెవి, చర్మము, కళ్ళు, నాలుక, ముక్కు ఈ అయిదింటిని జ్ఞానేంద్రియములు అంటారు. వచన, గమన, ఆదాన, మలవిసర్జన, ఆనందము ఈ ఐదు కార్యములను వేరువేరుగా చేయునట్టి వాక్కు. పాద, పాణి పాయు, ఉపస్థలను కర్మేంద్రియములు అంటారు.

దేహమునకు ఇంద్రియములు తలుపులు వంటివి. నోరు సింహద్వారము ఇంటి తలుపులు అవసరమైతేనే తెఱచి వుంచుతాము. అవసరము లేకపోతే మూసి వుంచుతాము. అదే విధముగా నీ ఇంద్రియములను నీ స్వాధీనములో నియమించుకో వలెను. ఇంద్రియ నిగ్రహము లేకుండా మనోనిగ్రహము సాధ్యముకాదు. మనోనిగ్రహము లేకుండా చిత్తశుద్ధి సాధ్యముకాదు. చిత్తశుద్ధి లేనివాడు ఆత్మను దర్శించలేడు.

ఇంద్రియ ఆకర్షణలకు లోబడినవాడు, ఇంద్రియ ఆకర్షణను నిరోధించ లేనివాడు, తన ఇంద్రియములను స్వాధీనములో వుంచు

కొనలేవు. స్వాధీనములో లేని ఇంద్రియములు దుష్టునిలా కీడు చేస్తాయి. స్వాధీనములోనున్న ఇంద్రియములు మిత్రునిలా మేలు చేస్తాయి. లోక విషయములను చింతించుచూ ఇంద్రియములను నిగ్రహించలేవు. న్యాయమైన మార్గములో నడుచుకుంటూ, కపటము లేకుండా జీవిస్తూ సత్ప్రవర్తనను కలిగి యుంటే నీ ఇంద్రియములు స్వాధీనములోకి వస్తాయి. ఇంద్రియ నిగ్రహము కొరవడితే మానసిక మైన అస్థిరత్వమునకు గురి అవుతావు. నిరంతర ఆత్మ చింతన వలన ఇంద్రియములను నిగ్రహించ వచ్చును.

ఇంద్రియములు పాములాంటివి. ఈ పాములకు అధిపతి మనస్సు. మనస్సును హృదయములో నిలబెట్టి వుంచగలిగితే పాములలాంటి ఇంద్రియములు అణిగిపోతాయి. మనస్సు చల్ల బడుతుంది, శాంతి కుదురుతుంది. పరిస్థితులు అనుకూలముగా లేకపోయినా ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము కలవాడు సుఖముగానే వుంటాడు. నిగ్రహము కలవాడు వజ్ర సంకల్పంతో వుంటాడు వజ్ర సంకల్పము కలవాడు ఈలోకములో సాధించ లేనిది ఏముంది.

నీ చెవులు అనవసరపు గొడవలు వినుటకు కుతూహల మును చూపుతాయి. మంచి మాటలు వినుటకు యిష్టపడవు. వ్యర్థ మైన మాటలను విని అవి ఊరుకోవు. మనస్సునకు ఎంతో క్షోభను తెచ్చి పెడతాయి. హృదయములో పాపమున్న మనిషి మంచి మాటలను వినలేడు. హృదయములో దోషము ఉన్న మనిషికి దేవుని మాటలు మీద విశ్వాసము కుదరదు. మంచిని వింటే,

మంచిని చూస్తే మంచి తనము పెరుగుతుంది. మంచి తనముతో కూడుకొనియున్న మనస్సు మాత్రమే అంతర్ముఖము అవుతుంది. మంచితనము యొక్క బలముతో ఆత్మ ముత్యమును పొంద వచ్చును.

నీ కళ్ళుకు రూపము అంటే చాలా ఇష్టము. కాని ఆత్మకు రూపము లేదు. నీ కళ్ళు రూపమును పట్టుకొని ఎంత కాలమైతే వుంటాయో, అంతకాలము వరకు నీకు రూపదృష్టిపోదు. రూపదృష్టి పోనంతకాలము ఈలోకం నీకు నిజముగానే కనిపిస్తుంది. ఇంద్రియ జయము లేనివాడికి లోకము అదృశ్యము కాదు. లోకము అదృ శ్యము అయితేనే కాని ఆత్మ దర్శనము కాదు.

నాలుక రుచి చూడడం, మాట్లాడటం అను రెండు పనులు చేస్తుంది. అందువలన దానిని నిగ్రహించుట కష్టము. నాలుక మాంసముతో నిర్మిత మైనది, కాని ఇనుముతో తయారుచేయబడిన కత్తిలాగ ఎదుటవారిని గాయ పరుస్తుంది. బయటనుండి లోపలకు వెళ్ళే ఆహార విషయములో ఎంత జాగ్రత్తగా వుంటామో, అదే విధముగా లోపల నుండి బయటకు వచ్చే మాట విషయములో జాగ్రత్త వహించాలి.

ఎక్కువ మంది ముందు మాట్లాడతారు, తరువాత ఆలో చిస్తారు. అట్లుకాక ముందు ఆలోచించి, తరువాత మాట్లాడటం నేర్చుకోవాలి. అహంకారమును సంతృప్తి పరచటం కోసం ఎక్కువ మాట్లాడతాము, అవసరమునకు మాట్లాడితే సరిపోతుంది. అహం కారము విజృంభించి నప్పుడు మౌనంగా ఉండటం మంచిది.

ఆవేశము, ఆలోచన ఒకే చోట కాపురము ఉండలేవు. మాటలో ఆడంబరము పనికిరాదు.

నీవు మాట్లాడే ప్రతీ మాట ఆచి, తూచి మాట్లాడాలి. సవ్యముగా, స్పష్టముగా వుండాలి. కరుణతో నిండి యుండాలి. రసపూరితముగా వుండాలి. మంచి మాటలే, మంచి వాక్యములుగా తయారు అవుతాయి. మాటలను బట్టి మనిషియొక్క సంస్కారమును తెలుసుకొన వచ్చును. మనస్సులో చల్లదనము వుంటే అది మాటలలో వ్యక్తము అవుతుంది. మంచిని ప్రేమించటం, మంచి కోసం జీవించటం. మంచికోసం మరణించటం, జ్ఞాన సముపార్జనకు అత్యంత అవసరము.

కోరికతో పనిచేస్తే కూలివారము అవుతాము, ప్రకృతిచేతిలో బండీగా తయారు అవుతాము. స్వార్ధము లేకుండా, సోమరితనము లేకుండా, ఆందోళన లేకుండా, ఆవేశము లేకుండా, శ్రద్ధగా, ప్రీతిగా పనిచేస్తే ప్రకృతిని దాటుతావు, నీ మనస్సునకు వచ్చే తలంపులను బట్టి, నోటితో మాట్లాడె మాటలనుబట్టి చేతులతోచేసే పనులనుబట్టి, నీ స్వభావము ఏర్పడుతుంది. అందువలన నీకు వచ్చే ఆలోచనల విషయములలో, చేసే పనుల విషయములలో జాగ్రత్త వహించాలి.

నీ చేతులతో సత్‌కర్మలను నిర్వర్తించాలి. నిషిద్ధ కర్మలకు దూరంగా వుండాలి. కర్తృత్వంతో పనిచేస్తే, మంచికి - మంచి, చెడుకు-చెడు, ఎత్తుకు-ఎత్తు అనుభవించ వలసినదే కర్తృత్వమే దుఃఖమునకు మూలకారణము. కర్తృత్వమును విడిచి పెడితే

అన్ని విడిచి పెట్టినట్లే అవుతుంది. కర్తృత్వము లేని వానికి శరణాగతి కుదురుతుంది. ఈశ్వరుని చేతిలో పనిముట్టు అవుతాడు. కర్తృత్వము లేనివాడు చేసే ప్రతిపని ఈశ్వర అర్పితము అవుతుంది.

నీ మనస్సులో కోరికలు వున్నంత వరకు, నీ ఇంద్రియములు చలిస్తూనే వుంటాయి. లోకమును జయించుట కంటే కోరికలను జయించుట గొప్ప. ఇంద్రియములను మచ్చిక చేసుకొనుటకు నీ ప్రయత్నముతో పాటు, ఈశ్వర అనుగ్రహము కూడా అవసరము. నీవు హృదయ పూర్వకముగా, నిండు మనస్సుతో ఈశ్వరుణ్ణి విశ్వసించి ప్రేమిస్తే, ఆ ప్రేమ ప్రవాహములో నిన్ను పట్టి పీడిస్తున్న నీ అహంకారము కొట్టుకొని పోతుంది.

ఇంద్రియములు గోళములు వాటి ద్వారా పని చేసేది మనస్సు మాత్రమే. ఆ మనస్సును స్వాధీనము చేసుకుంటే, ఇంద్రియములు పూర్తిగా అణిగి పోతాయి. నిన్ను నీవు తెలుసుకుంటావు. ఇంద్రియములు నీవు కాదు.

ఇంద్రియములు నేను కాకపోతే మరి నేను ఎవ్వడను ?

## 5

ఒక విషయమును ఆలోచించి నప్పుడు దానిని "మనస్సు" అంటారు. దాని మంచి చెడ్డలను నిర్ణయించే టప్పుడు "బుద్ధి" అని అంటారు. కొంచెమయినా బుద్ధి లేకుండా మానవుడు వుండడు.

బుద్ధికి స్థానము శిరస్సు. హృదయములో బీజరూపములో నున్న వాసన శిరస్సు లోనికి వచ్చినప్పుడు తలంపుగా మారి పెద్దదిగా కని పిస్తుంది, నీకు తెలుస్తుంది. బుద్ధిని శుద్ధి చేసుకుంటే వివేకము, వైరాగ్యము పెరిగి జ్ఞానోదయము అవుతుంది.

మన హృదయములో నున్నదే మనస్సులో కనిపిస్తుంది. మన హృదయములో లేనిది మనస్సులోకి రాదు. హృదయము శుద్ధి అయితే మనస్సు కూడా నిర్మలమై, నిశ్చలమై, శుద్ధ మనస్సు గామారి నిన్ను బంధము నుండి విడిపించి, స్వేచ్ఛను ప్రసా దిస్తుంది.

సర్వ సాధారణముగా మానవుని బుద్ధికి సోమరితనము ఎక్కువ వుంటుంది. శారీరకమైన సోమరితనము కంటే బుద్ధికి సంబంధించిన సోమరితనము మరింత ప్రమాదమైనది. భగవం తుడు నీకు ఇంద్రియములతో పాటు బుద్ధిని కూడా ప్రసాదించాడు. ఆ బుద్ధితో నీవు ఆలోచించడం నేర్చుకోవాలి. ఆలోచనలేని చోట ఆవేశము ఎక్కువగా వుంటుంది. ఆలోచన అమృతము వంటిది. ఏది చూసినా, ఏదిచేసినా, ఏదివిన్నా, నీ సొంత బుద్ధిని, పరిశీలనా శక్తిని విడువ కూడదు.

డబ్బు కంటే బుద్ధి ముఖ్యము. బుద్ధి వికసించక పోతే మానవుడు పరిపూర్ణ స్థితిని, ఆనంద స్థితిని అందుకోలేడు. బుద్ధి పెరిగితే అనుకరణ తగ్గుతుంది, ప్రకృతిని శోధించుటకైనా, హృద యపు లోయల లోనికి దిగుటకైనా బుద్ధి సూక్ష్మత అవసరము. సుగుణములు వివేకమును పెంచి బుద్ధిని శుద్ధిచేసి ఆత్మ పదవిని సాధించి పెడతాయి.

డబ్బు ఎటువంటిదో తెలివి కూడా అటువంటిదే. ఈరెండిం టిని మానవుడు సద్వినియోగము చేసుకొని భౌతిక సంపదను, ఆధ్యాత్మిక సంపదను వృద్ధి చేసుకోవాలి. తెలివి అవసరమే కాని, అది గమ్యము కాదు. తెలివి సహాయముతో భగవదనుభూతిని పొందుటకు ప్రయత్నము చేయాలి. ఒక్క తెలివితో మాత్రమే మానవుడు ఎదగలేడు. హృదయ స్పందన, పనిచేసే శక్తిసామర్థ్యములు అవసరము.

సజ్జన సాంగత్యము, శాస్త్ర పఠనము, ప్రకృతి పరిశీలన, ఏకాంత వాసము, ఇవిఅన్నీ బుద్ధి వికసించుటకు సహాయపడతాయి దైనందిన జీవితములో ఎదురయ్యే అనేక సమస్యలను పరిష్క రించు కొనుటకు బుద్ధి సహాయము అవసరము. అజ్ఞానమును తొలగించు కొనుటకు, సూక్ష్మ బుద్ధి సహకరించదు. స్థూలబుద్ధి సహకరిస్తుంది. బుద్ధి యొక్క సహాయ సహకారములు లేకుండా జ్ఞాన శిఖరమును అధిరోహించలేవు.

జ్ఞాన సింహాసనమును అధిరోహించుటకు మెదడు ఒక పని ముట్టులా ఉపయోగపడుతుంది. మెదడు జడమే, మెదడు ద్వారా పనిచేసేది మనస్సు మాత్రమే. ఆ మనస్సు యొక్క మూలమును తెలుసుకుంటే అమృత స్థితిని పొందుతావు. నిన్ను నీవు తెలుసు కుంటావు. బుద్ధి నీవు కాదు.

బుద్ధి నేను కాకపోతే మరి నేనెవ్వడను ?

# 6

దేహమును "నేను" అనుకొంటున్నావు. నీకు వచ్చే తలంపులలో యిది ప్రథమ తలంపు, ప్రధాన తలంపు పునాదితలంపు. ఈ ప్రథమ తలంపునే "అహంకారము" అని అంటారు. అహంకారమే దేహభావనకు కారణము. ఈ నేను అనే తలంపు వచ్చిన తరువాతనే మిగిలిన తలంపులు పుట్టుకొని వస్తాయి. ఈ నేను అనే ప్రథమ తలంపు, మిగతా తలంపులు కలిసి "మనస్సు" అయినది. మనస్సు, అహంకారము, నేను (మిథ్యా) జీవుడు, సూక్ష్మ శరీరము అన్నీ పర్యాయ పదములు.

"నేను" అనే తలంపు నీ హృదయము నుండియే వచ్చుచున్నది. అంటే సాక్షాత్ ఆత్మ దగ్గర నుండియే వచ్చుచున్నది. ఈ నేను ఆత్మ నుండి వెలువడిన ఒక అతిశయశక్తి, అది ఆత్మ సన్నిధిలోనే పని చేస్తుంది. ఈ నేను తాను పుట్టుచోటు ఆత్మను మరచి స్వయంభవుణ్ణి, అనుకొని స్వతంత్రముగా వ్యవహరిస్తుంది. దేహము "నేను" అనదు. చైతన్యమయమైన ఆత్మ "నేను" అనదు. చైతన్యమునకు, జడమునకు మధ్య ఈ నేను పుట్టుకొని వచ్చి నీకు దేహాభిమానమును కలిగించుచున్నది. ఈ నేను యొక్క మూలమును తెలుసుకొనే వరకు జడత్వము నుండి, ప్రకృతి నుండి, అసత్యము నుండి విడుదల కాలేవు.

గాఢనిద్రలో దేహచింతన, లోకచింతన, దైవచింతన లేనే లేవు. వాటిని చింతించే మనస్సు గాఢ నిద్రలో ఆత్మలో అణిగి

ఉంటుంది. నేను అను తలంపు ఉండదు. అందువలన అక్కడ దృశ్యము లేదు, సాక్షి మాత్రమే ఉన్నది. మెలకువ రాగానే సుఖముగా నిద్ర పట్టినదని నీకు సాక్షి మూలముగానే తెలియు చున్నది. ఈ సాక్షియే ఆత్మ. ఆత్మ చైతన్యము. ఆ చైతన్యమే కనుక నీ హృదయములో లేకపోతే "నేను" అనే స్ఫురణ కలు గదు. దేహగతమైన నేను నుండి విడుదల పొందితే ఆత్మ తనంత తానుగా వ్యక్తమౌతుంది.

నీవు దేహమని అనుకొన్నప్పుడు కూడ ఆత్మగానే ఉన్నావు. అయితే నీవు ఆత్మతో తాదాత్మ్యము పొందకుండా దేహముతో తాదాత్మ్యము పొందుట వలన దుఃఖమును పొందు చున్నావు. ఆత్మతో తాదాత్మ్యము పొందితే దుఃఖము నశిస్తుంది. దేహబుద్ధి దుఃఖమునకు కారణము. ఆత్మబుద్ధి సుఖమునకు కారణము. యజ్ఞభావనతో పనిచేస్తే దేహబుద్ధి నశించి, ఆత్మబుద్ధి కలుగుతుంది.

నేను అను ప్రధాన సమస్యను విడిచిపెట్టి నేను తరువాత వస్తున్న దేహమునుగురించి, లోకమునుగురించి చింతించుచున్నావు బాహ్య విషయములను చింతించు చున్నంత కాలము నీ మనస్సు బహిర్ముఖము అవుతూనే వుంటుంది. మనస్సు అన్ని విషయములు తెలుసుకొనుటకు యిష్టపడుతుంది. కాని అంతర్ముఖముగా హృద యపు లోతుల లోనికి దిగుటకు యిష్టపడదు. మనస్సు యొక్క మూలమును తెలుసుకొంటే నీలో నున్న ఆత్మ వ్యక్తమౌతుంది. బంధము నుండి విముక్తి పొందుతావు.

"నేను" అని అంటున్న ఈ నేను కనుక నిజమైతే ఈ "నేను" లేకుండా నీవు వుండలేవు. గాఢనిద్రలో ఈ "నేను" లేకుండా నీవు

వుండ గలుగు చున్నావు. ఇది నీకు అనుభవములో నున్న విష యము. ఒకప్పుడు వుండి మరొక్కప్పుడు వుండని ఈ "నేను" నిజము ఎలా అవుతుంది? ఆత్మజ్ఞాన సముపార్జన వలన మాత్రమే దేహగతమైన "నేను" నశిస్తుంది.

నేనుఅను తలంపు కొంచెముకూడాలేనిచోటనే స్వస్వరూపము (ఆత్మ) వుంటుంది. నేను యొక్క మూలమును వెదుకుట వలన నీ స్వరూపము నీకు తెలుస్తుంది. నేను యొక్క మూలమును తెలుసు కొనుటకు విగ్రహారాధన కంటే, పూజా జపధ్యానాదుల కంటే "నేను ఎవ్వడను" అను ప్రశ్న ఎక్కువ సహకరిస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానము దొరికితే నీ స్వరూపము నీ అనుభవము లోనికి వస్తుంది. మనస్సు అనేది లేదని తెలుస్తుంది. మనస్సు నీవు కాదు.

దేహము, ఇంద్రియములు, బుద్ధి, మనస్సు నేను కాకపోతే మరి నేను ఎవ్వడను?

వీటి నన్నింటిని కాదని నీ హృదయములో ప్రత్యేకముగా నిలచి స్వయముగా ప్రకాశించు "ఆత్మయే" నీవు.

## 7

"నీ దేహము కంటే, ఇంద్రియముల కంటే. బుద్ధి కంటే, మనస్సు కంటే కూడా ఆత్మ నీకు అతి దగ్గరగా నీ హృదయములో నిరంతము స్వయముగా ప్రకాశిస్తున్నది. హృదయము నీ ఎదురు

రొమ్ముకు కుడివైపున వుంది. ఇదే అధ్యాత్మిక హృదయము (ఆత్మ), ఎడమవైపున ఉన్నది భౌతిక హృదయము (గుండె) జడము (దేహము)నకు, చైతన్యము (ఆత్మ) ముడిపెట్టి వున్నది కాబట్టి నీ దేహము పనిచేయుచున్నది. ఆత్మ ఒక్కటే చైతన్యము. అందులో నుండియే అహంవృత్తి పుడుతున్నది. అహంవృత్తి ఆత్మ సింహాసనమును అధిరోహించకుండా చేస్తుంది. జనన, మరణ వలయములో బంధిస్తుంది. నీ ప్రవృత్తిలో నున్న అహం వృత్తిని త్యజిస్తే ప్రపత్తి లభ్యము అవుతుంది.

ఆత్మ స్వతంత్రమైనది. అందుకే నీవు స్వేచ్ఛగా జీవించాలను కుంటావు. ఆత్మ ప్రేమ స్వరూపము. అందుకే నిన్ను నీవు అమితముగా ప్రేమించు కుంటావు. ఆత్మ సుఖస్వరూపము. అందుకే నీవు సుఖమయ జీవితము కోరుకుంటావు. ఆత్మలో దుఃఖము లేదు. అందుకే నీవు దుఃఖ స్మర్శలేని జీవితమును కోరుకుంటావు. ఆత్మకు చావులేదు అందువలన నీవు చావు అంటే ఇష్టపడవు. నీకు తెలిసినా, తెలియక పోయినా నిన్నునీవే అన్వేషించు కుంటు న్నావు. ఆత్మను అన్వేషించే వాడికి మాత్రమే చైతన్యస్థాయి పెరుగుతుంది.

భౌతిక నేత్రములతో లోకమును ఎలా చూస్తున్నావో అంత స్పష్టముగా వివేకమనే నేత్రముతో ఆత్మను దర్శించవచ్చును. నీ కళ్ళకు కనిపిస్తున్న జగత్తు జడమేకాదు, అసత్యము కూడా. అసత్యమును అసత్యముగా తెలుసుకొనే వరకు సత్యము (ఆత్మ) తెలియ బడదు. నీవు అంగీకరించినా, అంగీకరించక పోయినా ఉన్నది ఏదో వుంది, లేనిది ఏదోలేదు. సత్యము నీ నమ్మకముల

మీద ఆధారపడి లేదు. ఉన్న దానిని (ఆత్మను) తెలుసుకొనే వరకు లేనిది (లోకం) ఉన్నట్లుగానే కనిపిస్తుంది.

నీలో చూచేవాడు ఒకడు వున్నాడు. కాబట్టి లోకము కనిపిస్తుంది. చూచేవాడు, చూడబడేది ఈ రెండూ ఆత్మలోనే తమ ఉనికిని కలిగి వున్నాయి. సినిమా తెరమీద బొమ్మలు ఆడుతూ, పాడుతూ కనిపిస్తాయి. బొమ్మలు కనిపించినంతసేపు తెర నీకు కనిపించదు. కాని తెరలేకపోతే బొమ్మలు నీకు కనిపించవు. అలాగే తెరను ఆత్మ అనుకుంటే, దానిపై అగుపడే చిత్రాలే ఈ లోకం. నిజానికి "తెర"లా ఆత్మ జడంకాదు. శుద్ధ చైతన్యము. ఈ చైతన్యం నుండి వెలువడే శక్తివలన ఈ లోకం కనిపిస్తున్నది. ఆత్మ లేకుండా ఈ లోకం నీకు కనిపించదు. ఈ లోకం కనిపించినంత కాలము నీకు ఆత్మ దర్శనము కాదు. ఆత్మ దర్శనము అయితే, ఈలోకం ఆత్మలో లయం అయిపోతుంది. ఉన్న వస్తువు వున్నట్లుగా వ్యక్తము అవుతుంది. అదే మోక్ష సిద్ధి.

ఈశ్వరుడు ఆత్మరూపములో నీహృదయములో నిరంతరము స్వయముగా ప్రకాశించుచూ, సర్వకాల సర్వావస్థల యందును నీకు తోడుగాఉండి, నీవుచేసే ప్రతిపనిని సాక్షిగా చూస్తూవుంటాడు. ఆయన కళ్ళు లేకుండా చూడగలడు. నీవు చేసే ప్రతి పనికి ఫలితమును ప్రసాదిస్తాడు. అందుకే ఆయనను కర్మఫల ప్రధాత అని అంటారు. నీకురాబోయే తలంపు నీకంటే ముందు ఈశ్వరునికి తెలుస్తుంది, తరువాత నీకు తెలుస్తుంది. ఎవ్వరికీ తెలియకుండా, ఎంతో తెలివిగా చేసిన పనులు కూడా ఏదో ఒకరోజున వెలుగు లోనికి వస్తాయి. నీవు చేసే ప్రతి పనిని కూడా నీ హృదయములో బీజ

రూపములో జాగ్రత్త పెట్టి వుంచి, మరోజన్మలో నీచేత అనుభవింప చేస్తాడు ఈశ్వరుడు. నీ తెలివి తేటలతో తోటి మానవులను మోసం చేయవచ్చునేమో కాని ఈశ్వరుని మాత్రము మోసం చేయలేవు.

ఆత్మను తెలుసుకొనుటయే నీ గమ్యము. ఆత్మ దర్శనము కాకుండా నీ మనస్సే అడ్డు పడుచున్నది. సాధన ద్వారా మనస్సును శుద్ధి చేసుకొని ఆత్మను గ్రహించే స్వేచ్ఛను ఈశ్వరుడు నీకు ప్రసాదించాడు. ఆత్మ తెలుసు కొనుటకు చేయు ప్రయత్నమే సాధన. సాధన వలన దేహ ప్రారబ్దము నుండి తప్పించు కొనలేవు. కావున దేహ ప్రారబ్దమును ప్రీతితో స్వీకరించి, నిర్మలమైన మనస్సుతో జీవిస్తూ, నిరంతరము ఆత్మ నిష్ఠలో వుండ గలిగితే ఈశ్వరానుగ్రహము వర్షిస్తుంది ఆత్మను తెలుసుకొనుటకు ఈశ్వరుడు యిచ్చేశక్తే అనుగ్రహము. ప్రారబ్ద బలము కంటే ఈశ్వరానుగ్రహము గొప్పది.

మన బంధువుల ప్రేమను, స్నేహితుల ప్రేమను, చివరకు తల్లిదండ్రుల ప్రేమను కూడా ఈశ్వరుని ప్రేమతో, కరుణతో పోల్చలేము. అట్టి కరుణామయుడైన ఈశ్వరునకు నీ హృదయములో చోటు కేటాయిస్తే నిన్ను క్షోభ పెడుతున్న నీ అహంకారము, ఇంద్రియములు నీ స్వాధీనము లోనికి వస్తాయి. ఆత్మ స్వరూపము సుఖమే. అట్టి సుఖమును మనస్సు రుచి చూస్తే దాని చలనము ఆగిపోతుంది, మెదలుట మాని వేస్తుంది.

మాయ మనస్సులోనే వుంది. బంధమును తెచ్చేది మోక్షమును తెచ్చేది నీ మనస్సే. ఈ సంసారమును ఏ మనస్సు అయితే

సృష్టించినదో దానిని నాశనము చేసే శక్తి కూడా ఆ మనస్సుకే వుంది. మనస్సులోని తలంపులను ఒక్కొక్కటి తీసివేస్తే మనస్సు విశాలమై, స్వచ్ఛమై, ఆత్మాకారము చెందుతుంది.

## 8

కర్తృత్వం తోటి పనిచేసి, దాని ఫలితమును అనుభవించి నప్పుడు వాసన పుడుతుంది. ఆ వాసన సూక్ష్మమైన బీజ రూప ములో నీ హృదయములో దాగి వుంటుంది. ఆ బీజ రూపములో నున్న వాసన మెదడు లోనికివచ్చి పెద్దదిగా కనిపిస్తుంది. అప్పుడు కాని నీ హృదయములో నన్ను వాసన నీకు తెలియదు. నీ హృదయ ములో దాగియున్న వాసనలో నుండియే తలంపు పుట్టుకొని వస్తున్నది వాసన లేకపోతే తలంపు పుట్టదు.

నీవు వాసనలను క్షయము చేసుకొనుటకు ఈ భూమిమీదకు వచ్చావు ప్రస్తుతము నీకు వున్న సమస్త వాసనల సమూహము పూర్వజన్మలో నీవు ప్రీతితో, ఇష్టముతో సంపాదించుకొన్న సంపద మాత్రమే. నీవు యిష్టముతో సంపాదించుకొన్న వాసనలే నీకు ఆత్మ జ్ఞానము కలుగకుండా అడ్డు వస్తున్నాయి. వాటిని తొలగించు కొనుటకు సాధన అవసరము. సాధన లేకపోతే సిద్ధి కలుగదు.

వాసనను బట్టి తలంపు, తలంపును బట్టి మాట, మాటను బట్టి చేత వుంటాయి, తలంపును సరిచేసుకొనకపోతే మంచి మాటలు మాట్లాడలేవు, మంచిపని చేయలేవు, మంచిని పెంచుకోలేవు.

మంచితనము లేకుండా జ్ఞానము కలుగుదు. అందువలన మంచి తనమును పెంచుకొనుటయే నీ జీవితలక్ష్యము. దానము, ధ్యానము లోకవాసనలను నిర్మూలించుటకు సహకరిస్తాయి. వాసనా క్షయము అయిన వాడికి మాత్రమే నిజమైన సుఖము తెలుస్తుంది. ఆ సుఖము నీళ్ళు కలపని పాలవలె వుంటుంది.

పూర్వజన్మలో నీవు యిష్టముతో చేసిన దానినే ఈ జన్మలో తొలగించు కొనుటకు శ్రమపడవలసి వస్తున్నది. వచ్చిన చెడ్డ తలంపును క్రియా రూపములో పెట్టకుండా, దానిని నిరోధిస్తే అది బలుచ బడుతుంది. క్రియా రూపములో పెడితే అది బలపడు తుంది తలంపు రాకుండా చూచుకొనుట మంచిది. తలంపువచ్చిన తరువాత నిరోధించుట కష్టతరము. చెడ్డ తలంపును తొలగించు కొనుటకు మంచి తలంపుల సహాయము అవసరము. అందువలన నీ హృదయములో అన్ని మూలల నుండి మంచి తలంపులు వచ్చేటట్లుగా చూచుకోవలసిన బాధ్యత నీపై వున్నది. బాధ్యతా రాహిత్యము మంచిది కాదు.

దేహ ప్రారబ్ధమును ప్రీతితో స్వీకరించి నిశ్చలమైన మన స్సుతో జీవిస్తూ నిరంతరము ఆత్మను ధ్యానిస్తే క్రొత్త వాసనలు పుట్టవు. ఆసక్తి లేకుండా పనిచేస్తే వాసనలు నశిస్తాయి. ఇష్ట దైవమును ధ్యానిస్తే వాసనలు నిర్మూలించ బడతాయి. దైవము పట్ల ధ్యాస లేకుండా ధ్యానించలేవు. అందువలన ఈశ్వరుని పట్ల ప్రీతిని పెంచుకోవాలి. ఆయనను భజించాలి. ఈశ్వరానుగ్రహము వాసనలను సమూలముగా తొలగించ గలదు.

నీ హృదయములో నున్న దోషములు నిశ్శేషముగా బయటకు పోకుండా నీకు ఆత్మ దర్శనము కాదు. సత్పురుషుల సాంగత్యము వలన నీలోని దోషాలు నీకు తెలియకుండా రాలిపోయి మనస్సు సంస్కరింప బడుతుంది. సంస్కరింపబడిన మనస్సు ఆత్మాకారము చెందుతుంది.

## 9

నీరు అంతటావున్నా త్రాగుటకు కొన్ని మాత్రమే పనికి వస్తాయి అదే విధముగా ఎంతో మంది మనుష్యులు వున్నప్పటికి మనము స్నేహము చేయుటకు తగిన అర్హత, యోగ్యత కలిగినవారు కొద్ది మంది మాత్రమే వుంటారు. నిజమైన స్నేహము పండిన పండువలె తీయగా వుంటుంది. కృత్రిమ స్నేహములలో చేదు కన్పిస్తుంది. మనిషి పురోగమనమునకు, తిరోగమనమునకు స్నేహమే కారణము.

సహవాసముల విషయములో జాగ్రత్త అవసరము. కనిపించిన ప్రతిమనిషితో స్నేహము పనికిరాదు. నీవు అందరితో మాట్లాడ వచ్చును. కాని గుణము తెలుసుకొని స్నేహము చేయవలెను. స్నేహము పరస్పర సహాయకారిగా వుండాలి. స్నేహము దినదినాభివృద్ధి చెందుటకు క్రమశిక్షణ అవసరము. ఏ విషయములోను అతి పనికిరాదు. మధ్యేమార్గము అవలంభించ వలెను.

ప్రతిభగలవారితో స్నేహమువలన నీ వివేకము వికసిస్తుంది. సజ్జనులకు ఎంత సమీపములో వుంటే అంత మంచిది. కాని

దుర్జనులకు దూరముగా వుండాలి. దుష్ట సాంగత్యము విషము కంటే ప్రమాదము. విషము శరీరమును మాత్రమే చంపుతుంది. కాని దుష్ట సాంగత్యము అనేక జన్మలకు కారణము అవుతుంది. అందువలన సర్వవిధముల ప్రయత్నించి దుష్ట సాంగత్యము అనే మత్తు నుండి విడుదల పొందాలి.

స్వాధీనమైన మనస్సు నీకు ఎంతో ఉపకారం చేస్తుంది. శక్తిని సమకూరుస్తుంది. తెలివిని పెంచుతుంది. సమగ్రతను చేకూరుస్తుంది. అన్నికోణాలు వికసిస్తాయి. అనేక మంది మంచిమిత్రులు కూడా చేయలేని పనిని చేసి పెడుతుంది. మనస్సు నీస్వాధీనములో లేనప్పుడు ఎవరు ఎంత నిన్ను సుఖపెట్టాలనుకున్నా నీవు సుఖించ లేవు.

నీహృదయములో నున్న సద్వస్తువులో నీవు నిలబడగలిగితే బాహ్య సహవాసము అవసరములేదు. అజ్ఞానము నుండి విడుదల పొందుటకు సత్పురుషులతో సహవాసము అవసరము సహృదయముగలవాడే సత్పురుషుడు. సహృదయము గలవారి సమక్షములో నీకు శాంతి కలుగుతుంది. సహృదయులు కల్పవృక్షమువంటివారు. నీవు అడగకుండానే వారి సహకారము నీకు అందుతుంది. ప్రాణముతో సమానమైన విలువను సత్పురుషుల సాంగత్యమునకుకూడా యివ్వగలగాలి. సత్పురుషులతో సహవాసము చేయుటకు అవసరమైతే భూమి అంచుల వరకు వెళ్ళగలగాలి. సత్పురుషులే ఈ భూమికి సారము. వారు మాత్రమే మానవాళికి అన్ని విధముల ఉపయోగపడతారు.

చూపు, మాట, చేత వాటి అన్నింటి ద్వారా సత్పురుషులు మంచిని చేస్తూనే వుంటారు. మానవాళిపట్ల మాతృభావము చూపుతారు. సమాజ కళ్యాణమును దృష్టిలో వుంచుకొని సత్పురుషులు బోధిస్తారు. వారి బోధ అనుగ్రహముతో నిండి వుంటుంది. ఆత్మను నమ్మాలి అహంకారమును కుమ్మాలి. ఈ రెండూ సత్పురుషుల సాంగత్యము ద్వారా సాధించ వచ్చును. సత్పురుషుడు సామాన్య మానవునికి దూరము కాడు.

లోకములో నున్న సత్పురుషు లందరు కరుణామయులే, ప్రేమమూర్తులే. యాత్రలకంటే, అధ్యయనముకంటే, ప్రాణాయామముకంటే సత్పురుషుల సాంగత్యము ఎక్కువ ఆధ్యాత్మిక సంపదను సమకూరుస్తుంది. సత్పురుషుల సాంగత్యములో బుద్ధి నిశ్చలము అవుతుంది. సిద్ధి కలుగుతుంది.

దేహమునకు ఆహారము ఎంత అవసరమో మనస్సునకు సత్పురుషుల సందేహము కూడా అంతే అవసరము. మనము తిన్న ఆహారము జీర్ణము అయితే, మన దేహమునకు బలము ఎలా సమకూరుతుందో, అదే విధముగా సత్పురుషుల మాటలు మనకు అర్థమైతే మనస్సు కూడా నిర్మలము అవుతుంది. సత్పురుషుల బోధనలను శ్రవణముచేసి, మననము చేసిన యెడల బుద్ధి సూక్ష్మము అవుతుంది. సూక్ష్మమైన బుద్ధి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను అందుకుంటుంది. సత్పురుషుని నోటి నుండి వచ్చిన ప్రతి పలుకు పసిడిపలుకే. ఆ పలుకులు నిన్ను వెన్నంటి తరుముతాయి. ఆ పలుకులు విలువ ఈనాడు తెలియక పోయినా, ఏనాటికైనా, ఏజన్మకైనా అవగాహన అవుతుంది.

సముద్రములో నున్న ఓడలకు ఒడ్డునవున్న లైటు హౌస్ ఎలా ఉపయోగపడుతుందో, అదేవిధముగా అజ్ఞానమనే సముద్రములోవున్న మానవులకు సత్పురుషులు అలా ఉపయోగపడతారు. నీకు సత్పురుషుల సాంగత్యము దొరకకపోతే, మంచి గ్రంథములను పఠించుట మంచిది. మంచి గ్రంథములు కూడా మంచి స్నేహితులవలె ఉపకరిస్తాయి.

## 10

క్రైస్తవ మతమును స్థాపించినవాడు "ఏసు" ఇస్లాం మతమును స్థాపించినవాడు "మహమ్మద్" బౌద్ధమతమును స్థాపించినవాడు "బుద్ధుడు" అన్ని మతములకు స్థాపకులు ఉన్నారు. కాని హిందూ మతమునకు స్థాపకుడు లేడు. అందుచేత హిందూమతమును "సనాతన మతము" అని అంటారు. హిందూమతమునకు మూలము వేదములు.

ఈభూమి పుట్టినప్పటి నుండి వేదములు కూడా వున్నవి. వేదములలో చెప్పబడిన పరమాత్మ అనేక అవతారములు ధరించి నాడు పూర్ణవతారమైన రాముణ్ణి, పరిపూర్ణవతారమైన కృష్ణుణ్ణి, నిత్యావతారమైన శంకరుణ్ణి అనేక మంది భక్తులు అర్చించి, జపించి, స్మరించి, ధ్యానించి తరించారు.

భారతీయ సంస్కృతికి, సభ్యతకు, నాగరికతకు మూలము వేదములే. వేదముల సారమైన మహాభారతము, రామాయణము,

భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు పఠించకపోతే, అవగాహన చేసుకోక పోతే హిందూ మతము యొక్క హృదయము వ్యక్తము కాదు.

క్రైస్తవులకు బైబిల్ ఎటువంటిదో, మహమ్మదీయులకు ఖురాన్ ఎటువంటిదో, బౌద్ధులకు ధర్మపథము ఎటువంటిదో, హిందువులకు భగవద్గీత అటువంటిది. గీత శాస్త్రములకు శాస్త్రము. గ్రంథములకు రాజు. సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణుడి నోటినుండి వెలువడినదే గీతాశాస్త్రము. భగవంతుడు, గీతాశాస్త్రము వేరుకాదు. భగవంతుని హృదయమే శాస్త్రముగా వెలువడినది. మనస్సు అనే మహాసముద్రమును దాటించుటకు గీతాశాస్త్రము ఓడలా ఉపయోగపడుతుంది. అందువలన మానవుడు తరించుటకు శాస్త్రము యొక్క కృప అవసరము.

మానవాళికి జ్ఞానమును ప్రసాదించుటలో గీతతో సమానమైన గ్రంథము మరియొకటి లేదు. అనుదినము గీతామాతను ప్రార్థించి. పఠించి, అర్థము చేసుకొని ఆచరిస్తే మోక్షములో ప్రవేశించుటకు ద్వారములా ఉపయోగ పడుతుంది. అనుదిన జీవితములో నీవు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారము చూపిస్తుంది. అద్దములో చూసుకొని ముఖమును సవరించుకుంటున్న రీతిగా, గీతాశాస్త్రమును ఆధారముగా చేసుకొని నీ బుద్ధిలో నున్న లోపములను, దోషములను సవరించుకొన వచ్చును.

గీతలో చెప్పబడిన విషయములు అర్థము కాకపోతే ఆచరించ లేము. భగవంతుని యందు ప్రేమను కలిగియుంటే ఆయనే నీకు గీతను అర్థము చేసుకొనే బుద్ధిని ప్రసాదిస్తాడు. గీత నీచేతిలో

వుంటే వేదములు అన్నీ నీదగ్గర ఉన్నట్లే భావించ వచ్చును. గీత యొక్క వైభవము దాని సారమును గ్రహించిన వారికే తెలుస్తుంది. గీతను పఠిస్తే పుణ్యము వస్తుంది. మంచి పెరుగుతుంది. అర్థము చేసుకొని ఆచరిస్తే ఆత్మ జ్ఞానము కలుగుతుంది.

భగవంతుడు అందరి హృదయములలో ఆత్మగా వుండి ప్రకాశిస్తున్నానని గీతలో పదే పదే చెప్పినాడు. అందువలన నీవు హృదయము లోనికి వెళ్ళగలిగితే భగవంతుని స్వరూపమును పొందుతావు. నీ మనస్సును అంతర్ముఖ పరచుటకు దైవకృప, శాస్త్రకృప, గురుకృప అవసరము. శాస్త్ర పఠనము. ప్రాణాయామము, మూర్తి ధ్యానము. విచారణ ఇవి అన్ని మనోనిగ్రహమునకు సహాయ పడతాయి. మనోనిగ్రహము అత్యంత ముఖ్యము. నిగ్రహము వ్యర్థము కాదు. మనోనిగ్రహము వలన మాత్రమే మనస్సు తన మూలమైన పరమాత్మలో లయిస్తుంది.

శాస్త్రములను పఠించి, పరిశీలించి, పరిశోధించి నీ హృదయములోనున్న 'అవిద్య'ను తొలగించుకొనవచ్చును. ఏ విద్య అయితే నీలోని అవిద్యను తొలగిస్తుందో అదే నిజమైన విద్య. అదే ఆత్మ విద్య. మానవునికి భౌతిక విద్య ఎంత అవసరమో, ఆత్మ విద్య కూడా అంతే అవసరము. వృత్తి విద్యలన్నీ జీవనోపాధికే పరిమితము అశాంతి నుండి నిన్ను విడుదల చేయలేవు. ఒక్క ఆత్మ విద్య మాత్రమే నీకు శాశ్వతమైన శాంతిని ప్రసాదిస్తుంది. సద్గురువు మాత్రమే ఆత్మ విద్యకు వారసుడు. ఆయన మాత్రమే నీలోని అవిద్యను తొలగించు కొనుటకు సహాయ పడతాడు.

# 11

"గురుర్బ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః" అని శాస్త్రములు చాటుచున్నవి. ఈశ్వరుడు ఈ లోకమును సృష్టించి మానవుడు ఎలా జీవించాలో విశద పరుచుటకు శాస్త్రమును కూడా ప్రసాదించాడు. అందుకే ఈశ్వరుడు మనకు ఆదిగురువు. ఆత్మజ్ఞానమును సంపాదించుటకు యితర దేహముల కంటే మానవ దేహమే ఎక్కువగా ఉపయోగ పడుతుంది. ఆత్మ విద్య పట్ల నీకు నిజమైన ఆపేక్ష వుంటే నీ హృదయములో ప్రకాశిస్తున్న ఆత్మ "గురు" రూపమును ధరించి నీకు బోధిస్తుంది

బ్రహ్మనుభవమును పొందినవాడే వాస్తవమైన గురువు. గురువు బోధస్వరూపుడు ఆత్మవిద్యను సముపార్జించుటకు, వాసనలను క్షయము చేసుకొనుటకు గురు సహాయము అత్యంత ముఖ్యము. ఆత్మజ్ఞాన సముపార్జన, వాసనాక్షయము, ఏక కాలంలో జరుగుతాయి. గురువు బరువుగా వుండడు. ప్రకృతిని దాటి వెళ్ళుటకు సహకరిస్తాడు. మనస్సును అంతర్ముఖపరచి మోక్షసుఖమును అందుబాటు లోనికి తెచ్చేవాడే నిజమైన గురువు.

ఎవరి సమక్షములో మనస్సు నిర్మలము అవుతుందో, నీవు-నేను, అది-ఇది, అను భేదబుద్ధి నశిస్తుందో అతడే సద్గురువు నీహృదయములోనే మోక్షరాజ్యము వున్నది. కాని నీ మనస్సునకు అదివిషయము కాదు. సాధనయొక్క తీవ్రతవలన మనస్సు పలుచబడుతుంది.

మనస్సు నశిస్తే మోక్షరాజ్యము తానుగా వ్యక్తము అవుతుంది. మనస్సే బంధము, మనస్సే సంసారము, మనస్సే ప్రకృతి, మనస్సే ఇంద్రియములకు రాజు. అట్టి మనస్సు అనే సాగరమును దాటించువాడే యథార్ధమైన గురువు. గ్రుడ్డివాడు మరొక గ్రుడ్డివానికి దారి చూపించలేడు. అదే విధముగా జ్ఞాననేత్రము లేనివాడు మరొకనికి జ్ఞానమును ప్రసాదించలేడు.

నీ హృదయము నీకు మంచిని చెపుతూనే వుంటుంది. కాని నీ స్థూల మనస్సు హృదయగతమైన సందేశమును అందుకోలేదు. అందుకే బాహ్యగురువు అవసరము. నీ ప్రవృత్తిని బట్టి నీవు గురువును ఎన్నుకోవాలి. అయితే ఆగురువు కరుణామూర్తి, ప్రేమమూర్తి జ్ఞానమూర్తి అయి వుండాలి. బాహ్యగురువు నీ మనస్సును అంతర్ముఖపరుస్తాడు. ఆత్మరూపములోనున్న నీలోపలి గురువుతనలోనికి మనస్సును గుంజుకొని తన స్వరూపమును ఇస్తాడు. శిష్యులు ఎన్ని జన్మలు ఎత్తినప్పటికిని, జ్ఞానముకలిగే వరుకు గురువు వెంటాడుతూనే వుంటాడు.

గురువులందరు ఒకేవిధముగా వుండరు. కొంతమంది ఆశ్రమములలో నివశించి, శిష్యులను తయారు చేస్తారు. కొంతమంది నిలకడ లేకుండా తిరుగుతూ వుంటారు. కొంతమంది సమాజము మధ్యలో వుండి బోధామృతమును పంచుతారు. కొంతమంది మౌనముగా వుండి బోధిస్తారు.

గురుశిష్యుల సంబంధము విడదీయరానిది. తల్లి ప్రేమ కంటే, తండ్రి ప్రేమకంటే, గురువు ప్రేమ అధికముగా వుంటుంది తల్లిదండ్రుల ప్రేమ లౌకికమైనది. గురువు ప్రేమ అలౌకికమైనది.

రూపవాసనను త్యజిస్తే కాని ఆధ్యాత్మిక మార్గములో పురోగతి సాధ్యము కాదు. శిష్యునిలో నున్న రూపవాసనను తొలగించుటకు ఈశ్వరుడు గురు రూపమును ధరించి వస్తాడు. గురువు ఆయన అనుభవిస్తున్న ఆనందమును శిష్యులకు పంచి యిస్తాడు. సందేహము కంటిలోని నలుసులాంటిది. అన్ని సందేహములు గురు సమక్షములోనే నివృత్తి అవుతాయి.

ముక్తి మార్గములో సురక్షితముగా పయనించుటకు గురువు యొక్క బోధామృతము అవసరము. అరచేతిలోని పండును నీవు ఎంత స్పష్టముగా చూడగలవో, అంత స్పష్టముగా గురువు నీకుజ్ఞానమనే ఫలమును చూపిస్తాడు, శిష్యులయొక్క యోగక్షేమములనే గురువు లక్ష్యముగా పెట్టుకుంటాడు. సహృదయులైన శిష్యులు దొరికినపుడు గురువు యొక్క ప్రేమ పొంగి మాటల రూపములో, పాటల రూపములో ప్రవహిస్తుంది. నమ్రతగల శిష్యుడు గురువు యొక్క అనుగ్రహమును అధికముగా పొందగలడు. వినయము లేనివాడు విద్యను సాధించలేడు. మంచి సంస్కారములను పొందలేడు. గురు శిష్యుల సంబంధము ప్రేమ పూరితమైనది. గురు శిష్యుల ప్రేమ త్రెంచలేము.

శిష్యుని హృదయములో నున్న బలహీనతలు అనే బండ రాళ్ళను గురువు బయటకు తొలగిస్తారు. అయితే దానికి గురు శిష్యుల మధ్య అనురాగము అవసరము. శిష్యునిలో అజ్ఞానము ఏ రూపములో ఉన్నప్పటికి దానిని బయటకు లాగి, కాల్చి బూడిద చేసేవరకు గురువు విశ్రమించడు. బంధువులతో, స్నేహితులతో

నీకు వున్న సంబంధము ఈ జన్మతో తెగి పోవచ్చును. కాని సద్గురువుతో వున్న సంబంధము సత్యాత్మను తెలుసుకొనే వరకు వుండనే వుంటుంది. మరణానంతర జీవితములో కూడా గురు సహాయము వుంటుంది. విద్య యొక్క చిటారుకొమ్మ కూడా గురువు అనుగ్రహము వలన నీకు అందుతుంది.

అజ్ఞాన నాశనమునకు స్వప్రయత్నము, గురుబోధ, దైవానుగ్రహము అవసరము. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన, సద్గురువు యొక్క అనుగ్రహము వలన రాలిపోతాయి. శిష్యునియొక్క ప్రారబ్ధ వేగమును తగ్గించుటకు, అతనిలోనున్న కర్తృత్వమును తొలగించుటకు, అతని స్వరూపమైన ఆత్మను తెలుసుకొనుటకు అనుగ్రహ పూరితముగా గురువు బోధిస్తాడు.

# 12

అన్ని వ్రతములలో బ్రహ్మచర్య వ్రతము గొప్పది. "బ్రహ్మము"ను తెలుసుకొనుటకు "బ్రహ్మచర్యము" అవసరము. నీ స్వరూపము బ్రహ్మమే ఆ బ్రహ్మములో చరించుటను "బ్రహ్మచర్యము" అంటారు. బ్రాహ్మీస్థితిని పొందుటకు శారీరక బ్రహ్మచర్యము కంటే మానసిక బ్రహ్మచర్యమును అవలంబించుట కష్టము. దైవానుగ్రహము లేనివాడు బ్రహ్మచర్యమును అవలంబించలేడు.

దృఢ నిశ్చయము, కఠోరదీక్ష, తగిన అర్హత వుంటేనే బ్రహ్మచర్యమును అవలంబించాలి. కృతనిశ్చయము లేనివాడు కొన్ని

సంవత్సరములు బ్రహ్మచర్యమును అవలంబించినను తరువాత కొంతకాలమునకు ఇంద్రియ నిగ్రహమును కోల్పోతాడు. ఇంద్రియ బద్ధుడు బానిస అవుతాడు. స్వేచ్ఛను, శాంతిని కోల్పోతాడు. అన్ని ఇంద్రియములను నిగ్రహించుకొన్నవారికి మాత్రమే బ్రహ్మచర్యము సాధ్యము. పట్టుదల బ్రహ్మచర్య నియమమునకు ప్రాణం పోస్తుంది.

బ్రహ్మచర్య దీక్ష తీసుకొన్నవాడు దుష్టులకు దూరముగా వుండాలి. భోగులను గురించి, భాగ్యవంతులను గురించి చెప్పుకొనే మాటలు వినుట మంచిది కాదు. కృత్రిమ జీవితమునకు దూరముగా వుండాలి. వ్యర్థమైన మాటలు, వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కోరికలు, వృథాప్రేలాపనలు బ్రహ్మచర్యమును భంగ పరుస్తాయి. క్షుద్ర సాహిత్యమును చదువుట, పామరుల మాటలు వినుట పనికి రాదు. గృహ చాపల్యము, జిహ్వా చాపల్యము, దృష్టి చాపల్యము, ధనకాంక్ష బ్రహ్మచర్యమునకు అవరోధములు.

బ్రహ్మచర్యము అవలంబించినంత మాత్రాన బ్రహ్మ స్వరూపము తెలియదు. నీ హృదయములోనున్న కోరికలను, ఉద్రేకాలను, రాగబంధాలను త్రెంచుకొంటేనే ఆత్మ స్వరూపము తెలుస్తుంది. బాహ్య సంసారము జయించినవాడు బ్రహ్మచారి కాదు. మనో సంసారాన్ని జయించినవాడే బ్రహ్మచారి. నీ హృదయములో నున్న శాంతి, సుఖము నీ అనుభవము లోనికి రావటంలేదు. కాబట్టి వాటి కోసం నీవు బయట వెదకుచున్నావు. నైష్ఠిక బ్రహ్మచారి తనకు అన్యముగా ఏ సుఖము లేదని బయట నుండి ఏ సుఖాన్ని ఆశించడు.

హృదయములో కామము వున్నంత కాలం స్త్రీ, పురుష భేదము

కనిపిస్తుంది. దేహదృష్టితోచూస్తే ఇది స్త్రీ దేహమని, ఇది పురుష దేహమని ఒకరిపై ఒకరికి వ్యామోహము కలుగుతుంది, బంధము ఏర్పడుతుంది. స్త్రీ, పురుష సంబంధము గొప్ప సుఖాన్ని యిస్తుందని భావించుచున్నావు. కాని ఆ సుఖము ఎక్కడ నుండి వస్తున్నదో గమనించావా? స్త్రీ, పురుష సంబంధము వల్ల వచ్చే సుఖం కోరిక నెరవేరుట వలన వచ్చినట్లు అనిపిస్తుంది. ఒక కోరికమీద నీ మనస్సు ఏకాగ్రమైనప్పుడు, ఆ కోరిక నెరవేరినప్పుడు, నీ మనస్సు అంతర్ముఖమై ఆత్మవైపు ప్రయాణము చేస్తుంది. కాబట్టి "ఆత్మ" సుఖమునీకు అందుచున్నది. సుఖము అనేది ఒక్క ఆత్మలోనే ఉంది నీ హృదయములో నున్న సుఖము నీ అనుభవము లోనికి వస్తే బయట సుఖాలతోటి పని ఏముంది? దేహ వాసన లోంచి సెక్సు వాంఛ ఉదయిస్తుంది. ఆత్మదర్శనము అయ్యేవరకు సెక్సు వాంఛ ఏదో రూపములో నిన్ను వెంటాడుతూనే వుంటుంది. ఆత్మానుభవము అయిన వెంటనే సెక్సు వాంఛ అంతరిస్తుంది.

మనస్సునకు కావలసిన భోగములలో సెక్సు ముఖ్యమైనది. మనస్సు మెదలితే తిరగక మానదు. మనస్సు, ప్రాణము, వీర్యము ఈ మూడు అవినాభావ సంబంధము గలవి. ఒకటి కదిలితే మిగిలినవి రెండు కదులుతాయి. స్థూలరూపములోనున్న ప్రాణమును సూక్ష్మ రూపములో నున్న మనస్సును నిగ్రహించు కుంటే వీర్యమును కాపాడుకొన వచ్చును. బ్రహ్మచారికి బ్రహ్మచర్యమే బలము. ప్రాపంచకునికి ధనమే బలము భక్తునికి భగవంతుడే బలము. బ్రహ్మచర్యమునకు ప్రాణాయామము ఎంతగానో సహక రిస్తుంది. పూజ, జపము, ధ్యానము కూడా సహకరిస్తాయి.

బ్రహ్మచర్య నియమమునకు శాంత చిత్తము అవసరము. శాంత చిత్తము లేనివాడు వాంఛలతో పోరాడలేడు. సమత, మమత, రమత శాంతిని పెంచుతాయి. బ్రహ్మచర్యమును అవలంబించిన వాడు మాత్రమే పరిణామములో సాధువు అవుతాడు. బ్రహ్మచర్య దీక్ష మానవునికి అజ్ఞానముతో ఉన్న ముడిని కత్తిరిస్తుంది. బ్రాహ్మీ స్థితిని చేకూరుస్తుంది.

# 13

ఆత్మ దర్శనమునకు ఏవేవి సహకరిస్తాయో, ఎవరెవరు సహకరిస్తారో తెలుసుకున్నావు. నీ హృదయములో నిరంతరము స్వయంగా ప్రకాశిస్తున్న ఆత్మను నీ అనుభవములోనికి రాకుండా అడ్డువస్తున్న దుర్వాసనలను ఎలా తొలగించు కోవాలో, సద్వాసనలను ఎలా సంపాదించుకోవాలో యిప్పుడు తెలుసుకుందాము.

మానవుడు పనిచేసి ఫలితమును ఆశిస్తాడు. ఫలితము వచ్చిన తరువాత దానిని భోగిస్తాడు. భోగానుభవము వలన హృదయములో వాసన ఏర్పడుతుంది ఆ వాసనలు గతిని నిరోధిస్తాయి. దేహబుద్ధి వున్నంత కాలము మానవుడు కర్మ ఫలితమును ఆశిస్తూనే వుంటాడు. దేహబుద్ధితో సమానమైన మత్తు ఈ లోకములో కాని, పరలోకములో కాని లేనేలేదు. ఆత్మబుద్ధి కలిగే వరకు దేహబుద్ధి విడిచి పెట్టదు.

అహంకారమును అంటిపెట్టుకొని ప్రతి వాసన వ్రేలాడుతూ వుంటుంది. ప్రకృతి వాసనలు నిశ్శేషముగా నశించే వరకు గుండెను

దుఃఖము పట్టి పీడిస్తూనే వుంటుంది. బీజరూపములో నున్న వాసన తలంపుగామారి నీ శిరస్సు లోనికి వచ్చేవరకు నీ హృదయములో నున్న వాసన నీకు తెలియదు నీలోనున్న వాసనలు నీకు తెలియుట అవసరము. నీకుతెలియకపోతే వాటిని తొలగించుకొనుటకు ప్రయత్నము చేయవు. నీలోని చెడు తలంపులను తొలగించుకొనుటకు, మంచి తలంపుల సహయము అవసరము. మంచితనము పెంచుకుంటే ఏకాగ్రత కలుగుతుంది. జ్ఞానము ఉదయిస్తుంది.

భయస్థునికి, బద్ధకస్థునికి, బలహీనునికి ఆత్మ జ్ఞానము కలుగదు. భయస్థుడు స్వతంత్రముగా ఆలోచించలేడు. అతనికి ఆత్మ విశ్వాసము కుదరదు. జీవితము పొడుగునా భయస్థుడు ఎత్తు వారి చేతి బిడ్డవలె వుంటాడు.

నీకు తలంపు వచ్చిన తరువాత భయము వస్తున్నదా? తలంపు రాకుండా భయము వస్తున్నదా? నీకు తలంపు వచ్చిన తరువాతనే భయము వస్తున్నది. అంటే భయము కూడా ఒక తలంపే. ఆ తలంపే నీవు అనుకొంటున్నావు కాబట్టి నీ మనస్సులో ఆందోళన. పుడుతుంది ఆందోళన ఆవేశమును పెంచుతుంది. ఆవేశము వివేకమును చంపుతుంది. నీతో పొరపాట్లు చేయిస్తుంది. నీలో జీవలక్షణములు వున్నంత వరకు భయము వెంటాడుతూనే వుంటుంది. వాసనాక్షయము అయ్యేవరకు అభయస్థితిరాదు.

భయము వలన శరీరమునకు అనారోగ్యము, మనస్సునకు అశాంతి, గుండెకుబాధ కలుగుతాయి. అన్ని దుఃఖములకు భయమే కారణము. భయము దేహ బుద్ధిని పెంచుతుంది. దేహాభిమానమే

భయమునకు కారణము అన్ని బలహీనతలకు, రోగములకు, లోపములకు, కష్టములకు, నష్టములకు, భయమే కారణము.

భయస్థుడు భౌతికమైన పురోభివృద్ధిని కాని ఆధ్యాత్మిక వికాసమును కాని సాధించలేడు. భయము వలన నరముల బలహీనత వస్తుంది. దేహమునకు కుదుపు వస్తుంది. బుద్ధిమాంద్యం వస్తుంది. జ్ఞాపకశక్తి సన్నగిల్లు తుంది. బాహ్యమైన మారణాయుధముల కంటే నీ మనస్సులోని భయమే నిన్ను ఎక్కువ హింస పెడుతుంది. భయస్తుడు తన కుటుంబమునకు గాని సమాజమునకు గాని ఉపయోగ పడలేడు.

నీవు భయపడుటకు ఈ లోకములో ఏముంది. ? ఉన్నది ఆత్మ ఒక్కటే. మరి దేనిని చూసి నీవు భయపడుచున్నావు. ఆత్మకు అన్యముగా ఏదైన వుంటే నీవు భయపడాలి గాని, ఆ విధముగా లేనప్పుడు ఈ లోకములో నీవు దేనిని చూసి భయపడనక్కరలేదు.

అభయస్థితిని పొందకుండా ఆత్మను అందుకోలేవు. అన్ని సుగుణములకు అభయము రాజు లాంటిది. అందువలన అభయ స్థితిని ప్రసాదించమని "ఈశ్వరున్ని" ప్రార్థించాలి.

ఈశ్వరునిపట్ల భక్తి పెంచుకుంటే భీతి పలుచ బడుతుంది. ఈశ్వరునిపట్ల విధేయత చూపిస్తున్న వారికి ఆరోజు కారోజు భయము దూరమై ధైర్యము అభివృద్ధి అవుతుంది.

# 14

దేహమునకు ఆహారము ఎంత అవసరమో, చదువుకు తెలివి ఎంత అవసరమో, హృదయ వికాసమునకు ధైర్యము అంతే అవసరము. ఏ రంగములోనైనా అభివృద్ధి చెందాలంటే ధైర్యము వుండాలి. ఆటక ఎక్కుటకు నిచ్చెన ఎలా ఉపయోగ పడుతుందో, అదే విధముగా ఆధ్యాత్మిక శిఖరములు అధిరోహించుటకు ధైర్యము అలా ఉపయోగ పడుతుంది. ఒక్క ధైర్యవంతుడు మాత్రమే ప్రకృతి ప్రలోభముల నుండి బయటపడి, స్వేచ్ఛా మండలములో ప్రవేశించ గలడు.

కొంత మంది పైకి గంభీరముగా కనిపించినా, లోపల పిరికి తనము వుండనే వుంటుంది. అల్పుడిని ధైర్యము వరించదు. ధైర్యము జ్ఞాపకశక్తిని, మేధాశక్తిని అభివృద్ధి చేస్తుంది, ఎక్కడ పవిత్రత వుందో అక్కడ అభయస్థితి ఉంటుంది. పవిత్రత ఏస్థాయి వరకు పెరిగితే, ధైర్యము ఆ స్థాయి వరకు పెరుగుతుంది.

నేటి సమాజములో వాంఛలు లాంఛనములుగా మారినవి. ఎవడైతే తన వాంఛలను సమూలముగా తొలగించుకో గలడో వాడే నిజమైన ధీరుడు. ప్రారబ్ధము ఏమి తీసుకొని వచ్చినా మౌనముగా భరిస్తాడు ధీరుడు. ధీరుడు పనిచేస్తాడు కాని, ఫలితమును ఆశించడు. సర్వరోగములకు ధైర్యము ఔషధము లాంటిది. ఆపద సమయములో ధైర్యమే రక్షిస్తుంది. ఒక్క ధైర్యవంతుడు మాత్రమే లోకాన్ని జయించగలడు, మృత్యువును జయించగలడు, ఆత్మ సౌందర్యమును దర్శించ గలడు.

## 15

ఎవడి హృదయములో హింసా ప్రవృత్తి వుంటుందో వాడు హింస చేయకుండా వుండలేడు. కష్టములలో ఉన్న వారిని చూసి, నీకు సంతోషము కలుగుతూ వుంటే, నీహృదయములో హింసా ప్రవృత్తి ఉన్నట్లే. మనస్సుతోను, మాటతోను, దేహముతోను ఇతరులను నొప్పించడం, బాధించడం, హింస అవుతుంది.

అహంకారమే హింసా ప్రవృత్తికి కారణము. అహంకారమే తాను అనుకోవడం రజోగుణము నుండి పుడుతుంది. హింసను పెంచేది రజోగుణమే. అహంకారమును ఆత్మ అని భావించుట వలన తారుమారు పరిస్థితి ఏర్పడు చున్నది, గందర గోళము కలుగు చున్నది, చిరాకులు, పరాకులు పెరుగు చున్నవి. వివేక వంతుడై జీవించే వాడికి మాత్రమే ఆత్మకు, అహంకారమునకు మధ్యనున్న భేదము గోచరిస్తుంది.

హింసావాది ఎంతో చాకచక్యముగా, ఎంతో రహస్యముగా ఎవ్వరికి తెలియకుండా చేసిన హింసాకార్యం ఇప్పుడు వెలుగులోకి రాకపోయినా ఏనాటికైనా, ఏజన్మకైనా, అతనిని వెంటాడుతూనే వుంటుంది. ఎదుటి వారిని హింసకు గురిచేస్తే పరిణామములో నీవు కూడా హింసకు గురికాక తప్పదు. ఈజన్మలో చేసిన పనులే మరు జన్మలో నీకు ఎదురు వస్తాయి. కర్మేంద్రియములతో చేసిన కుచేష్టలు వాసనలుగా మారి నీ హృదయములో దాగి ఉండి, భవిష్యత్తులో అనేక నీచ జన్మలను తీసుకువస్తాయి.

హింసా ప్రవృత్తి గలవాడు ఎదుటి వారికి అపకారము చేస్తు న్నాననుకొని తనకు తానే అపకారము చేసుకొంటాడు. పరిణా మములో తనకుతానే శత్రువు అవుతాడు తోటివారి సంతోషమును తన దుఃఖముగా మార్చు కుంటాడు. స్వార్థమును, క్రూరత్వమును పెంచుకుంటూ పోతాడు. మంచి చెడుగా కన్పిస్తున్నంత కాలము హింసావాది హింసను చేస్తూనే వుంటాడు. హింసకు అలవాటు పడిన మానవుడు అరోజు కారోజు హీనస్థితి దిగజారిపోతాడు.

హింసా ప్రవృత్తికి అలవాటు పడినవాడు జీవితములో నున్న సౌందర్యము చూడలేడు. కళాత్మక దృష్టి కలుగదు. హింస వలన ఉద్రిక్తత పెరుగుతుంది. ఉద్రిక్తతవలన ఉన్న సమస్యలు పరిష్కారము కావు. క్రొత్త సమస్యలు వస్తాయి. హింసను ప్రయో గించి తీసుకొని వచ్చిన సమానత్వము కలకాలము నిలబడదు. ఉగ్రత సమగ్రతను తీసికొని రాదు. హింసా ప్రవృత్తి మనో వికాసాన్ని నిరోధిస్తుంది.

ద్వేషమును ప్రేమతోను, హింసను అహింసతోను పరిష్కరించ వచ్చును. హింసా ప్రవృత్తిగలవాని మనస్సులో మాలిన్యము పేరుకు పోతుంది. ఎదుటివారిని ప్రేమించి, సమాజమునకు మంచిచేస్తూ, మంచిగా జీవిస్తే మనస్సులోని మాలిన్యము కరిగి పోతుంది. మంచి తనము లేనివాడు అహింసా వ్రతమును అచరించలేడు. అహింసా వ్రతము హింసను చల్లారుస్తుంది. ఆత్మ స్వరూపమును పట్టి యిస్తుంది.

## 16

చిత్తశుద్ధి లేనివాడు, సవ్యత లేనివాడు, ఆత్మవిశ్వాసము లేనివాడు అహింస వ్రతమును ఆచరించలేడు. అహింసా వ్రతము లేకుండా ఆత్మ జ్ఞానము కలుగదు. మనస్సుతోగాని, మాటతోగాని, దేహముతోగాని ఇతరులను నొప్పించకుండా వుండటమే అహింస. కష్టములలో నున్న వారిని చూసి అహింసావ్రతుని మనస్సు ద్రవిస్తుంది. అహింస సత్వగుణమునకు సంబంధించినది.

ఎవరి హృదయములో దయాగుణము పొంగి పొరలుతుందో వాడే అహింసావాది. అహింసావాది తోటిమానవుడు ఆదరించి, దయతో తడిపి, పూజిస్తాడు. ప్రేమించటం కంటే పూజించుట ఉత్తమమైనది. అహింసావాదికి ఇష్టులుకాని దుష్టులుగాని వుండరు. అహింసావాది పరిణామములో మహాత్ముడు అవుతాడు.

అహింసా వ్రతుడు తోటివారి క్షేమముకొరకు తన్నుతాను మరచి కర్మఫలమును ఆశించకుండా పనిచేసుకొని పోతూవుంటాడు. చేసిన పనిని చెప్పుకోడు. అహింస మనస్సును విశాల పరుస్తుంది. హృదయపు లోతులను పెంచుతుంది. ధైర్యమును చేకూరుస్తుంది. ధైర్యము లేనివాడు ఆత్మ సౌందర్యమును దర్శించలేడు.

అహింస సమత్వ దృష్టిని కలిగించి సమాజములో అసమానతలను తొలగించుటకు సహకరిస్తుంది. అహింసామూర్తులే ధర్మమూర్తులుగా, కరుణామయులుగా, సాధువులుగా, మహర్షులుగా మార్పు చెందుతారు. సమాజములో ధర్మమును స్థాపించుటకు అహింసామూర్తులు, సహృదయులు సహకరిస్తారు.

అహింసా సిద్ధాంతమును జీవితములో ఒక భాగముగా చేసుకొని జీవిస్తే నీలోని అజ్ఞానము పలుచబడుతుంది. అహింసను ఆచరిస్తే నీలోని భక్తి పరిమళించి పవిత్రమౌతుంది. పవిత్రత పరమాత్మలో సంగమమును చేకూరుస్తుంది.

# 17

తన మేలును మాత్రమే కోరుకునే వానిని, స్వసుఖమును మాత్రమే చూసుకునే వానిని, ఇతరుల క్షేమము కోరని వానిని, దయాళుడు కానివానిని, "స్వార్థపరుడు" అంటారు. స్వార్థము రజోగుణమును పెంచుతుంది. లోకములో జరుగుచున్న మారణహోమములకు, ఈర్ష్యలకు, స్పర్థలకు వంచనలకు స్వార్థమే కారణం.

స్వార్థపరుడు స్వప్రయోజనము కోసము సన్నిహితులను కూడా బలిచేస్తాడు. స్వార్థముతో భగవంతుని పూజించినా, దానములు చేసినా సత్ఫలితములను ఇవ్వవు. భగవంతున్ని స్వార్థపరుడు ప్రేమించడు. ఆయనతో వ్యాపారముచేస్తూ వుంటాడు. అందువలన స్వార్థపరునికి భగవదనుభూతి కలుగనే కలుగదు, జ్ఞానోదయము కాదు.

స్వార్థపరుడు వ్యక్తిభావనను త్యజించలేడు. తన తెలివిని, యుక్తిని, భావమును, మాటను, ఇంద్రియములను తనస్వార్థము కోసమే ఖర్చు పెడతాడు. లోక కళ్యాణమును గూర్చిన ఆలోచన

వుండదు. ఎన్నో బలహీనతలు వున్న మానవునిలో కూడా మార్పు రావచ్చునేమో కాని స్వార్థము కలవానిలో మానసిక పరివర్తనరాదు, స్వార్థపరునకు పరమార్థము ఎన్నడూ అందదు.

పాముల మధ్య ఎంత జాగ్రత్తగా వుంటామో స్వార్థపరుల మధ్య కూడా అంతే జాగ్రత్త వహించాలి. స్వార్థపరులు ఎప్పుడు ఎక్కడ ఎలా కాటు వేస్తారో నీవు ఊహించలేవు. స్వార్థపరునికి వాని కంటిలో నున్న దూలము కనిపించదు కాని ఎదుటివారి కంటిలోని నలుసును కనుగొంటాడు స్వార్థపరుడు ఎదుటివారిలో నున్న మంచి తనమును కళ్ళుండి చూడలేడు, చెవులుండి వినలేడు. స్వార్థమునకు మంచితనమునకు పొత్తు పొసగదు. మంచితనమును అమాయకత్వముగా స్వార్థపరుడు పరిగణిస్తాడు.

కామ్యకర్మలు మనిషిలోనున్న స్వార్థమును పెంచుతాయి. ప్రతిఫలాపేక్ష లేకుండా, సోమరితనము లేకుండా, అభిమానదురభిమానములు లేకుండా నిరంతరము సమాజము కోసం పనిచేస్తే స్వార్థము కొంత వరకైనా పలుచ బడుతుంది. నిష్కామకర్మ మనస్సు శుద్ధి చేస్తుంది. నిష్కామకర్మ చేసేవాడు నారాయణ స్వరూపమును పొందుతాడు. యజ్ఞ దాన, తపస్సుల వలన స్వార్థము పూర్తిగా కరిగి పోతుంది. స్వార్థము కరగకుండా ఆత్మ సామ్రాజ్యమునకు అధిపతి ఎలా కాగలడు? స్వార్థము నశిస్తే, తోటి మానవులపట్ల దయ, సానుభూతి కలుగుతాయి.

స్వార్థమును పరమార్థముగా పెట్టుకొన్న వాడికి త్యాగము యొక్క వైభవము ఎలా తెలుస్తుంది? త్యాగము వ్యక్తి భావనను

కరిగిస్తుంది. త్యాగబుద్ధిని వృద్ధి చేసుకుంటే స్వార్థబుద్ధి దూరము అవుతుంది.

## 18

కొవ్వొత్తి తాను కరిగిపోతూ ఎదుటివారికి వెలుగును ఇస్తుంది. గంధపుచెక్క తాను అరిగిపోతూ ఎదుటివారికి పరిమళమును వెద జల్లుతుంది. చెఱుకు ముక్క తాను నలిగిపోతూ ఎదుటి వారికి తియదనమును పంచుతుంది నీవు స్వార్థముతో మొక్క నాటినా అది నిస్వార్థముగానే ఫలమును యిస్తుంది. స్వార్థమనే ఊబిలో కూరుకు పోయిన వారికి వాటి త్యాగ నిరతి ఎలా అర్థము అవుతుంది. స్వార్థ మనే ఊబినుండి బయటపడుటకు త్యాగమనే కొమ్మను పట్టుకోవాలి.

ప్రతిఫలము ఆశించేది త్యాగము కాదు. ఫలితమును సమాజమునకు అర్పించి పనిచేయడమే త్యాగము. ఇష్టములేని వస్తువులను వదలి వేయుట త్యాగము కాదు. ఇష్టమైన వస్తువులను వదలి వేయడమే త్యాగము. బాహ్యవస్తువులను త్యాగం చేయుట త్యాగము కాదు. ఆత్మను తెలుసు కొనుటకు అడ్డము వచ్చే వాస నలను వదలి పెట్టడమే త్యాగము. దుష్టవాసనలను, దురభ్యాసము లను, దురాలోచనలను, దుర్వాసనలను, దురాశను విడిచి పెట్టుట కూడా త్యాగమే.

నీవు పేరుకోసం ఎంత అయినను త్యాగము చేస్తావు కాని, దేవుని ప్రీతికోసం త్యాగం చెయ్యగలవా ? బాహ్య వస్తువులను

ఎన్నింటిని త్యాగము చేసినా, మిథ్యా నేనును త్యాగము చేయకపోతే అజ్ఞానము నిన్ను విడిచి పెట్టదు. ఈమిథ్యా నేనే శాంతిని, సుఖాన్ని మోక్షాన్ని పొందకుండా నిన్ను సంసార చక్రములో పెట్టి నలిపి వేస్తుంది. ప్రతిజన్మలోను నిన్ను వెంటాడుతూనే వుంటుంది.

త్యాగికి లోకమంతా తన గృహముతో సమానము. తన్ను తాను మఱచిపోయి చేసే ప్రతిపని త్యాగంతో సమానము. త్యాగము వలన ఏకాగ్రత, పవిత్రత సిద్ధిస్తాయి. పవిత్రత నిన్ను పునీతుణ్ణి చేస్తుంది.

## 19

ఈ లోకములో శారీరకముగా గాని, మానసికముగా గాని, ఒకరినిపోలి మరిఒకరు ఉండరు. ఎక్కడో అక్కడ కొంచెము అయినా తేడా కనిపిస్తుంది. సాంఘిక పరమైన, ఆర్థిక పరమైన విషయములలో కూడా వ్యత్యాసము వుంటుంది. అలాంటప్పుడు ఒకరితో పోల్చుకొని, పొంగిపోవలసినది ఏమున్నది ? కృంగిపో వలసినది ఏమున్నది ?

ఎదుటివారు నీకంటె ఎక్కువ అవి భావిస్తే నీలో "అసూయ" పుడుతుంది. తక్కువనిభావిస్తే "అల్పత్వము" కలుగుతుంది పూర్వ జన్మ సుకృతమును బట్టి కొంతమంది సౌందర్య వంతులుగాను, కొంతమంది శ్రీమంతులుగాను, కొంతమంది మంచి గుణములతోను మరికొంతమంది మేధావులుగాను పుడతారు. వారినిచూచి అసూయ

పడుట వలన నీకు ఏమియూ కలిసిరాదు. ఈజన్మలో నీవు కష్టపడి మంచిగుణములను సంపాదించుకొనుటకు ప్రయత్నము చేయాలి.

సాటి మానవుని అభివృద్ధి చూసి ఓర్వలేని వానిని "అసూయ పరుడు" అని అంటారు. అసూయగ్రస్తులు పెట్టిన బాధలు, చేసిన హింసలు చరిత్ర పుటలలో ఎన్నో కన్పిస్తాయి. అసుర సంపదతో పుట్టినవారిని అసూయ ఉదయిస్తుంది. అసూయ మనస్సును బంధిస్తుంది. అజ్ఞానములో ముంచుతుంది. మనోవికాసమును గలుగనీయదు. కర్మక్షేత్రములో రాణించుటకు అడ్డుగా నిలుస్తుంది. అసూయ నరకప్రాయము.

అన్ని చెడ్డగుణములలో ఎందుకూ పనికిరాని చెడ్డ గుణము అసూయ. అసూయ నిన్ను సూదివలె పొడుస్తూ వుంటుంది. అసూయతో నిండిన మనస్సునకు శాస్త్రము అర్థము కాదు. హృదయములో అసూయను నింపుకొని దైవమును పూజించినా, భజించినా దైవముచేత ఆకర్షించ బడదు.

అసూయతో మండుతున్న వానికి అభ్యుదయ దృక్పథము వుండదు. అసూయగ్రస్తునికి మానసిక పరివర్తనరాదు. అసూయాగ్రస్తుడు ఆత్మసాధన చేయలేడు, మర్యాదస్తులకు, ఆత్మశాంతిని, ఆత్మ వైభవమును పొందలేడు. మర్యాదస్తులకు, నెమ్మదస్తులకు. వినయవంతులకు, పుణ్యవంతులకు, కరుణామయులకు అనసూయులకు ఆత్మ వైభవము అందుతుంది. అసూయ నీ దేహమును, మనస్సును వేడెక్కిస్తుంది. అసూయ అనే అగ్నిని ప్రేమ అనే నీరుతో ఆర్పాలి.

# 20

ఈ లోకంలో నీకు కన్పిస్తున్న ప్రేమ ప్రేమకాదు, వ్యామోహమే! ప్రేమ, మోహము పరస్పరము భిన్నమైనవి ప్రేమ వెలుతురును ఇస్తుంది. మోహము చీకటిలోనికి నెట్టుతుంది. ప్రేమ అడుగదు. మోహము అడుగుతుంది. ప్రేమ అపరిమిత మైనది. మోహము పరిమిత మైనది. ప్రేమలో హెచ్చు తగ్గులు ఉండవు. మోహములో హెచ్చు తగ్గులు వుంటాయి. ప్రేమగల వానికి లోకమంతా తన కుటుంబమే. భౌగోళికమైన హద్దులు వుండవు. మోహముగలవాడు తన కుటుంబమునే గృహముగా చూస్తాడు.

సాంఘికముగా ఎటువంటి ఉన్నత స్థానములోవున్నా మోహముగలవాడు కూలివాడే. మోహముగల వానికి ద్వేషించడమే గాని, ప్రేమించడం తెలియదు. మోహముగల వానికి చెడు మంచిగా కన్పిస్తుంది. మర్యాద బలహీనతగా కన్పిస్తుంది. మోహము మనో వికారములను తెచ్చి పెడుతుంది. అహంకారమే తాను అనుకునే వాడు తోటి మానవుని సేవించలేడు, ప్రేమించలేడు. మోహము యొక్క మూలమును చూడలేనివాడు మోహమును తొలగించుకో లేడు.

ప్రేమ స్వచ్ఛమైనది, నిర్మలమైనది, నిశ్చలమైనది. ప్రేమ తత్వము భిన్నత్వమును తగ్గించి, సమదృష్టిని సమకూరుస్తుంది. సమదృష్టి లేకుండా భగవంతుని స్వరూపమును పొందలేము. ప్రేమమయులుగా జీవించేవారు అమృత స్థితిని పొందుతారు.

ఎండమావిని చూసి దాహము తీర్చుకోవాలనటం ఎటువంటిదో ప్రేమలేని జీవితమునకు జ్ఞానోదయము అవుతుంది అనటం కూడా అటువంటిదే. సాటి మానవునిపట్ల ప్రేమ లేనివాడి మనస్సుకు, మాటకు, చేతకు అంతరము పెరుగుతూ వుంటుంది. అందరిపట్ల కరుణ కలిగియుంటే వ్యక్తిభావన ఎండిపోతుంది. ధర్మమును కేంద్రముగా పెట్టుకొని జీవించడం నేర్చుకోవాలి. భగవంతునికోసం సామాన్య ధర్మములను విడిచి పెట్టినా దోషం లేదు.

ఈశ్వరునికి ప్రత్యేకముగా ఒక రూపము లేదు. అన్ని రూపములు ఈశ్వరునివే. ఈశ్వరుడు నీ హృదయములో ఆత్మగా, స్వయముగా ప్రకాశించు చున్నాడు. నీ ఇంద్రియ గుణములను, మనోధర్మములను, బుద్ధి చాపల్యమును, ఆత్మమీద ఆరోపించుట వలన నీకు ఆత్మ అవగాహన కావటం లేదు. నీకు ఈశ్వరుని అస్తిత్వము పట్ల స్థిరమైన, లోతైన విశ్వాసము వుంటే మనస్సు చలించదు. ఈశ్వరుణ్ణి గాఢముగా, గూఢముగా ప్రేమిస్తే జీవలక్షణములు చీకిమన్ను అవుతాయి ప్రేమలేని జీవితమునకు యోగముసిద్ధించదు. ఈశ్వర దర్శనము లభించదు.

ఈశ్వరుని కంటే ఎక్కువగా నిన్ను ప్రేమించేవారు లేరు. భౌతికమైన తల్లిప్రేమ కంటే ఈశ్వరుని ప్రేమ గొప్పది. తల్లి ప్రేమ భౌతికమైనది, లౌకికమయినది. ఈశ్వరుని ప్రేమ అభౌతికమైనది అలౌకికమైనది. ఈశ్వరుడే నీకు నిజమైన బంధువు. ఈశ్వరునిపట్ల ధ్యాసను పెంచుకుంటే ధ్యానముగా మారుతుంది. ధ్యానము చేయగా, చేయగా ఆత్మను పొందుటకు అడ్డుగానున్న కల్మషము బయటకు నెట్టివేయ బడుతుంది.

ఆధ్యాత్మికముగా అభివృద్ధికి రావాలంటే ఈశ్వరానుగ్రహము అవసరము ప్రతిఫలమును ఆపేక్షించకుండా పనిచేస్తే ఈశ్వరానుగ్రహము వర్షిస్తుంది. ఈశ్వరానుగ్రహము వర్షించినవేళ నీ మనస్సు ఇంద్రియములు చల్లబడతాయి సద్బుద్ధి కలుగుతుంది. బుద్ధిలోని అన్ని కోణములు వికసిస్తాయి. వాసనా రూపములోనున్న బరువైన రాళ్ళు ఈశ్వరానుగ్రహము వలన మాత్రమే హృదయము నుండి బయటకు కొట్టుకొని పోతాయి. ఈశ్వరానుగ్రహము నిన్ను జనన, మరణ, రూప, సంసారము నుండి విమోచన కలిగిస్తుంది.

## 21

ఈసృష్టిలో మానవుడు నిజముకంటే, కల్పితమునే ఎక్కువ ఇష్టపడతాడు. కృత్రిమముగా జీవించేవాడు ఈలోకములో తనంతటి వాడు లేడు అనుకుంటాడు. స్వార్థమే కృత్రిమ జీవితమునకు కారణము. ఆత్మ సహజమైనది అందువలన సహజముగా జీవించే వారికి మాత్రమే ఆత్మ లభ్యమౌతుంది గాని కృత్రిమముగా జీవించే వారికి మాత్రము ఆత్మ లభ్యముకాదు.

లోపల ధర్మబుద్ధి లేకుండా, వెలుపలకు మాత్రమే ధర్మిష్ఠుడుగా కన్పించడమును డంబము అంటారు. అసుర సంపదలో జన్మించిన వారికి డంబము ఉంటుంది. డంబము నరకమునకు ద్వారము. డంబము యొక్క గర్భములో నుండి ఆడంబరము పుడుతుంది. ఆడంబరముగా జీవిస్తే జీవలక్షణాలు పెరుగుతాయి. ఆడంబర జీవితమునకు అలవాటు పడినవాడు భౌతికముగా కొంత

పురోగతిని సాధించినా, అధ్యాత్మికముగా అధోగతిపాలు అవుతాడు. ఉధాత్తముగా ఆలోచించలేడు. మనస్సును నిదానముగా వుంచుకో లేడు. మాటలో సరళతకాని, స్పష్టతకాని కన్పించదు.

చేసేది మంచిపని అయినా, నిరాడంబరముగా నిరహంకార ముగా, నిర్మలముగా, నిశ్చలముగా చేయాలి. అలా చేస్తే అదృ ష్టము కలుగుతుంది. నిరాడంబరముగా జీవించేవాడు వ్యసనము లకు దూరము అవుతాడు. సభ్యత తెలుస్తుంది. సంస్కారము అల పడుతుంది. ఆత్మలాభము కాంక్షించేవాడు ఆడంబర జీవిత మును వదులు కోవాలి. సాధకునికి నిరాడంబర జీవితమే ప్రాణము పోస్తుంది.

కొంత మందికి ధనకాంక్షతోపాటు, కీర్తి కాంక్ష కూడ వుం టుంది. కీర్తికాంక్షను జయించటము ఉత్తమోత్తములకు కూడా కష్టము. ఆధ్యాత్మిక రంగములో ఎంతో అభివృద్ధి సాధించిన సాధ కులను కూడా కీర్తికాంక్ష విడిచి పెట్టదు. కీర్తి కాంక్ష అహం వృత్తిని పెంచుతుంది. కీర్తి కాంక్షను దాటలేనివాడు దేహవాసనను, లోక వాసనను అతిక్రమించలేడు. సత్యాన్వేషకునికి కీర్తికాంక్ష చిట్టచివరి వరకు అడ్డు పడుతూనే వుంటుంది. నామ రూప దృష్టిని పెంచు తుంది. ఆత్మబుద్ధిని కలుగ నివ్వదు.

కీర్తి ప్రధానముగా పెట్టుకొని పనిచేసేవాడు, అజ్ఞానపు పొర లలో చిక్కుకుంటాడు. కామక్రోధములను జయించుట కంటే కీర్తికాంక్షను జయించుట కష్టము. ఈశ్వర దర్శనమునకు కీర్తి కాంక్ష అడ్డు గోడగా నిలబడుతుంది. నిరంతరము ఈశ్వరుని స్మరిం

చుట వలన మాత్రమే అడ్డు గోడను పడగొట్టగలవు. ఈశ్వరాను గ్రహము లేకుండా కీర్తి కాంక్ష వదలదు. కీర్తి కోసం దానం చేయ డంకంటే గుప్తదానము ఉదాత్తమైనది. గుప్తదానమునకు ఈశ్వరుడు సంతోషించి ముక్తికి మార్గమును చూపిస్తాడు.

## 22

సంపద, సౌందర్యము, కీర్తి ఉన్నవారు వాటితోటి సమాన ముగా వినయమును పెంచుకోవాలి. వినయమే నిజమైన సంపద. ఈ సంపదను దేవుని బ్యాంకులో వేసుకోవచ్చును వినయము కీర్తి కాంక్షను పలుచబడేటట్లు చేస్తుంది. కీర్తి కాంక్షను త్యజించకుండా మనస్సును, ఇంద్రియములను జయించలేవు. ప్రజ్ఞను పెంచుకో లేవు. ఏనాటికైనా వినయము లేనివాడు విజ్ఞానమును సంపాదించ లేడు.

విద్యార్జనకైనా, ధనార్జనకైనా వినయము ముఖ్యము. విన యము లేనివాడు జీవితములో ఏ రంగములో కూడా రాణించలేడు. వినయము లేనివాడు దేవతానుగ్రహమును పొందలేడు. వినయము నటించుట వలన రాదు. భగవంతుని యందు భక్తి, తోటి మానవుల పట్ల గౌరవము ఉన్నవారికి వినయము వస్తుంది. గొయ్యిని త్రవ్వు టకు గడ్డపార ఎంత అవసరమో భగవదనుభవమును పొందుటకు వినయము కూడా అంతే అవసరము.

ఆత్మ లాభము పొందుటకు ప్రయత్నించేవాడు వినయము లేకపోతే దానిని సంపాదించు కోవాలి. విధేయత, వినీతత గలవానిని

ఎన్ని క్లిష్ట సమస్యలకు గురిచేసినా నిర్వికారంగానే వుంటాడు. చమురు లేకుండా దీపము ఏవిధముగా వెలుగదో అదేవిధముగా వినయము లేకుండా మనస్సులో పరివర్తనరాదు. దైవము పట్ల విశ్వాసము కుదరదు. వినయము కలవాని మనస్సు అంతర్ముఖమై ఆత్మదర్శనమునకు సహకరిస్తుంది.

## 23

సద్వాసనలను అభివృద్ధి చేసుకొని దుర్వాసనలను ఎలా తొల గించుకోవాలో తెలుసుకొన్నాం. ఇప్పుడు ద్వంద్వముల నుండి ఎలా బయట పడాలో తెలుసు కుందాం. ద్వంద్వములను దాటిన వాడికి మాయ దారి ఇస్తుంది.

రాగద్వేషములను, నామరూపములను, సుఖ దుఃఖాలను ద్వంద్వములని అంటారు. ఇవి అన్ని కలిసి మనస్సును బంధిస్తాయి. ద్వైత బుద్ధి ద్వంద్వములను పెంచుతుంది. ద్వంద్వములలో చిక్కుకున్నవాడికి చైతన్య స్థాయి పెరుగదు. ఆలోచించే అలవాటు తగ్గుతుంది. ఆలోచన లేకపోతే బుద్ధికి పని ఉండదు. తనను తాను తెలుసుకొనుటకు దుర్బుద్ధి పీడ వదిలించుకొని సద్బుద్ధిని సంపా దించుకోవాలి.

ద్వంద్వములలో చిక్కుకున్నవాడు సమాజమునకు అజ్ఞాన మును పంచిపెడతాడు. కలహాలమునకు కారణము అవుతాడు. మాయ మాటలు, తుంటరి మాటలు ప్రచారము చేస్తూ సంఘములో అగ్ని

పుట్టిస్తాడు గృహములను శ్మశానముగా మార్చుటకు ప్రయత్నిస్తాడు. ద్వైత భావన గలవాని గుండె చప్పుడు తెలుసుకొనుట కష్టము, ద్వంద్వములు బలీయములైతే వంచకులుగా, తాంత్రికులుగా మారుతాయి.

ఇంద్రియ శుద్ధిలేనివాడు ద్వంద్వములను జయించలేడు. ద్వంద్వములకు దూరమగుటకు సహృదయము, సౌజన్యము, తపోబలము అవసరము ద్వైత బుద్ధిని విడనాడితే గాని అద్వైత. స్థితిని అందుకోలేవు.

ప్రతిమనిషి హృదయములో రాగము ఉంటుంది. ద్వేషం ఉంటుంది. ఈ రెండు మనిషికి శత్రువులే. రాగంతో, ద్వేషంతో, కామంతో, క్రోధంతో చేసిన పనుల వల్లనే ఈ దేహం వస్తుంది. రాగద్వేషాలే లేకపోతే దేహోత్పత్తి ఉండదు. రాగద్వేషములే అశాంతికి, దుఃఖానికి కారణము. ఆత్మజ్ఞానమునకు అడ్డు తగిలేవి రాగద్వేషములే. అందువలన సర్వవిధముల ప్రయత్నము చేసి వాటిని తొలగించుకోవాలి.

నిన్ను ఎవరైతే పొగిడితే రాగం పుడుతుంది. విమర్శిస్తే ద్వేషం పుడుతుంది. రాగం అంటే ప్రీతి, ద్వేషం అంటే ఏవగింపు మోహమువల్ల రాగము పుడుతుంది. బుద్ధిలోని దోషమువల్ల ద్వేషం పుడుతుంది. ఈలోకంలోని పేచీలకు, అశాంతికి, దుఃఖానికి రాగద్వేషాలే కారణం నీలో రాగద్వేషాలు ఉన్నంత కాలము మనస్సు బహిర్ముఖము అవుతూనే వుంటుంది. బహిర్ముఖమయ్యే మనస్సుకు ఆత్మసుఖము అందదు.

నీ హృదయములో గూడు కట్టుకొని వున్న అజ్ఞానమే రాగముగా, ద్వేషముగా వ్యక్తము అవుతుంది. కామములో నుండియే రాగద్వేషములు పుడతాయి. రాగద్వేషములు, కామక్రోధములు పైకి వేరుగా కనిపించినా మూలములో ఒక్కటే. నీకు ఏదైతేచెడు చేస్తుందో దానినే నీవు మంచి అనుకొని అసత్యమును సత్యము అనుకొని, అనిత్యము నిత్యము అనుకొని, అనాత్మను ఆత్మ అనుకొని మమకారమును పెంచు కొనుటవలన రాగము పుడుతుంది. నీ యిష్టమునకు ఎవ్వరైనా అడ్డుపడితే ద్వేషము పుడుతుంది. రాగద్వేషములు నీ ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని ఆక్రమించి వివేకమును అణచి నీ హృదయములో నిరంతరము స్వయముగా ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకోకుండా చేస్తున్నాయి.

నీ మనస్సు కుదురుగా ఉండక పోవటానికి, నీ బుద్ధి స్థిరముగా ఉండగా పోవటానికి నీలోని రాగద్వేషాలే కారణం. నిన్ను రాగద్వేషములతో ముంచెత్తేది, సంసార చక్రములో బంధించేది, హింసకు గురి చేసేది, నరకమునకు తీసుకువెళ్ళేది నీ అహంకారమే. రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా, అహంకారమునకే. అప్పుడే ప్రేమించ మంటుంది, అప్పుడే ద్వేషించ మంటుంది. అంటే అహంకారము నిన్ను కుదురుగా వుండనీయదు. మనోమూలము తెలిసే వరకు రాగద్వేషాలు నిన్ను వదలి పెట్టవు.

రాగద్వేషములను హృదయములో నింపుకొని పనిచేస్తే అపని నిన్ను బంధిస్తుంది. మనస్సులో ఎగుడు దిగుడులు లేకుండా, ఆసక్తి లేకుండా పనిచేస్తే విమోచనము కలుగుతుంది. నీ హృదయంలో రాగద్వేషాలు ఉన్నంత కాలము భగవంతునిపట్ల, భగవంతుడు చెప్పిన మాటలపట్ల విశ్వాసము కుదరదు. పసిపిల్లల కోసం

తల్లులు పత్యము ఎలా చేస్తారో అదే విధముగ భగవంతుని కోసం నీ ఇష్టాయిష్టాలను విడిచి పెట్టాలి.

భక్తితోనే రాగద్వేషాలను తొలిగించు కోవాలి. భక్తి వలన మగిస్సునకు ప్రసన్నత చేకూరుతుంది. దైవ ప్రసాదమే ప్రసన్నత. దైవ ప్రసాదము లేకుండా మానవుడు ఉన్నదానిని ఉన్నట్లుగా, లేనిదానిని లేనట్లుగా తెలుసుకోలేడు.

## 24

ఈసృష్టిలో ఏది అంటే నీకు ఎక్కువ ఇష్టం? నీ రూపం అన్నా, నీ నామము అన్నా నీవు ఎక్కువ యిష్ట పడతావు. నీకొక పేరుంది. ఆపేరుతో పిలిస్తేనే నీవు పలుకుతావు. ఆ పేరే నీయొక్క గుణగుణాలను తెలుపుతుంది. ముందు నీ రూపము వచ్చింది. తరువాత ఆరూపానికి ఒక పేరు వచ్చింది. నీవు ఈ నామరూపాలతో కలిసిపోయి జీవించు చున్నావు నీ రూపాన్నిగాని, నీ నామాన్నిగాని, ఎవరైన విమర్శిస్తే నీకు కోపము వస్తుంది. రోషం వస్తుంది. పేచీలకు దిగుతావు. నీ రూపాన్ని, నీ నామాన్ని, బలపరుచు కొనుటకు నీ కాలాన్ని, ధనాన్ని, శక్తిని, యుక్తిని వృధా చేస్తున్నావు.

నీ హృదయంలో ఉన్నదే ఈలోకంలో కనిపిస్తుంది. నీ హృదయంలో లేనిది ఈ లోకంలో కనిపించదు. నీ హృదయంలో ఉన్న వాసనలే బయట నామరూపాల క్రింద కన్పిస్తాయి. నామరూపము లతో కనిపిస్తున్న ఈలోకము ఎంత కాలమైతే నిజంగా కనిపిస్తుందో

అంత కాలము నీ మనస్సు బహిర్ముఖము అవుతుందేగాని అంతర్ముఖము కాదు. సంకుచితమైన మనస్సు నామరూపాలతో కూరుకొని పోతుంది. విశాలమైన మనస్సు నామరూపాలను దాటుతుంది.

నీ మనస్సు రూపాన్ని ఆకర్షించినట్లుగా రూప రహితమైన "ఆత్మ" ను ఆకర్షించలేదు. సహజముగా రూపమునకు ఆకర్షించే గుణము ఉన్నది. నామరూపదృష్టి అజ్ఞానమును పెంచుతుంది. అజ్ఞానములో నుండియే అహంకారము పుడుతుంది. నామరూపములే అహంకారమునకు మేత. నీ అహంకారము ఎప్పుడు ఏవో ఒక రూపంవెంట, ఏదో ఒక నామంవెంట తిరుగుతూనే వుంటుంది. నామ రూపాత్మకమైన బుద్ధి లోకవాసనలో కూరుకొని పోతుంది ఆత్మ సిద్ధికి లోకవాసన పెద్ద ప్రతిబంధకము. నామ, రూపదృష్టిని త్యజించి పనిచేస్తే నీ మనస్సు విశాలమైన నామ, రూప రహితమైన "ఆత్మ" ను అందుతుంటుంది.

నీవు నామరూపాలకు అలవాటు పడి ఉన్నావు. కాబట్టి భగవంతున్ని నామాన్ని, రూపాన్ని పట్టుకొని ధ్యానిస్తే, అంతకుముందు ఏ నామరూపములు అయితే నిన్ను బంధిస్తున్నాయో అవి క్రమ క్రమముగా ప్రక్కకు తప్పుకుంటాయి. నిరంతరము భగవంతున్ని భజించడం వలన నామ రూపదృష్టి సన్నగిల్లుతుంది. భగవంతుని రూపాన్ని నామాన్ని నీ హృదయములో కట్టివేయాలి. ఎన్ని కష్టములు వచ్చినా సరే భగవంతుని రూపాన్ని, నామాన్ని విడిచి పెట్టకూడదు.

కొంతమందికి రూపము అంటే యిష్టము. మరికొంతమంది నామంఅంటే యిష్టము. భగవంతుని రూపము ఆరాధించుట కంటే

భగవంతుని నామమును స్మరించుట మంచిది. భగవంతుని నామం చేసేటప్పుడు ప్రీతిగా చేస్తే మనస్సునకు ఏకాగ్రత కుదురుతుంది నిరంతర నామ స్మరణ మనస్సును శుద్ధిచేస్తుంది. పరిశుద్ధమైన మనస్సు మాత్రమే ఆత్మాకారము చెందుతుంది. శరీరమునకు స్నానం ఎటువంటిదో మనస్సునకు భగవంతుని స్మరణ అటు వంటిది.

భగవంతుని నామరూపాలను ధ్యానించుట వలన నీ హృదయములోని దుష్ట సంస్కారములు రాలిపోయి, మంచి సంస్కారములు పుట్టుకొని వస్తాయి. భగవంతుని నామం మీద పూర్తి విశ్వాసము వుంచి, నిరంతరము భగవంతుని నామమును స్మరిస్తే, ఆ నామమే నావలాగ ఉపయోగపడి మనస్సు అనే మహా సముద్రము నుండి దాటిస్తుంది.

అవతార పురుషుల యొక్క చిత్రపటములను చూచుట వలన, వారి నామము స్మరించుట వలన, వారి ప్రసాదము నీకు అందుతుంది. వారి ప్రసాదము వలన మాత్రమే నీ స్వరూపమైన ఆత్మను తెలుసుకొని అమృతత్వమును పొందుతావు.

## 25

ప్రతి మనిషికి సుఖం కావాలి. కాని ఆ సుఖం ఎక్కడ వుందో, ఎక్కడ నుండి వస్తుందో ఎప్పుడైనా గమనించావా ? ఏ సుఖం కోసం అయితే నీవు వెదుకుతున్నావో ఆ సుఖం బయటలేదు

నీహృదయములోనే ఉంది. దేహంలో సుఖం లేదు. మనస్సులో సుఖంలేదు. విషయాలలో సుఖం లేదు. ఆత్మలోనే సుఖము ఉంది. ఆత్మలో సుఖము లేకపోతే నిద్రలోకూడా సుఖంవుండదు. మానవుడు సుఖము కోసమే నిద్రను కోరుకుంటున్నాడు. నిద్రలో దేహస్పృహ, లోకస్పృహ లేకపోయినా సుఖముగానే వుంటుంది.

సుఖము, ఆనందము, ఆహ్లాదము, పర్యాయ పదములు, మానవుని స్వరూపమే సుఖము, అందువలన మానవుడు తనంటేనే తాను ఎక్కువ యిష్టపడతాడు. అహంకారము కాటేస్తున్నంత కాలము మానవునికి తన స్వరూపసుఖము అందదు. మోహములో పడిన వాడికి మోక్షము, శాంతి, కాంతి అందవు. మోహం అంతమైన వెంటనే సుఖం వ్యక్తమౌతుంది.

మానవుడు భోగాన్ని కోరుకుంటాడు. ఎందుచేతనంటే భోగానుభవములో సుఖము వుందని భ్రమించు చున్నాడు కాబట్టి. కాని భోగము గర్భములో దుఃఖము వుందని, భోగము గర్భములో నరకం వుందని, భోగమే అనేక జన్మలకు కారణమౌతుందని తెలుసుకో లేక పోతున్నాడు. ధనము, సైన్సు, టెక్నాలజీ దేహమునకు భోగమును మనస్సునకు కొంత ఓదార్పును కలిగించినా, మానవుని దుఃఖములేని స్థితికి తీసుకొని వెళ్ళలేవు. బహిర్ముఖము అయ్యే మనస్సు భోగమును కోరుకుంటుంది. అంతర్ముఖమైన మనస్సు ఆత్మ సుఖమును రుచి చూస్తుంది.

తాను ఎవ్వడో తనకు తెలియని మానవుడు సుఖి కాలేడు. తనను తాను తెలుసుకొనుటకు దేహమునకు ఆరోగ్యము, మనస్సు

నకు శాంతి అవసరము. శాంత చిత్తములేనివాడికి సుఖము ఎక్కడ నుండి వస్తుంది ? ఆత్మబుద్ధి కలవాడు మోక్ష సుఖమును అనుభవిస్తాడు. దేహబుద్ధి కలవాడు దుఃఖమును అనుభవిస్తాడు. దేహ బుద్ధి దుఃఖమునకు కారణం. దేహబుద్ధి పోనంతవరకు దుఃఖము వెంటాడుతూనే వుంటుంది. దారిద్ర్యయము కంటే దుఃఖమే మానవ మానసమునకు ఎక్కువ పీడిస్తుంది.

నీకు దుఃఖము వస్తున్నదంటే కారణం ఏదో వుండాలి. కారణం లేకపోతే దుఃఖమురాదు. కారణం తెలిస్తేనేకాని దుఃఖము పోదు. నీవు పూర్వజన్మలో ప్రోగు చేసుకొన్న దుష్ట సంస్కారములే నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. మనిషిని తననీడ ఎలా వెంటాడుతుందో దుష్ప్రవర్తన కలవానిని దుఃఖము అలా వెంటాడుతూనే వుంటుంది. దుష్ప్రవర్తన మూఢత్వమును, అజ్ఞానమును పెంచుతుంది. అజ్ఞానమును తొలగించుకొనే వరకు ఏదేహము ధరించిన, ఏ లోకములో నువున్నా దుఃఖము వెంటాడి ముంచుతూనే ఉంటుంది. మంచి స్నేహములు చేయుట వలన, మంచిమాటలు వినుటవలన, మంచిపనులు చేయుటవలన ఆత్మ విశ్వాసము పెరుగుతుంది. "ఆత్మ" విశ్వాసము దుష్ప్రవర్తనను నిర్మూలిస్తుంది. రాగము, భయము, కోపము, ద్వేషము వలన దుఃఖము కలుగుతుంది. దుఃఖ కారణములైన ఇవి అన్నీ త్యజిస్తేనే కాని ఆత్మ సుఖము తెలియదు.

దేహ ప్రారబ్దమును బట్టి నీకు కష్టములు రావచ్చును. కష్టములను చూచి నీవు భయపడవద్దు, పారిపోవద్దు, ఓర్పుగా ఆ కష్టములు భరిస్తే కొత్తవాసనలు పుట్టవు. దేహప్రారబ్దముతో మనస్సును

మేళవించకుండా వుంటే ఉన్న వాసనలు నశిస్తాయి. కష్టములను ఈశ్వర ప్రసాదముగా స్వీకరించాలి. శివుడు విషమును మ్రింగి ఎంత ప్రశాంతంగా వున్నాడో, ఏసు శిలువను మోస్తూ ఎలా అణిగి యున్నాడో, అదే విధముగ సాధకుడు కష్టములను సంతోషముగా అనుభవించాలి. సుఖదుఃఖాలు అహంకారమునకే కాని ఆత్మకు కొంచెము కూడ సంబంధములేదు.

నీవు అనుభవించే సుఖదుఃఖాలు పాలమీద నురుగులాంటివి. నీకు దుఃఖము వచ్చినప్పుడు యిది శాశ్వతము కాదు అనుకుంటే నీ మనస్సు కృంగిపోదు. అలాగే సుఖం వచ్చినప్పుడు యిది కూడా శాశ్వతముకాదు. అనుకుంటే నీ మనస్సు పొంగిపోదు. సుఖదుఃఖాలను సమానముగా స్వీకరించాలి ఎవరైనా నీ అదృష్టాన్ని కొనియాడినప్పుడు మనస్సులో పొంగు రాకుండ, నిర్వికారంగా ఉంటే క్రొత్తవాసన పుట్టదు. కోరికలేని వాడికి కోపము రాదు. కోపములేని వాడికి శోకము రాదు. శోకము లేనివాడే నిజమైన సుఖి.

జరిగేదంతా ఈశ్వర సంకల్పము. అనుకొనేదంతా మన సంకల్పము. ఈశ్వరుని సంకల్పముతో మన సంకల్పము కలిస్తే పని నెరవేరుతుంది. కలవకపోతే ఆపని నెరవేరదు ఈశ్వర సంకల్పము బలీయమైనది. ఇది అర్థమైతే మానవుడు ఈశ్వరుని మీద భారము వేయగలడు. ఆయన ఎంత భారమునైనా మోయగలడు. ఈశ్వరుని మీద భారము వేసి తన పనిని తాను చేసుకొనే వాడికి కర్తృత్వము విడిచి పెడుతుంది. ద్వైత భావన విడిచి పెడుతుంది. దుఃఖము ముట్టుకోదు. శాంతిలో స్థిరపడతాడు.

# 26

మనస్సు చంచలమైనది. గాలికంటే వేగమైనది. గాలిని నిరోధించుట ఎంత కష్టమో మనస్సును నిగ్రహించడం అంతకంటే ఎక్కువ కష్టము. చలించే మనస్సును, పరిగెత్తే మనస్సు ఎలా పట్టుకోవాలో, ఎలా అణచాలో, ఎలా బంధించాలో నేర్చుకొనుటయే నిజమైన విద్య. అభ్యాసము వైరాగ్యము, ఉపాసన మనస్సును నిగ్రహించుటకు సహకరిస్తాయి.

నీ హృదయములోనే ఆనంద సాగరము వున్నది. ఆ సాగరములోనికి దిగకుండ నీ మనస్సే అడ్డుపడుచున్నది. యోగమును అభ్యసించి మనస్సును నాశనము చేస్తే ఆనందము అనుభవములోనికి వస్తుంది. సూర్యుడు ప్రకాశిస్తున్నప్పుడు ఆ తేజము నిన్ను ఆవరిస్తుంది. కాని సూర్యుణ్ణి చూడాలంటే నీ కళ్ళను సూర్యుని వైపు త్రిప్పాలి. అలాగే నీలో ఆత్మ సర్వదా ప్రకాశిస్తూనే వుంటుంది. కాని ఆత్మను దర్శించాలంటే నీ మనస్సును ఆత్మవైపుకు త్రిప్పాలి.

ఆత్మను అన్వేషించడమే మొదటి పని చివరిపని కూడా ఆత్మన్వేషణాబుద్ధి కలిగిన వెంటనే అజ్ఞానము పలుచ బడటం ప్రారంభ మౌతుంది. అజ్ఞానముపోతే ఆత్మ మిగులుతుంది. నీహృదయములో నున్న అజ్ఞానాన్ని తొలిగించు కొనుటకు అభ్యాసము అవసరము. ఒకే తలంపు మీద మనస్సును నిలిపి, ఇతర తలంపులను నిరోధించుటయే "అభ్యాసము." ఆత్మయందే మనస్సు ఉండేటట్లు చేసి, యితర తలంపులను నిరోధించటం అభ్యాసము చేయాలి.

ఈవిధముగా అభ్యాసము చేయగా చేయగా నీలోని తలంపులు వాసనా సహితముగా రాలి పోతాయి. నేర్చుకొన్నది శాశ్వతము కాదు. నీవు నేర్చుకొన్న మంచి విషయములను అభ్యాసము చేస్తే అవి నీ సొంత మౌతాయి. అభ్యాసానికి సాధ్యము కానిది. అంటూలేదు. ఆత్మనిష్ఠ అలవడుటకు వివేకము అవసరము.

చీకటిలో లైటు ఏవిధముగా ఉపయోగ పడుతుందో అదే విధముగా అజ్ఞానమనే చీకటి నుండి బయట పడుటకు "వివేకము" అలా ఉపయోగపడుతుంది. ఏది సత్యము, ఏది అసత్యము, ఏది ఆత్మ, ఏది అనాత్మ అని తెలుసుకొనుటకు వివేకమును అవసరము. ఈశ్వరుణ్ణి హృదయ పూర్వకముగా ప్రేమిస్తే ఆయన నీ బుద్ధిని శుద్ధిచేసి, నీ వివేకాన్ని పెంచుతాడు. వివేకమును పెంచుకుంటే ఏనాటికైనా నీ హృదయములో తానుగా ప్రకాశిస్తున్న "సత్యాత్మ" తెలుస్తుంది. వివేకమును ఆచరణలో పెడితే వైరాగ్యమునకు దారి చూపుతుంది.

ఆత్మజ్ఞానము మూడవ నేత్రంలాంటిది వైరాగ్యము లేకుండా జ్ఞానము కలుగదు, వైరాగ్యము లేనివాడు అనాత్మను విడిచి పెట్ట లేడు. అందువలన జనన, మరణ, సంసార చక్రము నుండి విడుదల కాలేడు. విషయ భోగములందు రాగము లేకుండ ఉండు టయే "వైరాగ్యము." కర్తృత్వముచు విడిచి పెట్టి పనిచేస్తే వైరా గ్యము వస్తుంది. కారణ వైరాగ్యము నిలబడదు. వివేకములో నుండి పుట్టిన వైరాగ్యమే నిలబడుతుంది. కోరికతో ఉన్నవాని మనస్సు బహిర్ముఖము అవుతుంది. వైరాగ్యముతో ఉన్నవాని మనస్సు అంతర్ముఖము అవుతుంది.

వైరాగ్య లాభమును పొందినవాడు లోకములో దేనిచేత అకర్షించబడడు. అనుభవించే వస్తువులు ఎదురుగా ఉన్నప్పటికి చిత్తవికారమును పొందడు. వైరాగ్యము కలవాడికి మనస్సులొంగు తుంది. ఆత్మ అందుతుంది. యోగము సిద్ధిస్తుంది. దుఃఖము దూరము అవుతుంది.

వైరాగ్యశస్త్రముతో అజ్ఞానమును నాశనముచేయ వచ్చును. దైహికమైన శక్తికంటే, ఆయుధ శక్తికంటే. అర్థిక శక్తికంటె, వైరాగ్యశక్తి గొప్పది. వైరాగ్యమే నిజమైన సంపద. వైరాగ్యబలంతో శాంత చిత్తమును సాధించ వచ్చును శాంత చిత్తము తనను తాను తెలుసు కొనుటకు సహకరిస్తుంది.

## 27

విగ్రహాన్ని ఆరాధించి నప్పుడు నీకు శాంతిగా వుంటుంది. ఆ శాంతి ఎక్కడ నుండి వస్తుందో ఎప్పుడైనా గమనించావా ? ఆ శాంతి విగ్రహములోంచి రావటం లేదు. నీ దృష్టిని ఒక రూపముపై లగ్నము చేయుట వలన నీ మనస్సు ఏకాగ్రమై నీ హృదయము లోని శాంతే నీకు అందు చున్నది. ఇష్టదైవముపై మనస్సును నిల బెట్టుటయే "ఏకాగ్రత" ఈశ్వరుణ్ణి పూజించడంవలన, జపించుట వలన మనస్సునకు ఏకాగ్రత ఉదురుతుంది. పవిత్రత చేకూరు తుంది. ఏకాగ్రతను సాధించుటకు ధర్మప్రవృత్తి సహకరిస్తుంది. నందీశ్వరుడు పరమేశ్వరుణ్ణి ఎంత ఏకాగ్రతగా చూస్తాడో, అదేవిధ ముగా ఈశ్వరునిపట్ల జీవునికి అంత ఏకాగ్రత ఉదిరితే జ్ఞానోదయం అవుతుంది.

బాహ్య విషయముల వెంబడి పరిగెత్తే మనస్సును ఏకాగ్రము చేయుట కష్ట సాధ్యము. ఏనుగు తొండము ఎప్పుడును చలించుచుండును. ఆ తొండముపై ఒకగొలుసు పెట్టినచో ఏనుగు దానినే పట్టుకొని ఉంటుంది. అదే విధముగ సదా చలించే మనస్సును భగవంతుని రూపముపైనో, నామముపైనో నిలిపితే దానినే పట్టుకొని ఉంటుంది. సాధ్యమైనంత వరకు ప్రకృతి వాసనలు తగ్గించుకొంటే మనస్సు తేలిక బడుతుంది. నిరంతరము మనస్సును ఆత్మలో నిలుపుటవలన వాసనలు తలంపులుగా మారవు. మనస్సుకు ఏకాగ్రత చేకూరితే జ్ఞానము సముపార్జన సులభ తరము. ఏకాగ్రత కలవాడు లోకములో దేనినైనా సాధించగలడు.

అద్దమును తుడవకపోతే నిప్రతిబింబము ఎలా స్వచ్ఛముగా కనబడదో, అలాగే బుద్ధిని పరిశుద్ధము చేసుకొనకపోతే ఆత్మ గోచరము కాదు. భగవంతుడు మనస్సును శుద్ధి చేసుకోవటం కోసం కర్మను సృష్టించాడు. నీవు దాన ధర్మాలు చేసినా, యజ్ఞయాగాలు చేసినా, పూజ, జప, ధ్యానాదులు చేసినా మనస్సు శుద్ధి అవటం కోసం, నిర్మలమగుట కోసం, ఏకాగ్రము అవటంకోసం, పవిత్రము అవటం కోసం చేయాలి. ఈ జన్మలోనైనా, మరుజన్మలోనైనా, ఈ లోకంలోనైనా, ఏ లోకంలోనైనా, పవిత్రత అనే గుమ్మము ద్వారానే ఆత్మ అనే సొంత యిల్లు చేరాలి.

పరమేశ్వరుని తత్త్వమును తెలుసు కొనుటకు పవిత్రత ముఖ్యము. ఆధ్యాత్మిక జీవితమునకు పవిత్రత మొలక వంటిది. అహంకారమును అనుసరించటం మానుకొని అవతార పురుషులను అనుసరిస్తే పవిత్రత చేకూరుతుంది. సాధన సామాన్య మానవుని

పరమ పవిత్రునిగా మారుస్తుంది. వైషమ్యబుద్ధిని పోగొడుతుంది. దైవాన్ని (ఆత్మను) స్మరించుట చేతనే మానవుడు పవిత్రీకరించ బడతాడు. పవిత్రత, ప్రవీణత సహాయముతో యింద్రియములను కూడా జయించ వచ్చును.

ఎవని హృదయములో ఆకర్షణలేదో, మరకలులేవో, బరువులు లేవో, ఎవ్వడైె తేతన పర్వస్వమును ఆత్మను తెలుసు కొనుటకు అం కితము చేస్తాడో వాడు మాత్రమే పావనుడు అవుతాడు. పవిత్రత అగ్ని హెూత్రంతో సమానము. భౌతిక మైన అగ్ని శరీరమును దహి స్తుంది. జ్ఞానాన్ని జీవత్వమును దహిస్తుంది. అరచేతిలోని వస్తువు ఎంతస్పష్టముగా కనిపిస్తుందో, పవిత్రునికి మంచి తనము విలువ అంత స్పష్టముగా తెలుస్తుంది. పవిత్రునికి లోకమంత దైవముగానే కనిపిస్తుంది. నరుణ్ణి నారాయణునిగా (ఆత్మగా) చూస్తాడు.

నీ హృదయములో త్రికరణశుద్ధి, పవిత్రత ఉంటే నీవు చిన్నపని చేసినా ఈశ్వరుడు ఉప్పొంగిపోయి నీ స్వరూపమును నీకు పట్టిస్తాడు. చేతిలోవున్న ముద్దను నోట్లో వేసుకోవటం ఎంత తేలికో పవిత్రతవున్న జీవుడికి జ్ఞానము కలుగుట అంత తేలిక.

## 28

మనస్సు నిలబడేందుకు ఏఏమార్గములు సహకరిస్తాయో ఇప్పుడు తెలుసు కుందాం. నిరంతరము భగవంతుడిని పూజించ టానికి, ఆరాధించటానికి, ధ్యానించటానికి "భక్తిమార్గము" సహక

రిస్తుంది. నిరంతరము మనస్సును ఒకే తలంపుపై నిలబెట్టి ఇతర తలంపులను నెట్టి వేయుటకు "ధ్యానమార్గము" సహకరిస్తుంది. బహిర్ముఖమయ్యే మనస్సు నిరోధించి అంతర్ముఖము చేయుటకు "విచారణా మార్గము సహకరిస్తుంది. నీ అర్హతనుబట్టి, మనస్సు యొక్క అంతస్తును బట్టి ఏదో ఒక మార్గమును ఎంచుకొని ఆత్మ లబ్ధిని పొందవచ్చును.

దైనందిన జీవితంలో "పూజకు" చాలా ప్రాముఖ్యత ఉంది, ఇష్ట దైవాన్ని పువ్వులతో అందముగా అలంకరించి స్తోత్ర, ధీప ధూప, నైవేద్యములతో దైవాన్ని అరాధించుటయే పూజ. దైవాన్ని చేతులతో పూజించటంవలన, నోటితో జపించటం వలన, మనస్సుతో ధ్యానించటం వలన, అజ్ఞానపు గోడలు కూలిపోతాయి. మోక్షమునకు దారి కనిపిస్తుంది.

నీవు యిచ్చే పళ్ళకోసము, నీవు వేసే దండల కోసము, నీవు పెట్టే దండాలు కోసము, నీవు సమర్పించే దక్షిణలకోసము భగవంతుడు ఎదురు చూడడు. ఎప్పటికైనా నీ అహంకారమనే ఏకైక పుష్పాన్ని ఆయన పాదాలకు అర్పిస్తావేమోనని ఎదురు చూస్తూ వుంటాడు. భగవంతునకు వేరుగానున్న ఫలపుష్పాలతోకాదు భగవంతుని పూజించ వలసినది, సద్గుణాలతో పూజించాలి, నీ హృదయ కుసుమాన్ని భగవంతునికి నైవేద్యముగా సమర్పించాలి. నీ స్వరూపమైన ఆత్మ యందు నిలకడగా ఉండగలిగితే దానికిమించిన పూజ ఈ సృష్టిలో లేనేలేదు.

పూజ చేస్తున్నప్పుడు నీ మనస్సు భగవంతుడిని విశ్వసిస్తున్నట్లు నటించి ఇంద్రియములను పూజా కార్యక్రమములకు

వదలితాను ఎక్కడెక్కడో తిరుగుతూ నిన్ను మాయలో పడవేస్తుంది. నీవు చేస్తున్న పూజను చూచి భగవంతుడు సంతోషించడు, నీ హృదయములోనున్న భావమును చూస్తాడు. నీవు చేసే పూజ నీ ఇంద్రియములను, మనస్సును క్రమశిక్షణలో పెట్టకపోతే ఆపూజయొక్క ప్రయోజనము ఏమిటి? బాహ్యవిషయముల నుండి మనస్సును మళ్ళించి దైవముతో అనుసంధానము చేస్తే జీవలక్షణములు పోతాయి.

పూజ జీవుడికి ఈశ్వరునికి ఉన్న అనుబంధమును పెంచుతుంది. ఈశ్వరునిపట్ల కృతజ్ఞతను కల్గియుండుటకు, శరణాగతిని పెంచు కొనుటకు పూజ సహకరిస్తుంది పూజ క్రమశిక్షణను నేర్పుతుంది. ఏకాగ్రతను సమకూరుస్తుంది. మనస్సులో ఉన్న మాలిన్యమును తొలగిస్తుంది. పరిశుద్ధమైన మనస్సుకుగాని పరమాత్మ దర్శనము కాదు.

భగవంతుడిని పూజించేటప్పుడు, ప్రార్థించేటప్పుడు, భగవంతుణ్ణి లక్ష్యముగా పెట్టుకోవాలి. ఇతర ప్రయోజనములను కోరకూడదు. భగవంతుడిని పూజించేటప్పుడు, భజించేటప్పుడు, భగవంతునియందు నీ వ్యక్తిత్వము లీనముచేస్తే మనస్సు నిర్మలమవుతుంది. పూజామందిరములో భగవంతునికి చోటు యిచ్చినట్లే నీ హృదయములో భగవంతునికి కొంచెము చోటుయిస్తే నీ హృదయమంతా ఆయనే నిండిపోతాడు.

అహంకారము లేకుండా, స్వార్థము లేకుండా, ఆసక్తిలేకుండా సహృదయముతో పనిచేస్తే అది పనికాదు పూజే. పూజను పనిని

వేను చేయకండి. పూజ చేస్తున్నప్పుడు ఎంత వినయముగా. ఎంత భక్తిగా చేస్తున్నారో అదేవిధముగా పనిని కూడా చేయాలి. పనిలో భగవంతుణ్ణి చూడటం నేర్చుకోవాలి. సకామ కర్మ నిన్ను బంధిస్తుంది. నిష్కామ కర్మ నిన్ను అజ్ఞానము నుండి విడుదల చేస్తుంది.

భగవంతుణ్ణి పూజించటం, భజించటం, కీర్తించటం, ఉపాసించటం, జపించటమును "భక్తి" అని అంటారు. ఆధ్యాత్మిక పురోగమనమునకు, మానసిక స్వచ్ఛతకు భక్తి అవసరము. మర్యాదగా మాట్లాడటం, మంచిగా ప్రవర్తించటం కపటము లేకుండ జీవించటం భక్తినుండి నేర్చుకోవలసిన పాఠములు. నీలోనున్నతెలివి తేటలు పక్వమునకు వచ్చి హృదయములోనికి దిగితే జ్ఞాన జిజ్ఞాస కలుగుతుంది. నీలోనున్న జ్ఞాన జిజ్ఞాసయే భక్తిగా మారుతుంది. భక్తితో తెలివిని జోడించటం వలన సమగ్రముగా జీవించవచ్చును మానవజన్మ రావటం, భగవంతునియందు భక్తి కలగటం పూర్వ జన్మ సుకృతము.

విద్యను ఎలా అభివృద్ధి చేసుకుంటున్నావో, ధనాన్ని ఎలా అభివృద్ధి చెసుకుంటున్నావొ అలాగే భక్తిని కూడ అభివృద్ధి చేసుకోవాలి. ఈశ్వరకాంక్ష భక్తిని సంపాదించి పెడుతుంది. ధనకాంక్ష ధనాన్ని సంపాదించి పెడుతుంది. ధనంవల్ల భోగము వస్తుంది. భక్తివల్ల మోక్షం వస్తుంది. నీవు సంపాదించిన ధనము ఈజన్మకే పరిమితము. కాని భక్తి మాత్రము జన్మజన్మలకు నీకూడ వస్తుంది. భక్తియే నిజమైన సంపద.

స్వతంత్రముగ ఆలోచించ లేనివాడు ఎవరికో ఒక్కరికి భక్తుడు కావలసినదే! రాజకీయ నాయకులకు భక్తులు ఉన్నారు, సినిమా ఆర్టిష్టులకు భక్తులు ఉన్నారు, క్రీడాకారులకు భక్తులు ఉన్నారు. కానిసత్యానికి(ఆత్మకి) ఎంతమందిభక్తులుఉన్నారు. మన అందరికి భక్తి ఉంది. కాని అది ఎక్కడ ఉండాలో అక్కడ లేదు. జ్ఞానము కోసము పరితపించే భక్తి ఎంతమందికి ఉంది? భక్తి జ్ఞానమునకు మాతభక్తికి జ్ఞానమునకు భేదములేదు. జ్ఞానమే మోక్షము. దైవముపట్ల నీకున్న నిర్మలమైన భక్తి మోక్షమునకు దారి చూపిస్తుంది.

కొంతమంది కోరికలు నేరవేర్చు కోవటం కోసం భక్తిగా ఉంటారు. కొంతమంది కష్టములలో ఉన్నప్పుడే భక్తిగా ఉంటారు. మరికొంతమంది వ్యక్తిత్వమును పెంచుకోవటం కోసం భక్తిగా ఉంటారు. సకామ భక్తివలన అనుకున్నపని నేరవేరినా, భగవంతుని స్వరూపమును మాత్రము పొందలేవు. వైరాగ్యములేని భక్తి అభివృద్ధిచెందదు. నీకు ఈశ్వరునిమీద భక్తి ఉండాలి కారణము వెదికితే హృదయములో కనిపించకూడదు. నిష్కామభక్తి ద్వారా మాయా దోషములను తొలగించుకొన వచ్చును. భోగప్రవృత్తి నుండి బయట పడవచ్చును. సకామభక్తి నిన్ను అజ్ఞానములో ముంచుతుంది. నిష్కామభక్తి నిన్ను అజ్ఞానము నుండి విడుదల చేస్తుంది.

లౌకికులు ఇప్పటి నుండి భక్తి ఏమిటి? అని మిమ్ములను నిరుత్సాహ పరుస్తారు. ఎవరు ఏమిచెప్పినా భక్తిని మాత్రము విడిచి పెట్టకండి. లౌకికులు పన్నిన వలలో పడకండి. లౌకికులతో స్నేహముచేస్తే మీకు ఎంతో కష్టపడి సంపాదించుకున్న భక్తి జారి పోతుంది. భగవంతుని పట్ల భక్తి సన్నగిల్లకుండా స్థిరముగా ఉండే

టట్లు చూచుకోవాలి. నీకు ఏదైన సహాయము కావలసినచో భక్తుల దగ్గఱకు వెళ్ళి అడిగి వారు యిచ్చినది పుచ్చుకోవాలి. లౌకికులు నీకు సహాయము చేయరు సరికదా నిన్ను చులకనగా చూస్తారు. భక్తులే నిజమైన బంధువులు. ఈ విషయము ప్రాణము పోయేవరకు మరువకండి భక్తులు కూడ భగవంతునితో సమానము, లౌకికులతో స్నేహములు మాని భక్తులతో స్నేహము చేయాలి.

నీకున్న సౌందర్యమును ప్రదర్శించవచ్చు, నీ దగ్గఱ వున్న వస్తువులను ప్రదర్శించవచ్చు, కాని భక్తి మాత్రము ప్రదర్శించేది కాదు. నీకు ఈశ్వరునికి ఉన్న సంబంధమే భక్తి. భక్తి ప్రకృతి సొమ్ము కాదు - ఈశ్వరుని సొత్తు. భక్తికి ప్రచారము అక్కరలేదు. భక్తి అతిరహస్యముగా ఉండాలి. భక్తునికి భగవంతునికి భక్తి వారధిలాంటిది. మనిషికి మనిషికి మధ్య రహస్యములు ఉండ వచ్చునేమోగాని, భక్తునికి భగవంతునికి మధ్య రహస్యములు ఉండవు.

కళ్యాణ గణములు కలవాడే నిజమైన భక్తుడు. భక్తునికి బాహ్య సంపదలు ఏమి లేకపోయినా భక్తియే భక్తుని రక్షిస్తుంది తల్లికి బిడ్డలపట్ల ఎంత అనురాగము వుంటుందో, భగవంతునికి భక్తుల పట్ల అంతకంటె ఎక్కువ అనురాగము వుంటుంది. భక్తుడు భగవంతుడే తల్లి, తండ్రి, చుట్టము, స్నేహితుడు సర్వం. భక్తుడు నాశనము కాడు. భక్తునికి దుర్గతిలేదు.

నీకున్న భక్తిని జమైతే నీ బాధలను, నీ దుఃఖాన్ని ఆ భక్తి మింగేయాలి. భక్తి వలన నీకు సంతోషము రాకపోతే, నీశరీరము, మనస్సు పులకరించకపోతే అదిభక్తియే కాదు. భక్తి ఉన్నచోటభయం

ఉండదు. భయం ఉంటే నీలో భక్తితక్కువ ఉన్నట్లే. నీ భక్తి నీళ్ళుకలిపిన పాలులాగా ఉండకూడదు. పొదుగు దగ్గర పాలవలే వుండాలి. ఆహారము జీర్ణము కాకపోతే నీవు ఏదైనమందు వేసు కుంటావు. ఆ మందు కడుపులో ఎలా పనిచేస్తుందో నీకు తెలియదు. జీర్ణము చేయటం ఆమందు పని కాబట్టి జీర్ణము చేస్తుంది. అలాగే నీకు కూడా భక్తి సంపాదించుకుంటే జరగవలసిన పని నీకు తెలియకుండానే జరిగిపోతుంది.

భక్తివలన చపలత్వం పోతుంది బుద్ధి వికసిస్తుంది. మాన సిక స్థాయి పెరుగుతుంది భక్తివలన భేదము నశిస్తుంది. భేదము నశిస్తే భయము వుండదు. నీ హృదయమును బంగారము చేసు కొనుటకు భక్తి అవసరము భక్తి అనే బంగారము నిన్ను భగవం తుని పాదములవద్దకు చేరుస్తుంది నిజమైన భక్తి నీ హృదయములో ఉదయిస్తే ఎన్ని కష్టములు వచ్చినా భక్తి ప్రవాహములో కొట్టు కొనిపోతాయి.

భక్తి అంటే రెండు అక్షరములు అనుకొంటున్నారు. కాని, దాని బరువు మీకు తెలియుటలేదు. భక్తి సామాన్యమైనది కాదు. భక్తిలో ప్రేమ వుంది, వినయము వుంది. శ్రద్ధవుంది భక్తి గొప్ప శస్త్రము లాంటిది. భక్తి నీ హృదయములో నున్న ప్రాపంచక వాసన లను ఛేదించి, దహించి, నిర్మూలిస్తుంది. ఈశ్వర సాక్షాత్కారము లభిస్తుంది.

# 29

గంగానదిలో స్నానము చేస్తే నీ శరీరముపై ఉన్న మాలిన్యము పోవచ్చును. కాని మనస్సులోని మాలిన్యము మాత్రము పోదు మనస్సులోని మాలిన్యమును తొలగించుకొనుటకు మంచితనం అవసరం మంచితనం మనస్సును శుద్ధిచేస్తుంది. మనిషిగా పుట్టిన ప్రతి మనిషి మంచిని పెంచుకొనుటకు ప్రయత్నం చేయాలి. మంచి లోపలికి చూస్తుంది. చెడు బయటకు చూస్తుంది. మంచి బలం లాంటిది. చెడు వాపులాంటిది. మంచిని పెంచుకోవటం కంటే మానవుడు సాధించేది ఏముంది? మంచితనము యొక్క బలముతో ఆత్మ మూత్యమును పొందవచ్చును. మనస్సును బాగుచేసుకొనుటకు, మంచిని పెంచుక్కొనుటకు పూజ, జపము, ధ్యానము ఎంతగానో సహకరిస్తాయి.

చేతితో చేసే పూజ కంటే నోటితోచేసే జపము గొప్పది. నోటితో చేసే జపముకంటే మనస్సుతో చేసే ధ్యానము గొప్పది. భగవంతునియొక్క నామమును, ప్రణవాది మంత్రములను నోటితో ఉచ్చరించుటను వాక్ జపమని, అంతరంగములో స్మరించుటను మానసిక జపమని అంటారు. వాక్ జపముకంటే మానసిక జపము శ్రేష్ఠము వాక్ జపము అభ్యాసము చేయగా చేయగా మానసిక జపమునకు దారి తీస్తుంది. జపము మానసికమైనప్పుడు శబ్దోచ్ఛారణతో పనిలేదు. మానసిక జపమే ధ్యానమౌతుంది.

శారీరక తపస్సు, వాచక తపస్సు, మానసిక తపస్సులేనివాడికి స్థిరబుద్ధి ఉండదు. సమదృష్టి కలుగదు. నిరంతరము

కోరికలతో కాలిపోయేవాడికి, అతిగా మాట్లాడేవాడికి ధ్యానము కుదరదు. ఏకాంతముగా ఉండేవాడికి, మౌనంగా ఉండేవాడికి ధ్యానము కుదురుతుంది. మాటలవల్ల ఉత్పన్నమయ్యే మనః ప్రవృత్తిని అదుపులో ఉంచుటకు మౌనం అవసరము. మౌనము అనగా మాట్లాడకుండా వుండటంకాదు, రాయివలె కదలకుండ ఉండటం అంతకంటే కాదు, మనస్సులో ఎట్టి తలంపులు లేకుండ ఉండటమే మౌనం. చిత్తైకాగ్రతవలన మౌనము సిద్ధిస్తుంది. అవసరమైనప్పుడు మాట్లాడటం, అవసరం లేనప్పుడు మాట్లాడకుండ ఉండటాన్ని వాక్కు మౌనం అంటారు. నోరు మాత్రము మూసుకొని కూర్చుంటేనే చాలదు చిందులు త్రొక్కే తలంపులను నిరోధించాలి. వాక్కు మౌనము అభ్యాసము చేయగా చేయగా మనోమౌనము సిద్ధిస్తుంది. మనస్సు ధ్యానమందే లగ్నమైనప్పుడు వాక్కుతో పనేముంది. మౌనమే ధ్యానము.

కర్మ ఫలమును త్యజించి, కర్మను ఆచరించుట వలన సమభావమును సాధించవచ్చును. సమతను సాధించలేని వాడికి మనిషికి దేవునికి మధ్య భేదము కనిపిస్తూనే వుంటుంది. సమత్వములేనివాడికి శాంతి కుదరదు, రాగము వదలదు. రాగము వదిలితే ఏకరూపము కలుగుతుంది, సిద్ధుడౌతాడు. చేతిలో ఉన్న పనిని వదలకుండ ఏకాగ్రముగా, సమగ్రముగా, శుద్ధిగా, బుద్ధిగా, కళాత్మముగా, సకాలములో చేయుట కూడా ధ్యానముతో సమానము. కావున ధ్యానము ఎక్కువ అని పని తక్కువ అని భావించవద్దు. ధ్యానము చేయుటవలన వచ్చేఫలితమును నిష్కామకర్మ చేయుట వలన కూడ వస్తుంది.

మనస్సు మృదుత్వము, నిర్మలత్వము పొందుటకు ధ్యానమును హృదయ పూర్వకముగా చేయవలెను. ఈశ్వరుడే దిక్కు అని బుద్ధి పూర్వకముగా విశ్వసించిన వాడికి ధ్యానము బాగా సాగుతుంది. పుస్తకాలు ధ్యానము చేస్తే ఆత్మతెలియదు. ఆత్మను ధ్యానముచేస్తే ఆత్మతెలియబడుతుంది. ఉన్నది ఒక్కటే (ఆత్మ) అయినప్పుడు ధ్యానము ఎందుకు చేయాలి ? ఆత్మకంటే వేరుగా యింకొకటి (మనస్సు) కనిపిస్తుంది కనుక ధ్యానము చేయవలసి వస్తుంది. ఆత్మక్రొత్తగా సంపాదించుకొనేదికాదు. నిత్య సిద్ధముగా వున్నదే నీవు చేయవలసినదల్లా చెత్తను చీపురుతో ఊడ్చినట్లుగా, ఆత్మను తెలుసుకోవటానికి అడ్డు వచ్చే ఆటంకాల అన్నింటిని ధ్యానముతో ఊడ్చివేయాలి. ధ్యానమందు శ్రద్ధకలవాడు శాంతిని పొందుటకు అడ్డుగా వున్న రాగద్వేషాలను సంహరిస్తాడు. మోక్షమార్గము నుండి జారడు.

ఆత్మ దర్శనమునకు అడ్డు వచ్చే తలంపులను నెట్టివేయుటకు ధ్యానము సహకరిస్తుంది. ధ్యానముప్రారంభించగానే తలంపులన్నీ కమ్ముకుంటూ నిన్ను ముంచివేయుటకు ప్రయత్నము చేస్తాయి. అప్పుడు ఒకే తలంపుపై నీమనస్సును ఏకాగ్రముచేసి, యితర తలంపులను నిరోధించాలి. ఈవిధముగ తదేక ధ్యానము చేయగా చేయగ మనస్సు ఒకే తలంపుపై స్థిరపడి, యితర తలంపులు బలహీనపడి పలాయనం చిత్తగిస్తాయి. మిగిలిన ఆ ఒక్క తలంపు కూడా తన మూలమైన శుద్ధ చైతన్యములో లయమౌతుంది ధ్యానము ఉత్తమమైన అభ్యాసము. ధృఢమైన ధ్యానమును అభ్యసించుట వలన మనస్సును బయట తిరగకుండా నిరోధించవచ్చును. మనోనిగ్రహమే ధ్యానము యొక్క లక్ష్యము.

ధ్యానము చేస్తునప్పుడు మనస్సు అణిగి వుంటుంది, ప్రకృతి లోనికి రాగానే మరల విజృంభిస్తుంది. అణిగిన మనస్సు ఎప్పు డైనాలేవ వచ్చును. మనస్సు ఆత్మలో లయము అయ్యేవరకు ధ్యాన మును విడనాడ కూడదు. కళ్ళుమూసుకొని ధ్యానము చేయాలా? కళ్ళు తెరచుకొని ధ్యానము చేయాలా? అన్నది ప్రధానము కాదు. మనస్సు ఒకే తలంపుపై స్థిరపడేటట్లు చూచుకోవాలి మొదట ధ్యానము ప్రయత్న పూర్వకముగా ప్రారంభము అవుతుంది ధ్యానం చేయగా చేయగా తనంతట తానే కొనసాగే స్థితి ఏర్పడుతుంది. ధ్యానము సుస్థిరమైనపుడు ఇక అది నిన్ను వదలిపోదు. నీవు ఆడు తున్న, పాడుతున్న, పనిచేస్తున్నా అది అప్రయత్నముగా సాగి పోతుంది ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఎంత సహజముగ జరుగుతాయో అంత సహజముగానే ధ్యానము సాగి పోతుంది.

సాధకుని అర్హతనుబట్టి ధ్యాన పద్దతి ఉంటుంది, పట్టుకో కలిగితే నీ లోపల ఆలోచించేవాడిని సరాసరి పట్టుకుంటే, ఆలో చించేవాడు తన మూలమైన శుద్ధ చైతన్యములో తనంత తానుగా లీనమైపోతాడు. లేకపోతే ఆత్మపట్ల ప్రేమ, విశ్వాసము పెంచుకొని హృదయములో ఆత్మను ధ్యానిస్తే ఆత్మ స్వరూపము తెలుస్తుంది.

ధ్యానమువల్ల నీకు ఆనందము, శాంతి లభిస్తాయి. ధ్యానము వలన ఉత్పన్నమయ్యే మానసిక శక్తి, నీకర్మ ప్రవృత్తులలో కూడ అభివ్యక్తమౌతుంది. ధ్యానము మనస్సు యొక్క పరిధిలో ఉన్న ప్పటికి నీలోనున్న దురభ్యాసాలను బయటకు నెట్టివేయుటకు సహకరిస్తుంది. సంస్కరింప బడకుండా మనస్సులో పరివర్తనము రాదు. ధ్యానము వలన మనస్సు సంస్కరింప బడుతుంది.

ధ్యానము నదీ ప్రవాహమువలె సాగితే ఆత్మ దర్శనమునకు సహకరిస్తుంది.

# 30

"దేవుడు లేడు" అనే మానవుడు వుండవచ్చునేమో కాని "నేను లేను" అనే మానవుడు లేడుకదా ! ప్రతిమానవునిలోను "నేను–నేను" అంటున్నవాడు ఒకడు ఉండటం అందరికి అనుభవములోనున్న విషయమే. నేను అనే ఈ నేను ఎవ్వరో విచారించి తెలుసుకొనుటకు నీవు ప్రయత్నము చేయడం లేదు సరికదా ఈ నేనునే సర్వస్వముగా భావించు చున్నావు.

ఈ నేను దేహముతో తాదాత్మ్యము పొందుటవలన విధులు నీచేత నిర్వర్తించ బడుతున్నాయనుకుంటున్నావు. ఈ నేనును ఆధారముగా చేసుకొని ఏ సంకల్పము వచ్చినా ఆ సంకల్పమే నీవు అనుకొని ఆసంకల్పా లన్నింటిని సంతృప్తి పరుస్తున్నావు. నీ యుక్తిని, శక్తిని, ధనాన్ని, కాలాన్ని, వృథా చేస్తున్నావు. కాని ఈ నేనే నీ సమస్యలకు, బాధలకు, జన్మలకు హేతువు అని గ్రహించ లేక పోతున్నావు. ఈ నేనును ఆశ్రయించి జీవించేవాడు జీవితము పొడుగునా అజ్ఞానము చేతిలో బంధిగానే ఉండిపోతాడు. ఈ నేను యొక్క మూలము తెలిసే వరకు అజ్ఞానము నుండి, బంధమునుండి విడుదల కాలేదు.

నీ దేహములో నేను అనే తలంపు ఎక్కడ పుడుతుందో అదే "మనస్సు" పుట్టుచోటు. ఈనేను ఎక్కడ నుండి పుడుతుందోనని

విచారణచేస్తే హృదయములో నుండి అని తెలుస్తుంది అంటే సాక్షాత్తు ఆత్మ దగ్గర నుండుయే నేను అనే తలంపు వచ్చుచున్నది. మనస్సు యొక్క ప్రథమ తలంపే నేను. ఈ మొదటి తలంపునే అహంకారము అని అంటారు. నీకు వచ్చే తలంపు అన్నింటిలోను నేను అను తలంపే ప్రధానమైనది. ఈ నేను అనే ప్రధాన తలంపును ఆధారముగా చేసుకొని సమస్త తలంపులు పుట్టుకొని వస్తాయి. ఈ తలంపులే నీ దేహాన్ని నడుపుతాయి.

పరమాత్మ నేను (ఆత్మ)గా నీహృదయములో నిరంతరము స్వయముగా ప్రకాశిస్తున్నాడు. ఇదే నీకు అనుభవములో లేని "ఆత్మగతమైన నేను." నీకు అనుభవములో నున్న నేను దేహగతమైన నేను (మిథ్యా). మిథ్యానేను ఆత్మ (అసలు నేను) నుండి వెలువడిన ఒకరశ్మి. ఆత్మలేనిదే మిథ్యానేను లేదు. కాని మిథ్యా నేను తాను పుట్టుచోటు (ఆత్మ)ను మరచి దేహముతో తాదాత్మ్యము పొంది అది-ఇది అంటూ నిన్ను అయోమయ పరిస్థితిలో పడేస్తుంది. అసలు నేను (ఆత్మ) దేహముతో తాదాత్మ్యము పొందదు. అదిగాను -ఇదిగాను వుండదు. మిథ్యా నేనుకు ఆధారముగానున్న చైతన్యము (ఆత్మ)ను గ్రహించేవరకు జడం నుండి విడువడలేవు. ఈ మిథ్యా నేను పరిధిలో వున్నంత కాలము అది సృష్టించిన విషయాల చుట్టూనే నీవు తిరుగుతూ వుంటావు. అది అంతరించినప్పుడే అది సృష్టించిన విషయములు కూడ అంతమొందుతాయి. దేహగతమైన, అహంకార రూపమైన మిథ్యానేను వదలి దాని మూలములో నున్న అసలునేనును పట్టుకుంటే నీ స్వరూపము నీకు తెలుస్తుంది.

మిథ్యానేను మూలముతోనున్నదే అసలునేను(ఆత్మ) అసలు నేను జాగ్రత్, స్వప్న, సుషుప్తిల మూడింటిలోను వుంటుంది. ఈ మూడు అవస్థలు నీకు అనుభవములో వున్నాయి కాని వాటికి ఆధారముగానున్న ఆత్మ మాత్రము నీకు అనుభవములోలేదు. మిథ్యానేను జాగ్రత్, స్వప్న అవస్థలలో విహరించి సుషుప్తిలో తన స్వస్థానమైన ఆత్మలో అణగివుంటుంది. కావున సుషుప్తిలో నీకు "నేను" అనే తలంపులేదు ఈ మిథ్యానేనుతో కల్పించబడిన జీవుడులేడు, దేవుడు లేడు, లోకములేదు. ఈమూడు లేనప్పుడు కూడా నీవు గాఢనిద్రలో సుఖముగా వున్నావు. గాఢ నిద్రలోని సుఖము నీకు గాఢనిద్రలో తెలియుటలేదు. మెలుకువ వచ్చిన తరువాతనే నీకు తెలుస్తుంది మిథ్యానేను యొక్క మూలమును తెలుసుకుంటే గాఢనిద్రలో అనుభవించుచున్న సుఖమును జాగ్రదవస్థలో అనుభవించ వచ్చును. గాఢనిద్రలో మిథ్యానేను అప్రయత్నముగా తన జన్మ స్థానమైన ఆత్మ దగ్గఱకు పోవుచున్నది. జాగ్రదవస్థ యందు ప్రయత్న పూర్వకముగ మిథ్యానేనును హృదయములో నిలబెట్టుట అభ్యాసము చేయాలి.

మిథ్యానేను యొక్క మూలమును తెలుసుకొనుటకు విచారణ అవసరము మిథ్యానేను పుట్టుచోటును వెదుకుటయే విచారణ. మిథ్యానేనును ఆత్మయందు ఉంచినచో ఆత్మ విచారణ అవుతుంది. లోకమునందు వుంచినచో లోకవిచారణ అవుతుంది. ధ్యానానికి చేసేవాడు, చేయబడేది, చేయుటం అనే త్రిపుటి వుండాలి. విచారణకు బుద్ధి సూక్ష్మత అవసరము. బాహ్యవస్తువులతో పని లేదు. నేనున్నాను అని చెప్పటానికి అద్దము చూసుకొని చెప్ప నక్కరలేదుకదా! అదే విధముగా నీ అనుభవ పూర్వకముగానున్న నేనును విచారణ చేయుటం సులభము. కావున విచారణామార్గము

విశిష్టమైనది, నూతి అయినది, సులభమైనది. విచారణా పద్ధతి అన్వేషణయే కాని అరాధన మాత్రము కాదు.

నీవు దేహమునకే పరిమితమైన మిథ్యానేను కబంధ హస్తములలో బంధించబడి యున్నావు. ఆ బంధము నుండి బయట పడుటకు "నేనెవ్వడను?" అను విచారణా పద్ధతి ఎంతగానో సహకరిస్తుంది. మనస్సు అన్షే మదపుటేనుగుకు నేనెవ్వడను ? అనే ప్రశ్న అంకుశము లాంటిది. ఇంద్రియనిగ్రహమునకు మనోనిగ్రహమునకు నేనెవ్వడను? అనే ప్రశ్న సహకరిస్తుంది. నేనెవ్వడను ? అనే ప్రశ్న మనస్సును అంతర్ముఖపరచి ఆత్మాన్వేషణకు సహకరిస్తుంది. నేనెవ్వడను ? అను విచారణ ద్వారా మనస్సు యొక్క మూలాన్ని తెలుసుకుంటే మనస్సునకు స్వస్థత చేకూరుతుంది, శాంతి కుదురుతుంది.

తాను ఎవ్వడో తెలియని మానవుడు వాసనలనుండి విడుదల పొందలేడు. నీ హృదయములో దాగియున్న వాసనలు నీ బుద్ధికి అందవు. ఒక్కొక్క వాసనలను తలంపు రూపముగా మిథ్యానేను మెదడునకు తీసుకొని వస్తుంది. నీకు తలంపు రాగానే ఈ తలంపు ఎవ్వరికి అన ప్రశ్నించుకుంటే నాకు అని సమాధానము వస్తుంది. అప్పుడు నేనెవ్వడను? అని ప్రశ్నించు కుంటే నేను తలంపును విడిచి పెట్టి అంతర్ముఖము అవుతుంది. తలంపు బలహీన పడుతుంది. మిథ్యానేనుతో కలసి ఉన్నప్పుడే తలంపునకు శక్తి వుంటుంది, విడిపోయినప్పుడు శక్తిని కోల్పోతుంది. తలంపును విడిచి పెట్టిన "నేను" మాత్రమే అంతర్ముఖము అవుతుంది.

నేనెవడను? అని ప్రశ్నించుచున్నంత మాత్రాన నీకు సమాధానము దొరకదు. విజృంభించే మనస్సును నేనెవడను? అనే ప్రశ్న అడ్డుకొని అణుస్తుంది. మిథ్యానేను అణగి అసలు నేను వెలుంగు వరకు నేనెవడను? అను విచారణ చేయవలెను. ఆత్మ సాక్షాత్కారము అయ్యే వరకు నేనెవడను? అనే విచారణ సూటిగా, నేర్పుగా శ్రద్ధగా హృదయములోనికి చొచ్చుకొని పోయేలా సల్పాలి నేనెవడను? అనే ప్రశ్నకు ఎప్పుడు సరియైన సమాధానము దొరుకుతుందో అప్పుడే ఆత్మ సాక్షాత్కారము అవుతుంది.

నీకు వచ్చే తలంపులను నేనెవడను? అనే ప్రశ్న ద్వారా నిరోధించడం అభ్యాసము చేయగా చేయగా "నేనెవడను" అనే విచారణ నిన్ను పూర్తిగా ఆక్రమించుకొని అప్రయత్నముగా సాగిపోతుంది. అభ్యాసము పరిపక్వమయినప్పుడు విచారణకు పూనిన నేను తన స్వస్థానమైన ఆత్మలో లయమౌతుంది. అచ్చటనే అసలు నేను (ఆత్మ) ప్రత్యక్షముగా ప్రకాశిస్తుంది ఇదే ఆత్మ సాక్షాత్కారము! జ్ఞానము! మోక్షము! సత్యము! స్వర్గరాజ్యము! నిర్వాణము.

## 31

అజ్ఞానము జీవులను ఆడిస్తుంది. ఆత్మసిద్ధి కలిగే వరకు ఏ జీవుడిని అజ్ఞానము విడిచి పెట్టదు. అజ్ఞానము నుండి విడుదల పొందుటకు "జ్ఞాని" సహాయము అవసరము. ఉన్న వస్తువు (ఆత్మ)ను వున్నట్లుగా తెలుసుకోవటమే జ్ఞానము. ఆత్మ తెలియబడకుండ ఆత్మజ్ఞాని కాలేడు. జ్ఞాని దేహము ఈశ్వరుని స్వాధీనములో వుంటుంది. జ్ఞాని దేహము దేవాలయముతో సమానము.

జ్ఞాని మౌన స్వరూపుడు. మౌనము మనకు అర్థముకాదు కాబట్టి మన మీద ప్రేమకొలది జ్ఞాని మాట్లాడతాడు జ్ఞాని దేహము ధరించి వుంటేనేచాలు ఈ లోకానికి మేలు జరుగుతుంది. పుణ్యభూమి అనుకొంటున్న ఈదేశములో రాతిదేవుళ్ళకు యిచ్చే విలువ జ్ఞానికి యిచ్చుటలేదు.

జ్ఞానియొక్క మౌనము బోధిస్తూనే వుంటుంది. జ్ఞానియొక్క మాట కూటా అనుగ్రహమే. సూర్యుని అంటిపెట్టుకొని కాంతి ఎలా ఉంటుందో, జ్ఞానిని అంటి పెట్టుకొని శాంతి అలా వుంటుంది. జ్ఞానిని దర్శించినా, స్మరించినా సద్బుద్ధి కలుగుతుంది. మనస్సునకు చల్లదనము వస్తుంది. జ్ఞాని సమక్షములో బుద్ధికి మాత్రమె గ్రాహ్యమగు శాంతి అనుభవమునకు వస్తుంది.

ఆయనలోని సమస్త వాసనలు జ్ఞానాగ్ని చేత దహించబడతాయి. అందువలన ఆయన హృదయము ఆకాశమంత విశాలముగాను, సముద్రమంత లోతుగాను వుంటుంది. జ్ఞానికి వ్యక్తిభావన వుండదు. తాను కాని దేహముతో తాదాత్మ్యము పొందడు. ఆత్మ ప్రకాశములో నిలకడగా వుంటాడు. జ్ఞాని హృదయములో లోకము లయమౌతుంది. అందువలన జ్ఞాని తనకంటే వేరుగా లోకమును చూడడు. జ్ఞానికి భేదదృష్టితో సంబంధము తెగిపోతుంది భేదదృష్టి లేనివాడు చేసినకర్మ అకర్మ అవుతుంది.

జ్ఞానియొక్క గొప్పతనమును ప్రత్యక్షముగా చూడవలసినదే గాని వర్ణనకు అందేది కాదు. ఆయన అనుభవించే అనందమును గూర్చి వ్రాయుటకు ఈ లోకములో ఉపమానములేదు. నీవు నవ్వితే జ్ఞానికూడ నవ్వుతాడు. నీకళ్ళవెంట నీళ్లువస్తే జ్ఞాని కళ్ళవెంట కూడ నీళ్లు వస్తాయి. జ్ఞాని చేష్టలు చంటిపిల్లల చేష్టలుగా వుంటాయి.

దేవుడు లేడని చెప్పేవాడు కూడ జ్ఞానికి దేవునిలాగే కనిపిస్తాడు. నిజమైన ప్రేమ, సమానత్వము ఒక్క జ్ఞానిలోనే కనిపిస్తాయి.

అజ్ఞాని ఈ "దేహము" నేను అని ఎంత సహజముగా అనుకుంటాడో, జ్ఞాని "ఆత్మ" నేను అని అంత సహజముగా అనుకుంటాడు. అజ్ఞాని తన స్వార్ధము కోసము ఎలా పనిచేస్తాడో, జ్ఞాని లోకక్షేమమునుకోరి అలా పనిచేస్తాడు. అజ్ఞాని ఈ లోకములో జరిగే సంఘటనలకు, సంఘర్షణలకు కలవర పడతాడు. జ్ఞాని ఎటువంటి పరిస్థితిలోను కలవరపడడు. అజ్ఞానిని సంసార సాగరములోవచ్చు ఆటు పోటుల అనే అలలు తాకుతాయి జ్ఞానిని తాకలేవు. అజ్ఞాని విషయములలో విహరించి దుఃఖిస్తాడు. జ్ఞాని ఆత్మలో ఉండి సుఖిస్తాడు.

నీవు లోకము గురించి ఎక్కువగా తెలుసుకుంటున్నావు. నీ గురించి నీవు తక్కువగా తెలుసుకుంటున్నావు. నీవు ఎవరుగా ఉన్నావో నీకు అవగాహన అయితేగాని సృష్టిరహస్యము, జన్మ రహస్యము, దైవరహస్యము తెలియదు. ఎంతో అందమైన ఆశ్చర్య కరమైన అద్భుతమైన ఈ సృష్టి కూడ ఏదో ఒకరోజున ప్రళయంలో నాశనము అయిపోతుంది. ఈ సృష్టిలో నాశనము కానిది "ఆత్మ" ఒక్కటే! "ఆత్మ" దర్శనము అయితే ఈ లోకము ఎంత అనిత్యమో, ఎంత అసుఖమో తెలుస్తుంది.


అజ్ఞానము నుండి బయటపడి జ్ఞానమును పొందుటకు మానవజన్మ ఎంతగానో సహకరిస్తుంది. మరణించే నీ దేహము మరణించక ముందే నీ హృదయములోనున్న మరణములేని సద్వస్తువు (ఆత్మ)ను దర్శించకపోతే ఈమానవజన్మ వ్యర్థం.

దృశ్య విషయముల నుండి మనస్సును మళ్ళించి ఆత్మతో అనుసంధానము చేస్తే నీ హృదయములో గూడుకట్టుకున్న అజ్ఞానము రాలి పోతుంది.

ఈశ్వరుడు ప్రసాదించిన బుద్ధిని శుద్ధిచేసుకొని జ్ఞానమును పొందాలి. జ్ఞానముతో సమానమైనది ఈ లోకములో ఏదీ లేదు. జ్ఞాని మన గమ్యమునకు దారిచూపుతాడు. ఆయన చూపించిన దారి నుండి మనం తప్పిపోకుండా నడవాలి. జ్ఞాని మాత్రమే జీవాత్మను పరమాత్మను ఏకము చేయగలడు.

జ్ఞానులు, అవతార పురుషులు, ప్రవక్తలు, యోగులు, మహర్షుల అనుగ్రహము వలన మనకు జ్ఞానము కలుగుతుంది వారియొక్క అనుగ్రహమును పొందుటకు వారిని ఆశ్రయించి, పూజించి, సేవించి, వారియొక్క బోధనలు విని, అర్ధము చేసుకొని ఆచరిస్తే మోక్ష సుఖమును పొందవచ్చును.

-: ఓం తత్ సత్ :-



## మా రచనలు

1. నిన్ను నీవు తెలుసుకో
2. శ్రీరమణ బోధామృతము
3. అరుణాచల అక్షర మణమాల
4. శ్రీరమణ ఉవాచ
5. పసిడి పలుకులు
6. తేనె పలుకులు

# నిన్ను నీవు తెలుసుకో



కె. ఉషారంగరాజు